


www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★

పుతిన్‌కు రాష్ట్రపతి విందు
రాహుల్, ఖర్గేకు అందని ఆహ్వానం
భారత సరుకులు మరిన్ని కొంటాం
మేము తటస్థం కాదు.. శాంతి పక్షం
05

సంపుటి 28, సంచిక: 166 | శనివారం | 06-12-2025 | హైదరాబాద్ | Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar | పేజీలు: 12 | వెల రూ. 5.00






## విమాన ప్రయాణం గందరగోళం

- గంటల పాటు పలు మార్గాల్లో చిక్కుకున్న ప్రయాణికులు
- సమయ పాలనను ప్లాన్ చేయడంలో ఇండిగో వైఫల్యం
- ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించిన కేంద్రం

**ముంబయి :** దేశంలోనే అతిపెద్ద విమానయాన సంస్థ అయిన ఇండిగో, న్యూఢిల్లీ నుండి బయలుదేరే విమానాలతో సహా దాదాపు 500 విమానాలను రద్దు చేసింది. శుక్రవారం కూడా దేశ వ్యాప్తంగా విమాన ప్రయాణం గందరగోళంలో పడింది. దీని వలన వేలాది మంది ప్రయాణికులు అనేక గంటల పాటు అనేక వివిధ మార్గాల్లో చిక్కుకుపోయారు. దీంతో కేంద్ర ప్రభుత్వంపై ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది. భారతదేశంలోని దేశీయ ట్రాఫిక్‌లో మూడింట రెండు వంతులను నియంత్రించే ఇండిగో, కొత్త పైలట్ విమాన ప్రయాణ సమయ నిబంధనలను ప్లాన్ చేయడంలో విఫలమైనందున తీవ్ర సంక్షోభం ఏర్పడింది. దీంతో ప్రయాణికులు వివాహ విందుల నుండి ఉద్యోగ ఇంటర్వ్యూలు, అంతర్జాతీయ కనెక్షన్‌ల వరకు ప్రతిదీ కోల్పోయారు. ఈ సంక్షోభంపై ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ప్రతిపక్ష పార్టీలు తీవ్రస్థాయిలో మండిపడ్డాయి. దీంతో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) జోక్యం చేసుకుని పైలట్‌లకు కఠినమైన నైట్ డ్యూటీ నియమాల నుండి ఇండిగోకు తాత్కాలిక మినహాయింపు ఇచ్చింది. పైలట్‌ల వారపు తరువాయి 12లో

### ప్రభుత్వ గుత్తాధిపత్యం వల్లే...

'ఇండిగో' సర్వీసుల్లో అంతరాయంపై ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విమర్శ 05

### నిర్వహణ వైఫల్యం

ఇండిగో సంక్షోభంపై తక్షణ, పారదర్శక చర్యలకు సిపిఐ డిమాండ్ 05

## ఐదేళ్లలో భారత్ – రష్యా వాణిజ్యం

# 100 బిలియన్ డాలర్లు

పెంచేందుకు ఇరుదేశాలు పరిశీలన

భారత్ – రష్యా మధ్య 2030 వరకు ఆర్థిక సహకారంపై కుదిరిన అంగీకారం

పుతిన్ – మోదీ 23వ వార్షిక శిఖరాగ్ర చర్చలు

ఉక్రేన్ వివాదం కూడా ప్రస్తావన





మహాత్మా గాంధీ సమాధి వద్ద పుతిన్ ఘన నివాళి 5లో

**న్యూఢిల్లీ :** భారతదేశం–రష్యాల మధ్య 2030 వరకు ఆర్థిక సహకార కార్యక్రమంపై అంగీకారం కుదిరింది. అలాగే ఇరు దేశాల మధ్య వాణిజ్యాన్ని 100 డాలర్‌లకు పెంచే విషయాన్ని పరిశీలించాలని నిర్ణయించాయి. భారతదేశానికి ఇంధన రంగంలో సహకారాన్ని కొనసాగిస్తామని, నిరంతర ఇంధన సరఫరాను కొనసాగించేందుకు రష్యా సంసిద్ధతను వ్యక్తం చేసింది. భారత పర్యటనలో ఉన్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో భారత నరేంద్ర మోదీ శుక్రవారం ఢిల్లీలోని హైదరాబాద్ హౌజ్‌లో 23వ వార్షిక శిఖరాగ్ర చర్చలు జరిపారు. వారి సమక్షంలో 2030 ఆర్థిక కార్యక్రమాన్ని ఖరారు చేయడంతో పాటు, ఆరోగ్యం, చలనశీలత, వలసలు, తరువాయి 2లో



### 16 ఒప్పందాలు / ఎంఒయులు

- ఒక దేశ పౌరులు, మరో దేశ భూభాగంలో తాత్కాలిక కార్మికులుగా పనిచేయడం
- అక్రమ వలసలపై పోరులో సహకారం
- ఆరోగ్యభద్రత, వైద్య విద్య, సైన్స్ రంగాలలో పరస్పర సహకారం
- ఆహార భద్రతా ఒప్పందం
- ధ్రువప్రాంత జలాల్లో నౌకాయానంపై నైపుణ్య శిక్షణకు ఎంఒయు
- ఓడరేవులు, నౌక, జలరవాణా మంత్రిత్వ శాఖ, రష్యా సముద్రయాన బోర్డు మధ్య ఎంఒయు
- ఎరువులపై సరఫరాపై ఒప్పందం
- సరుకు రవాణా, వాహనాల ప్రయాణంపై ముందస్తు రాక సమాచార మార్పిడి ప్రోటోకాల్
- భారత తపాల విభాగం, కమ్యూనికేషన్స్ మంత్రిత్వ శాఖ,జెఎస్‌సి రష్యన్ పోస్ట్ మధ్య ద్వైపాక్షిక ఒప్పందం
- పూణె అడ్వాన్స్డ్ టెక్నాలజీ డిఫెన్స్ ఇన్‌స్టిట్యూట్, నేషనల్ టామ్స్క్ స్టేట్ యూనివర్సిటీ మధ్య శాస్త్రీయ, విద్యాపరమైన సహకారానికి ఎంఒయు
- ముంబాయి యూనివర్సిటీ, లొమొనోసోవ్ మాస్కో స్టేట్ యూనివర్సిటీ, రష్యన్ డైరెక్ట్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ జాయింట్ స్టాక్ కంపెనీ మధ్య సహకార ఒప్పందం
- ప్రసారభారతి, గాజ్‌ప్రోమ్ మీడియా హోల్డింగ్ జెఎస్‌సి మధ్య సహకారం, భాగస్వామ్య ఎంఒయు
- ప్రసారభారతి, రష్యా నేషనల్ మీడియా గ్రూప్‌ల మధ్య ప్రసారాల సహకారంపై ఎంఒయు
- ప్రసారభారతి, బిగ్ ఏసియా మీడియా గ్రూప్‌ల మధ్య ప్రసారాల ఎంఒయు
- ప్రసారభారతి, ఎఎన్‌ఒ 'టివి–నొవొస్కీ' మధ్య సహకార, భాగస్వామ్య ఎంఒయుకు చేర్పు
- టివి బ్రిక్స్ జెఎస్‌సి, ప్రసారభారతి మధ్య ఎంఒయు

ఉభయ దేశాల కీలక ప్రకటనలు

- భారత్–రష్యా ఆర్థిక సహకార కార్యక్రమం 2030
- ఇంటర్నేషనల్ బిగ్ కాట్ (పులుల సంరక్షణ) అలయెన్స్‌లో రష్యా చేరిక
- భారత్ – రష్యా సాంస్కృతిక ఎగ్జిబిషన్ 'ఫ్యాబ్రిక్ ఆఫ్ టైమ్'
- రష్యన్‌లకు భారత్‌లో30 రోజుల ఇ–టూరిస్ట్, గ్రూప్ టూరిస్ట్ వీసా



తెలంగాణ ఆర్థికాభివృద్ధిలో

## గ్లోబల్ సమ్మిట్ కీలక భూమిక

కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియా గాంధీ ఆశాభావం

ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రాన్ని 2034 నాటికి వన్ ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చే దిశలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ కీలక భూమిక పోషిస్తుందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత సోనియా గాంధీ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ నెల 8, 9 తేదీలలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహించనుండడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ నిర్వహిస్తున్నందుకు తరువాయి 2లో

ఏప్రిల్ నుంచి రెండో విడత

## ఇందిరమ్మ ఇండ్లు



- వచ్చే మూడేళ్లలో పట్టణ ప్రాంతాల్లోనూ ఇస్తాం
- అందుకు సంబంధించిన నిర్మాణ ప్రణాళికలను త్వరలో ప్రకటిస్తాం
- మార్చిలో లక్ష ఇళ్లకు గృహప్రవేశాలు చేయిస్తాం
- లాభనష్టాలు లేకుండా అఫర్డబుల్ హౌసింగ్ పాలసీ
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

వచ్చే మూడేళ్లలో పట్టణ ప్రాంతాల్లోనూ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని, అందుకు సంబంధించిన నిర్మాణ ప్రణాళికలను త్వరలో ప్రకటిస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద మంజూరు చేసిన ఇళ్లలో, వచ్చే మార్చి నాటికి లక్ష ఇళ్లకు గృహ ప్రవేశాలు చేయిస్తామని ప్రకటించారు. ఆ తర్వాత జూన్ నాటికి మరో రెండు లక్షల గృహప్రవేశాలు జరుగుతాయన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో హౌసింగ్ శాఖలో రెండేళ్ల ప్రగతిని మంత్రి వివరించారు. ఇప్పటివరకు దాదాపు నాలుగు లక్షల ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేశామని, మూడు లక్షల ఇండ్లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయన్నారు. ఏప్రిల్ నుంచి రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరు ప్రారంభమవుతుందని తెలిపారు. రాష్ట్రంలోని జిహెచ్‌ఎంసితో సహా అన్ని పట్టణాల్లో పేదలకు గృహాల మంజూరు కోసం జి ప్లస్ త్రీ నమూనాలో ఇండ్ల నిర్మాణానికి త్వరలో తరువాయి 12లో

# అభివృద్ధి కోసం ఢిల్లీతో కొట్లాడుతా

తెలంగాణలో రైతును రాజును చేయడమే ప్రభుత్వ లక్ష్యం

రాష్ట్రంలో పండించిన ప్రతి గింజనూ కొంటాం

హైదరాబాద్ తర్వాత రెండవ రాజధానిగా వరంగల్

ఈ ప్రాంతంలో రెండవ విమానాశ్రయం కోసం గత సిఎం ఎప్పుడూ ప్రయత్నించలే

పదేళ్లలో ఒక్క ఎయిర్‌పోర్టునూ సాధించలే

వరంగల్ జిల్లా నర్సంపేటలో నిర్వహించిన ప్రజాపాలన విజయోత్సవాలలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి




ప్రజాపక్షం/నర్సంపేట

పేద ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం... మన రాష్ట్రానికి రావాల్సి నిధుల కోసం ఢిల్లీతోనైనా కొట్లాడుతానని, రాష్ట్రంలో రైతులను రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో హైదరాబాద్ తర్వాత రెండవ రాజధానిగా వరంగల్ నిలుస్తుందని, వరంగల్ ప్రాంతంలో రెండవ విమానాశ్రయం కోసం మాజీసిఎం కెసిఆర్ ఏనాడూ ప్రయత్నించలేదన్నారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించి కొత్తగా ఒక్క ఎయిర్‌పోర్టును కూడా సాధించలేదని సిఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం వరంగల్ జిల్లా నర్సంపేట పట్టణంలోని ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా 500 కోట్లకుపైగా వ్యయంతో చేపట్టే వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యం ప్రతి గింజా కొంటామన్నారు. రైతులు ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరంలేదన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత నుంచి తరువాయి 2లో

## 'మహా' పాలన షురూ

అందుబాటులోకి పౌరసేవల ప్రక్రియ

ఇక నుంచి ఆన్‌లైన్‌లోనే ఆస్తిపన్ను

నేటి నుంచి భవన నిర్మాణ అనుమతులు పునరుద్ధరణ

ప్రజాపక్షం/హైదరాబాద్



'మహా' నగరంలో విలీనమైన శివారు ప్రాంతాల్లో మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) పాలన మొదలైంది. నగర శివారు ప్రాంతాలను గత బుధవారం జిహెచ్‌ఎంసిలో విలీనం చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెల్సిందే. ప్రభుత్వ ఉత్తర్వులు వెలువడిన జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ విలీన ప్రక్రియను పూర్తి చేసేందుకు కార్యాచరణ ప్రారంభించారు. గురువారం శివారులోని 20 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్‌లలో ఫైళ్లను స్వాధీనం చేసుకోవడంతో పాటు పరిపాలన పరమైన చర్యలు చేపట్టారు. అందులో భాగంగా పౌర సేవలకు అంతరాయం కలగకుండా తాత్కాలిక చర్యలు చేపట్టారు. ఇప్పటికే జిహెచ్‌ఎంసిలో అందుబాటులో ఉన్న ఆన్‌లైన్ సేవలను శివారు మున్సిపల్ సంస్థలకు అనుసంధానం చేస్తున్నారు. ఆస్తిపన్ను చెల్లింపులకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసేందుకు ఇప్పటికే కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ బాధ్యతలను ఇప్పటికే సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్(సిజిజి)కి అప్పగించారు. నూతన ఆస్తిపన్ను మదింపు, ట్రేడ్‌లైసెన్స్‌లు, అలాగే జనన, మరణ ధృవీకరణ పత్రాల జారీ లాంటి పౌర సేవలకు ఆటంకం లేకుండా చర్యలు చేపట్టారు. ఇప్పటికే పారిశుద్ధ్య నిర్వహణకు సంబంధించి కూడా జిహెచ్‌ఎంసి నిబంధనల ప్రకారం కార్మికులు విధులకు హాజరవుతున్నారు. జిహెచ్‌ఎంసిలో అమలవుతున్న తీరులోనే పనులు నిర్వహణ ప్రారంభించారు. అలాగే విభాగాల వారీగా సేవలను జిహెచ్‌ఎంసి తరహాలోనే చేపట్టేందుకు అధికారులు తరువాయి 2లో



హిడ్మా ఎన్‌కౌంటర్ స్థలికి

## వర్సిటీ విద్యార్థులు

ఎపిలోని చింతూరులో అడ్డుకున్న గ్రామస్తులు

పరిస్థితి ఉద్రిక్తం

మావోయిస్టుల దిష్టిబొమ్మ దహనం

విద్యార్థుల బృందాన్ని స్టేషన్‌కు తరలించిన పోలీసులు

ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం

గత నెల 18వ తేదీన తెలంగాణ సరిహద్దు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ లోని అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అడవుల్లో మావోయిస్టు కీలక నేత మాడ్వి హిడ్మా ఎన్‌కౌంటర్ ఘటనా స్థలానికి వెళుతున్న యూనివర్సిటీ విద్యార్థులను అల్లూరి జిల్లా చింతూరులో గ్రామస్తులు శుక్రవారం అడ్డగించారు. దీంతో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సెంట్రల్ యూనివర్సిటీ, ఉస్మానియా యూనివర్సిటీ, కాకతీయ యూనివర్సిటీకి చెందిన బట్టు వెంకటేశ్వర్లు, లెనిన్, విజయ్, శ్రావణ్, తనుష్, క్రాంతి, పవన్, తరువాయి 12లో

### వర్సిటీ విద్యార్థులను విడుదల చేయాలి

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం 03

## వడ్డీ రేట్లలో కోత

రెపో రేటు 25 బేసిస్ పాయింట్లు తగ్గించిన ఆర్‌బిఐ

గృహ, ఆటో, ఇతర రుణాల ఖర్చు తగ్గే అవకాశం




**న్యూఢిల్లీ :** ఆరు నెలల్లో తొలిసారిగా భారత రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బిఐ) కీలక బెంచ్‌మార్క్ వడ్డీ రేటును తగ్గించింది. అధిక అమెరికా సుంకాల నేపథ్యంలో 'గోల్డిలాక్స్' ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించడానికి బ్యాంకింగ్ రంగానికి లక్ష కోట్ల రూపాయల లిక్విడిటీ బూస్ట్‌ను అందించాలని ప్రతిజ్ఞ చేసింది. దీంతో గృహ, ఆటో, ఇతర రుణాల ఖర్చు తగ్గే అవకాశం ఉంది. ఆర్‌బిఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల ద్రవ్య విధాన కమిటీ, రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించింది. దీంతో తాజాగా తగ్గింపుతో రెపో రేటు 5.25 శాతానికి చేరింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారతీయ వస్తువులపై విధించిన 50 శాతం సుంకాల వల్ల తీవ్రంగా దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థకు ఈ చర్య మద్దతుగా భావిస్తున్నారు. ఈ చర్య ఇప్పటికే ఎగుమతి తగ్గుదలకు, వాణిజ్య లోటు పెరగడానికి దారితీసింది. అలాగే రూపాయిని రికార్డు కనిష్ట స్థాయికి నెట్టింది. అతిపెద్ద జిఎస్‌టి సంస్కరణలు, కార్మిక నియమాలను తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## పెంటగాన్‌పై న్యూయార్క్ టైమ్స్ కేసు

**న్యూయార్క్ :** అమెరికా రక్షణ కార్యదర్శి పీట్ హెగ్‌సెత్ అమలు చేసిన కొత్త మీడియా నియమాలను వ్యతిరేకిస్తూ పెంటగాన్‌పై న్యూయార్క్ టైమ్స్ కేసు వేసింది. ఈ నియమాల వల్ల ప్రధాన మీడియా సంస్థలకు భవనంలో ప్రవేశాన్ని నిరాకరిస్తున్నట్టు పేర్కొంది. నియమాల పేరుతో మీడియా స్వేచ్ఛను, న్యాయ ప్రక్రియ హక్కును పెంటగాన్ ఉల్లంఘిస్తున్నదని న్యూయార్క్‌టైమ్స్ తన పిటిషన్‌లో పేర్కొంది. రిపోర్టర్లను తన అభీష్టం ప్రకారం నిషేధించే అధికారం హెగ్‌సెత్‌కు ఇవ్వడం ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రభుత్వానికి నచ్చని వార్తలను అణచేందుకు ప్రయత్నంగా హెగ్‌సెత్ చర్యలను అభివర్ణించింది. అయితే, పెంటగాన్ మాత్రం ఈ చర్యలను సమర్థించుకుంది. ఇవి అత్యంత సాధారణ నియమాలని పేర్కొంది. ఎపి, సిఎన్ఎన్, వాషింగ్టన్ పోస్ట్ వంటి పాత మీడియా సంస్థలు నమ్మకాన్ని కోల్పోయాయని ఆరోపించింది. అందుకే, వాటికి అనుమతిని నిరాకరించినట్టు పేర్కొంది.

## ఫోన్‌లో కీలక సమాచారం

ప్రమాదంలో అమెరికా సైన్యం..
హెగ్‌సెత్‌పై 'తాజా నివేదిక' ఆరోపణ



**వాషింగ్టన్ :** యెమెన్‌పై జరగనున్న అమెరికా వైమానిక దాడికి సంబంధించిన సున్నితమైన వివరాలను తన వ్యక్తిగత మొబైల్ ఫోన్‌లోని 'సిగ్నల్' యాప్ ద్వారా పంచుకోవడం వల్ల రక్షణ కార్యదర్శి పీట్ హెగ్‌సెత్ అమెరికా సైన్యాన్ని ప్రమాదంలోకి నెట్టారని పెంటగాన్ కార్యకలాపాలపై దృష్టిపెట్టే ఇన్‌స్పెక్టర్ జనరల్ ఒక నివేదికలో తేలింది. నివేదిక ప్రకారం, హెగ్‌సెత్‌కి ఆ సమాచారాన్ని డీక్లాసిఫై చేసే అధికారం ఉన్నప్పటికీ, వ్యక్తిగత పరికరాలు, అనుమతి లేని యాప్‌లను ఉపయోగించడం పెంటగాన్ నిబంధనలకు విరుద్ధం. కాగా, ఆయన పంపిన వివరాల్లో విమానాల సంఖ్య, దాడి సమయాలు వంటి కీలక సమాచారం ఉండటం ఆపరేషన్ సెక్యూరిటీకి ప్రమాదకరమని నివేదిక పేర్కొంది. ఈ సమాచారం శత్రు చేతుల్లో పడితే అమెరికా దాడి విఫలమయ్యే అవకాశం ఉండేదని, సైన్యం, పైలట్లు ప్రమాదంలో పడేవారని నివేదిక హెచ్చరించింది. ఈ 'సిగ్నల్' యాప్ చాట్‌లో పొరపాటున జర్నలిస్టు జెఫ్రీ గోల్డ్‌బర్గ్‌ను చేర్చడంతో ఈ వ్యవహారం బయటపడింది. కాగా, హెగ్‌సెత్ మరో చాట్ గ్రూప్ కూడా సృష్టించి, అందులో తన కుటుంబ సభ్యులతో సహా 13 మందికి ఇదే సమాచారాన్ని పంచుకున్నాడని పెంటగాన్ నివేదిక వెల్లడించింది. ఈ వ్యవహారంపై హెగ్‌సెత్ సోషల్ మీడియాలో స్పందిస్తూ, ఇందులో గోప్య సమాచారం ఏదీ లేదని పేర్కొన్నారు. అయితే, ఆయన పంచుకున్నవి దాడి ప్రదేశాలు, ఆయుధాలు, విమానాల రకాలు వంటి ముఖ్య విషయాలేనని నివేదిక స్పష్టం చేస్తున్నది.

## 'ఎక్స్'పై 120 మిలియన్ యూరోల జరిమానా

**లండన్ :** యూరోపియన్ యూనియన్ (ఇయు) తన డిజిటల్ సర్వీసెస్ యాక్ట్ (డిఎస్ఎ) ఉల్లంఘించినందుకు, ఎలాన్ మస్క్‌కు చెందిన సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' (గతంలో ట్విట్టర్)పై 120 మిలియన్ యూరోలు (సుమారు 140 మిలియన్ డాలర్లు) జరిమానా విధించింది. డిఎస్ఎ అమల్లోకి వచ్చిన తర్వాత ఇది మొట్టమొదటి చర్య. వినియోగదారులను తప్పుదోవ పట్టించే 'బ్లూ చెక్‌మార్క్స్' వ్యవస్థను కొనసాగించడంపై ఇయు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నది. డబ్బు చెల్లించి బ్యాడ్జ్‌లు కొనుగోలు చేసే విధానం వల్ల ఖాతాల్లో వాస్తవాలను గుర్తించడం కష్టమవుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నది. మోసాలు, కుంభకోణాలు జరిగే ప్రమాదం ఉందని వాదిస్తున్నది. ప్రకటనలు ఎవరు ఇచ్చారు, లక్ష్య ప్రేక్షకులు ఎవరు వంటి సమాచారం పూర్తిగా ఇవ్వలేదని కూడా ఇయు తెల్పింది. డేటా యాక్సెస్‌లో అసాధారణ ఆలస్యం, డిజైన్ లోపాలు ఉన్నట్లు గుర్తించింది. ప్రజలకు సంబంధించిన డేటా పొందడంలో అనవసర అవరోధాలు సృష్టించిందని ఇయు విమర్శించింది. ఈ విధానం యూరోపియన్ వినియోగదారులు ఎదుర్కొనే సిస్టమిక్ రిస్క్ పరిశోధనను అడ్డుకుంటుందని తెలిపింది. ఎలాన్ మస్క్ నుంచిగానీ, 'ఎక్స్' నుంచిగానీ ఇంకా ఎలాంటి స్పందన వెలువడలేదు.

# వరద బీభత్సం మిగిల్చిన విషాదం

ఆసియాలో దెబ్బతిన్న రహదారులు..
శిథిలమైన భవనాలు





**ఆచె తామియాంగ్ (ఇండోనేసియా):** గత వారం ఆసియాలో సంభవించిన భీకర వరదలు, కొండచరియలు విరిగిపడడం వంటి ఘటనల్లో కనీసం 1,500 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం వాతావరణం శాంతించగా, శుక్రవారం అత్యవసర బృందాలు యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టాయి. అయితే నష్టం, అవసరాల పరిమాణం విపరీతంగా ఉండటం వల్ల రక్షక బృందాలపై ఒత్తిడి విపరీతంగా పెరుగుతున్నది. ఇప్పటి వరకూ అందిన సమాచారం మేరకు ఇండోనేసియాలో 867, శ్రీలంకలో 486, థాయిలాండ్‌లో 185 మంది చనిపోయారు. మలేసియాలో మృతుల సంఖ్యపై ఇంకా స్పష్టత రాలేదు. కాగా, ఇండోనేసియా, శ్రీలంక దేశాలలో వందల గ్రామాలు ఇప్పటికీ మట్టిలో లేదా శిథిలాలలో పూడుకుపోయాయి. ఇరు దేశాల్లో దాదాపు 900 మంది జాడ తెలియడం లేదు. ఈ రెండు దేశాలతో పోలిస్తే థాయిలాండ్, మలేసియాలో పునరుద్ధరణ పనులు కొంత వరకూ వేగంగా జరుగుతున్నాయి. వరదనీరు తగ్గుతున్నకొద్దీ గ్రామాలు ఏ స్థాయిలో ధ్వంసమయ్యాయనే విషయం బయటపడుతున్నది. అనేక ప్రాంతాలకు ఉపరితల రవాణా పూర్తిగా నిలిచిపోయింది. అక్కడికి వెళ్లడానికి హెలికాప్టర్ తప్పనిసరిగా మారింది. అనేక భవనాలు పూర్తిగా లేదా పాక్షికంగా ధ్వంసమయ్యాయి. విద్యుత్ తీగలు తెగిపోయాయి. ఫలితంగా, విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఇంటర్నెట్ సేవలు ఆగిపోయాయి. ఆచె తామియాంగ్ వంటి పచ్చని కొండప్రాంతాల్లో ఉన్న గ్రామాలన్నీ ఇప్పుడు మందపాటి మట్టిలో మునిగిపోయాయి. 2.6 లక్షల మంది నిరాశ్రయులయ్యారు. తాగునీటి బావులు కలుషితమయ్యాయి. పైపులు విరిగిపోవడంతో శుద్ధ జలం విలాసం వస్తువుగా మారింది. ఆహారం కొరత రోజురోజుకూ తీవ్రమవుతున్నది. ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయిన గ్రామాల్లోని ప్రజలకు ఆహారం, మందులు, దుప్పట్లను హెలికాప్టర్ ద్వారా పంపుతున్నారు. ఉత్తర సుమత్రాలోని మెదాన్ నగరం నుంచి ఆచె తామియాంగ్ వరకు రహదారులు ఒక వారం తర్వాత తెరుచుకున్నప్పటికీ, రహదారులపై శిథిలాలు ఉండటం వల్ల సహాయక సరుకుల రవాణా చాలా నెమ్మదిగా సాగుతోంది.



## 'దిత్వా' బాధిత శ్రీలంకకు సాయంపై ఐఎంఎఫ్ పరిశీలన



**వాషింగ్టన్ :** శ్రీలంకలో 450 మందికి పైగా మరణాలకు కారణమైన తుఫాన్ దిత్వా కారణంగా శ్రీలంకలో ఏర్పడిన భారీ విధ్వంసం నేపథ్యంలో, దేశం కోలుకునే ప్రక్రియలో సహాయాన్ని అందించే మార్గాలను అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) పరిశీలిస్తోంది. వాషింగ్టన్ కేంద్రంగా పనిచేస్తున్న ఐఎంఎఫ్ ప్రతినిధి జూలీ కోజాక్ విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ, ఐఎంఎఫ్ 'ఎక్స్‌టెండెడ్ ఫండ్ ఫెసిలిటీ (ఇఎఫ్ఎఫ్) ఏర్పాటులో భాగంగా శ్రీలంక పునరుద్ధరణ, సంస్కరణలు, ప్రతిఘటనకు మద్దతు కొనసాగుతుందని తెలిపారు. తుఫాన్ బాధితులకు ఆమె సానుభూతి ప్రకటించారు. తుఫాన్ కారణంగా ఏర్పడిన ఆస్తి, ప్రాణ నష్టాలను అంచనా వేయడానికి శ్రీలంక అధికారులతో కలిసి ఐఎంఎఫ్ ప్రతినిధులు సంప్రదింపులు కొనసాగిస్తారని కోజాక్ వివరించారు. శ్రీలంక అధికారులతో ఐదో సమీక్షపై అక్టోబర్‌లోనే తుపాన్‌కు ముందే స్టాఫ్ స్థాయి ఒప్పందం కుదిరిందని, ప్రస్తుతం, పునరుద్ధరణ ప్రక్రియలో మరింత మద్దతు అందించే అవకాశాలను స్టాఫ్ పరిశీలిస్తున్నదని ఆమె వివరించారు. దిత్వా తుఫాన్ కారణంగా శ్రీలంకలోని అనేక జిల్లాలు పూర్తిగా జలదిగ్బంధనంలో చిక్కుకుపోయాయి. పలు ప్రాంతాలను వరదలు ముంచెత్తడంతో మౌలిక సదుపాయాల వ్యవస్థలు కుప్పకూలాయి. ఫలితంగా దేశ విపత్తు నిర్వహణ సంస్థలు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నాయి. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకొని, ఈనెల 15న తదుపరి సమీక్షపై చర్చించడానికి ఐఎంఎఫ్ బోర్డు సమావేశం జరుగుతుందని కోజాక్ తెలిపారు. దాదాపు 3 బిలియన్ డాలర్ల విలువైన ఐఎంఎఫ్ సహాయ ప్యాకేజీ కింద శ్రీలంకకు ఆరో విడత నిధులు విడుదలయ్యే అవకాశముంది. ఈ మొత్తాలను త్వరగతిన విడుదల చేయడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. శ్రీలంకలో సంక్షేమ ఆధారిత పాలనా వ్యవస్థలో అనేక కీలక సంస్కరణలను చేపేట్ట రీతిలో 2023 మార్చిలో ఐఎంఎఫ్ ఒప్పందం కుదుర్చుకుంది. ఆ ఒప్పందంలో భాగంగానే ఐఎంఎఫ్ నుంచి శ్రీలంకకు సాయం అందుతున్నది.

## అభివృద్ధికి ఢిల్లీతో కోట్లాడుతా

(మొదటి పేజీ తరువాయి)

ఒక్కొక్కటిగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. గత పాలకులు పది ఏళ్లు పాలించి ప్రజలకు ఒక డబుల్ బెడ్‌రూమ్ కట్టించిన దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు. అలాగే పేదలు కడుపునిండా అన్నం తినాలని ఆలోచనలతో ప్రతినెల రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం, మహిళలకు వడ్డీ లేని రుణం, రైతులకు భరోసా, ఉచిత విద్యుత్, వైద్యం, విద్య నిరుద్యోగులకు ఉద్యోగాలు, ఇందిరమ్మ ఇళ్లు, దఫాలవారీగా అందిస్తున్నామన్నారు. హైదరాబాద్ ఎలా అభివృద్ధి చెందిందో రాబోయే రోజులలో వరంగల్ జిల్లాను అభివృద్ధి చేస్తామని గుర్తు చేశారు. స్థానిక ఎన్నికల్లో మంచి నాయకుని ఎన్నుకొని గ్రామ అభివృద్ధి కోసం ప్రతి ఒకరు కృషి చేయాలని కోరారు. ప్రజాపాలనకు రెండేళ్లు పూర్తవుతుందని, వరి వేస్తే.. ఉరి వేసుకున్నట్టే అని ఆనాటి సిఎం కెసిఆర్ అన్నారని, ఈ ప్రభుత్వం మాత్రం.. రైతు పండించిన చివరి గింజ వరకు కొంటోందని, కాంగ్రెస్ వస్తే.. కరెంట్ ఉండదని ఆనాటి సీఎం దుష్ప్రచారం చేశారు. రైతు బంధు బంద్ అవుతుందని ప్రజలను బెదిరించారన్నారు. కాంగ్రెస్ పవర్లోకి వచ్చాక.. రాష్ట్రాన్ని దోచుకున్న వారి పవర్ మాత్రమే కట్ అయ్యిందన్నారు. వ్యవసాయానికి ఉచిత విద్యుత్ పై పేటెంట్ హక్కు ఉన్నది కాంగ్రెస్ కు మాత్రమేనని, గత సీజన్లో 9 రోజుల్లోనే రూ.9వేల కోట్లను రైతు భరోసా కింద ఇచ్చామన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, అనసూయ సీతక్క, ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ విప్ రాంచంద్రునాయక్, రాష్ట్ర ఫైనాన్స్ కమిషన్ చైర్మన్ సిరిసిల్ల రాజయ్య, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండి రియాజ్, ఎంపి బలరాం నాయక్, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య , పింగిలి శ్రీపాల్ రెడ్డి, ఎమ్మెల్యేలు కడియం శ్రీహరి, నాయిని రాజేందర్ రెడ్డి, కెఆర్ నాగరాజు, డాక్టర్ మురళి నాయక్, రేవూరి ప్రకాష్ రెడ్డి, గండ్ర సత్యనారాయణ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కీలక భూమిక

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సోనియా గాంధీ అభినందనలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధికి సిఎం చేస్తున్న కృషి విజయవంతం కావాలని ఆమె ఆకాంక్షించారు. ఈ మేరకు తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్‌కు సోనియా గాంధీ సందేశం పంపించారు. తెలంగాణ అభివృద్ధికి సంబంధించిన పలు కీలక, ప్రాముఖ్యమైన ప్రాజెక్టులు, ప్రణాళికల్లో భాగస్వాములు కాదల్చిన వారికి ఈ సమ్మిట్ ఒక వేదికగా దోహదపడుతుందని ఆమె తెలిపారు. అర్బన్, సెమీ అర్బన్, గ్రామీణవ్యవసాయాభివృద్ధి ప్రాజెక్టులకు సమ ప్రాధాన్యం ఇస్తూ మూడంచెల వ్యూహంతో తెలంగాణ ముందుకు సాగుతోందని సోనియా గాంధీ ఈ లేఖలో ప్రస్తావించారు. తెలంగాణలోని మానవ వనరులు, సహజ వనరులు, ప్రజల వ్యాపార నైపుణ్యం, అంతర్జాతీయ ప్రతిభ, సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధికి సమ్మిట్ మరింత తోడ్పడుతుందని ఆమె తెలిపారు. సమ్మిట్‌లో పాల్గొనే వారందరికీ ఆమె శుభాకాంక్షలు తెలిపారు.

## బిలియన్ డాలర్లు

(మొదటి పేజీ తరువాయి)

ఆహార భద్రత, షిప్పింగ్, పరస్పరం ప్రజల మధ్య ప్రత్యక్ష సంబంధాలు. వంటి అనేక రంగాలలో సహకారాన్ని విస్తరించడానికి రెండు వైపులా అనేక ఒప్పందాలపై సంతకం చేశారు. శిఖరాగ్ర చర్చల చివరలో ఇరువురు మీడియాతో మాట్లాడారు. ఉభయ పక్షాలు వార్షిక వాణిజ్య పరిమాణాన్ని ప్రస్తుత 64 బిలియన్ డాలర్ల నుండి 100 బిలియన్ డాలర్లకు పెంచే విషయాన్ని పరిశీలిస్తున్నట్లు రష్యా అధ్యక్షుడు పుతిన్ వెల్లడించారు. రష్యా న్యూఢిల్లీతో ఇంధన రంగంలో సహకారాన్ని విస్తరించాలని కూడా చూస్తోందని,వేగంగా అభివృద్ధి చెందుతున్న భారతదేశానికి నిరంతరాయంగా ఇంధన రవాణాకు తన దేశం సిద్ధంగా ఉందని పుతిన్ అన్నారు. భారతదేశ ఇంధన అవసరాలను తీర్చేందుకు, చమురు, గ్యాస్, బొగ్గు వంటి అవసరమైన ప్రతిఒక్కదానికి రష్యా నమ్మకమైన సరఫరాదారు అని అన్నారు. భారత ఉత్పత్తులకు మాస్కో మరింత మార్కెట్ అవకాశాలను అందిస్తుందని చెప్పారు. చిన్న, అణు రియాక్టర్లు, తేలియాడే అణు విద్యుత్ ప్లాంట్ల నిర్మాణంలో సహకారం కోసం రెండు వైపులా ఆసక్తిగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. అణు సాంకేతిక పరిజ్ఞానాల ఇంధనేతర వినియోగంలో, ఉదాహరణకు వైద్యం, వ్యవసాయంలో కూడా భారతదేశానికి రష్యా సహాయం అందించగలదని ఆయన అన్నారు. భద్రత, ఆర్థిక వ్యవస్థ, వాణిజ్యం, సాంస్కృతిక రంగాలలో సహకారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఇరుపక్షాలు నిర్ణయించుకున్నాయని పుతిన్ మీడియాకు వెల్లడించారు. రష్యా, భారతదేశం, ఇతర సారూప్య దేశాలు న్యాయమైన ,బహుళ ధ్రువ ప్రపంచం కోసం కృషి చేస్తున్నాయని పుతిన్ పేర్కొన్నారు.

**మన స్నేహం ధ్రువతార లాగా స్థిరం : మోదీ**

'గత ఎనిమిది దశాబ్దాలుగా ప్రపంచం అనేక ఒడిదుడుకులను చూసింది. మానవత్వం అనేక సవాళ్లు,సంక్షోభాలను ఎదుర్కొంది. వీటన్నింటిలోనూ భారతదేశం–రష్యా స్నేహం ధ్రువ తారలా నిలిచింది' అని మోదీ తెలిపారు.'పరస్పర గౌరవం, లోతైన విశ్వాసంపై నిర్మించబడిన ఈ సంబంధం ఎల్లవేళలా కాల పరీక్షలో నిలిచిందని, ఈ పునాదిని మరింత బలోపేతం చేయడానికి నేడు తాము సహకారంకు సంబంధించి అన్ని అంశాలను చర్చించామని తెలిపారు. ఆర్థిక సహకారాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లడం తమ ఉమ్మడి ప్రాధాన్యత అని ఆయన పేర్కొన్నారు. దీనిని సాధించడానికి, రెండు వైపులా 2030 వరకు ఆర్థిక సహకార కార్యక్రమంపై అంగీకరించామని, ఇది ద్వైపాక్షిక వాణిజ్యం,పెట్టుబడులను వైవిధ్యభరితంగా, సమతుల్యంగా, స్థిరంగా మారుస్తుందని మోదీ అభిప్రాయపడ్డారు. భారత దేశం త్వరలో రష్యన్ పౌరులకు ఉచిత 30 రోజుల ఇ–టూరిస్ట్ వీసా, 30 రోజుల గ్రూప్ టూరిస్ట్ వీసాను ప్రవేశపెడుతుందని కూడా ప్రధాన మంత్రి ప్రకటించారు. తమ భాగస్వామ్యానికి ఇంధన భద్రత బలమైన, ముఖ్యమైన స్తంభంగా ఉందని, పౌర అణుశక్తి రంగంలో సహకారం చాలా కీలకమని పేర్కొన్నారు. తాము పరస్పర ప్రయోజన సహకారాన్ని కొనసాగిస్తామని, ప్రపంచవ్యాప్తంగా సురక్షితమైన, వైవిధ్యభరితమైన సరఫరా గొలుసులను నిర్ధారించడానికి కీలకమైన ఖనిజాలలో తమ సహకారం చాలా ముఖ్యమైనదని తెలిపారు. ఇది స్వచ్ఛ ఇంధనం, హైటెక్ తయారీ, నవ తరం పరిశ్రమలలో తమ భాగస్వామ్యాలకు దృఢమైన మద్దతును అందిస్తుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

**ఉక్రేన్ ఘర్షణపై చర్చ**

ఉక్రెయిన్ వివాదం కూడా పుతిన్, మోదీల చర్చలలో ప్రముఖంగా ప్రస్తావనకు వచ్చింది. భారత దేశం ఆ దేశంలో శాంతిని సమర్థించిందని అన్నారు. ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని శాంతియుత మార్గాల ద్వారా ముగించాలని అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు సూచించారు. '
ఈ సమస్యకు శాంతియుత, శాశ్వత పరిష్కారం కోసం చేసే అన్ని ప్రయత్నాలను మేము స్వాగతిస్తున్నాము. ఇందుకు భారతదేశం ఎల్లప్పుడూ దోహదపడటానికి సిద్ధంగా ఉంది. దానిని కొనసాగిస్తుంది' అని మోదీ అన్నారు. ఉగ్రవాదాన్ని సమర్థవంతంగా ఎదుర్కొనే మార్గాల గురించి కూడా చర్చకు వచ్చాయి. 'భారతదేశం – రష్యా చాలా కాలంగా ఉగ్రవాదంపై పోరాటంలో భుజం భుజం కలిపి సహకరించుకున్నాయి. అది పహల్గాంలో జరిగిన ఉగ్రవాద దాడి కావొచ్చు లేదా క్రోకస్ సిటీ హాల్‌పై జరిగిన పిరికిపంద దాడి కావొచ్చు... ఈ సంఘటనలన్నింటికీ మూలం ఒకటే' అని మోదీ అన్నారు. ఉగ్రవాదం మానవత్వం విలువలపై ప్రత్యక్ష దాడి అని, దానికి వ్యతిరేకంగా ప్రపంచ ఐక్యత తమ గొప్ప బలం అని భారతదేశం గట్టిగా నమ్ముతుందన్నారు.

**బహుళరవాణా పథకం**

రెండు దేశాల మధ్య అనుసంధానతను పెంచడం ఒక ముఖ్యమైన ప్రాధాన్యత అని మోదీ అన్నారు.'ఐఎన్ఎస్‌టిసి, నార్తర్న్ సీ రూట్ , చెన్నై – వ్లాడివోస్టాక్ కారిడార్లలో తాము నూతన శక్తితో ముందుకు సాగుతామని, ధ్రువ ప్రాంత జలాల్లో భారతీయ నావికులకు శిక్షణ ఇవ్వడానికి తాము సహకరించుకోవడం తనకు సంతోషంగా ఉందని తెలిపారు.
ఇది ఆర్కిటెక్‌లో తమ సహకారాన్ని బలోపేతం చేయడమే కాకుండా భారతదేశ యువతకు కొత్త ఉపాధి అవకాశాలను కూడా సృష్టిస్తుందని ఆయన అన్నారు.ఇంటర్నేషనల్ నార్త్ సౌత్ ట్రాన్స్‌పోర్ట్ కారిడార్ (ఐఎన్ఎస్‌టిసి) అనేది భారతదేశం, ఇరాన్, ఆఫ్ఘనిస్తాన్, అర్మేనియా, అజర్‌బైజాన్, రష్యా, మధ్య ఆసియా, యూరప్ మధ్య సరుకు రవాణా కోసం 7,200 కి.మీ. పొడవైన బహుళ విధాల రవాణ పథకం.

**పుతిన్‌పై ప్రశంసల వర్షం**

నౌకానిర్మాణంలో రెండు వైపులా ఉన్న లోతైన సహకారం మేక్ ఇన్ ఇండియా కార్యక్రమాన్ని బలోపేతం చేసే సామర్థ్యాన్ని కలిగి ఉందని ప్రధానమంత్రి అన్నారు.భారతదేశం–రష్యా సంబంధాలను బలోపేతం చేయడంలో పుతిన్ 'అచంచలమైన నిబద్ధత' పట్ల మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. గత రెండున్నర దశాబ్దాలుగా, ఆయన తన నాయకత్వం, దార్శనికతతో ఈ సంబంధాలను పెంపొందించారని, ఆయన నాయకత్వం అన్ని పరిస్థితులలోనూ మన సంబంధాలను కొత్త శిఖరాలకు తీసుకెళ్లిందని కొనియాడారు. రెండు దేశాల మధ్య మానవవనరుల రాకపోకలను సులభతరం చేయడానికి కుదిరిన రెండు ఒప్పందాల గురించి కూడా ప్రధానమంత్రి ప్రస్తావించారు.'మానవశక్తి రాకపోకలను మన ప్రజలను కలుపుతుంది. రెండు దేశాలకు నూతన బలాలు, అవకాశాలను సృష్టిస్తుంది. దీనిని ప్రోత్సహించడానికి ఈ రోజు రెండు ఒప్పందాలు సంతకం చేయబడినందుకు నేను సంతోషిస్తున్నాను' అని ఆయన అన్నారు.

## ముగిసిన పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పంచాయతీ ఎన్నికల్లో భాగంగా శుక్రవారంతో నామినేషన్‌ల స్వీకరణ ప్రక్రియ పూర్తయింది. మూడో విడతలో 4,159 సర్పంచ్ స్థానాలకు నామినేషన్‌లు దాఖలయ్యాయి. చివరి రోజు కావడంతో నామినేషన్‌ల ప్రక్రియ ఊపందుకుంది. సాయంత్రం 5 గంటల వరకు గడువు ఉన్నప్పటికీ, ఎక్కువ మంది అభ్యర్థులు రావడంతో కేంద్రాలలోకి వచ్చిన వారికి టోకెన్లు ఇచ్చి ఆలస్యంగానైనా నామినేషన్లను అధికారులు స్వీకరించారు. మూడో విడతలో మొత్తం 182 మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ దశలో మొత్తం 4,159 సర్పంచ్ స్థానాలకు నామినేషన్లు దాఖలయ్యాయి. శనివారం మూడో దశ నామినేషన్ల పరిశీలన ఉంటుంది. ఈనెల 9న నామినేషన్‌ల ఉపసంహరణకు తుదిగడువు ముగియనుంది.



## మళ్లీ మన ప్రభుత్వమే వస్తది : కెసిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అన్ని కాలాలు అనుకూలంగా ఉండవని, కొన్ని కొన్ని సమయాలు కష్టాలు వస్తాయని, వాటికి వెరవకూడదని, మళ్లీ మన ప్రభుత్వమే వస్తదని బిఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు అన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వం అందించిన స్ఫూర్తితో స్వయం శక్తితో పల్లెలను అభివృద్ధి చేసుకుంటూ ముందుకు నడవాలని నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్‌కు సూచించారు. కెసిఆర్ దత్తత తీసుకున్న గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని ఎర్రవెల్లి, నర్సన్నపేట గ్రామాలలో ఏకగ్రీవంగా ఎన్నికైన నూతన సర్పంచులు, వార్డు మెంబర్లను కెసిఆర్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సర్పంచులను కెసిఆర్ శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో వాతావరణం, మౌలిక వసతుల అందుబాటు, పండుతున్న పంటల పరిస్థితి గురించి కెసిఆర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కెసిఆర్ మాట్లాడుతూ గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో, నూతన తెలంగాణ రాష్ట్రంలోని గ్రామాలన్నీ స్వయం సమృద్ధి చెంది, స్వయం పాలిత కేంద్రాలుగా, గ్రామీణ ఆర్థిక వ్యవస్థలుగా వర్ధిల్లాయని అన్నారు. దళిత, గిరిజన, బహుజన, మహిళా వర్గాలకు కులవృత్తులకు, నాటి బిఆర్ఎస్ ప్రభుత్వం అందించిన ప్రోత్సాహం, గ్రామీణాభివృద్ధికి అమలు చేసిన పథకాలు, పల్లె ప్రగతికి అందించిన ఆర్థిక సహకారం రాష్ట్ర పంచాయితీరాజ్ వ్యవస్థ బలోపేతానికి తోడ్పాటును అందించాయన్నారు. నూతనంగా ఎన్నికైతున్న సర్పంచులు గొప్ప ఆలోచనలతో తమ గ్రామాలను అభివృద్ధి చేసుకునేందుకు ప్రణాళికలు రచించుకోవాలని, గంగదేవిపల్లి లాంటి అభివృద్ధి చెందిన స్వయం సహాయక గ్రామాలను ఆదర్శంగా తీసుకొని, ప్రజల భాగస్వామ్యంతో కమిటీలు వేసుకుని, మన పని మనం చేసుకుంటూ, మన పల్లె అభివృద్ధికి పాటుపడాలని కెసిఆర్ సూచించారు. ఎవరో ఏదో చేస్తారని, ఏదో ఇస్తారని ఆశలు పెట్టుకుని ఆగం కావొద్దని చెప్పారు. జాతీయ, అంతర్జాతీయంగా పల్లెల ప్రగతి కోసం గొప్ప వ్యక్తులు చేసిన కృషిని కెసిఆర్ వివరించారు. బంగ్లాదేశ్‌కు చెందిన సామాజిక ఆర్థికవేత్త, స్వయం సహాయక బృందాల ఏర్పాటుకు స్ఫూర్తిదాత, ప్రొఫెసర్ యూనిస్‌తో పాటు మన దేశానికి చెందిన అన్నా హజారే లాంటి దార్శనికుల గురించి వారి కృషిని తెలిపారు. కెసిఆర్‌ను కలిసిన వారిలో ఎర్రవెల్లి గ్రామ సర్పంచి నారన్నగారి కవితా రామ్మోహన్ రెడ్డి దంపతులు, ఆ గ్రామ ఉప సర్పంచ్ ఎద్మ సబితా కరుణాకర్ సహా వార్డు మెంబర్లు, నర్సన్నపేట గ్రామ సర్పంచ్ గిలక బాల నర్సయ్య సహా ఇరు గ్రామాలకు చెందినవారితో పాటు బిఆర్ఎస్ నాయకుడు శేరి సుభాష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## 'మహా' పాలన షురూ

(మొదటి పేజీ తరువాయి)

చర్యలు మొదలు పెట్టారు.

**భవన నిర్మాణ అనుమతుల పునరుద్ధరణ**

తాత్కాలికంగా శివారు ప్రాంతాల్లో భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియ నిలిచిపోగా శనివారం నుంచి పునరుద్ధరించేందుకు జిహెచ్ఎంసి టౌన్‌ప్లానింగ్ అధికారులు చర్యలు చేపట్టారు. భవన నిర్మాణ అనుమతులను జిహెచ్ఎంసి పరిధిలో 'బిల్డ్‌నౌ సాఫ్ట్‌వేర్' ద్వారా మంజూరు చేస్తున్నారు. జిహెచ్ఎంసిలో విలీనమైన మున్సిపల్ సంస్థలలో కూడా బిల్డ్ నౌ ద్వారానే నిర్మాణ అనుమతులు మంజూరు చేయనున్నారు. ఇందుకు సంబంధించి బిల్డ్ నౌలో సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే భవన నిర్మాణ అనుమతుల జారీ ప్రక్రియను పునరుద్ధరించనున్నారు. టౌన్‌ప్లానింగ్ విభాగం ద్వారా ఆయా మున్సిపల్ సంస్థలలో శనివారం నుంచి అనుమతుల జారీ ప్రక్రియకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభం కానున్నట్లు తెలిసింది. చిన్న స్థాయి భవనాలకు మాత్రమే అంటే, జి ప్లస్ 2 అంతస్తుల్లో నిర్మించే భవనాలకు మాత్రమే మొదటి దశలో అనుమతులు మంజూరు చేయనున్నారు. నాలుగు అంతస్తుల భవనాలకు మరో మూడు నాలుగు రోజులలో సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేశాక అందుబాటులోకి తీసుకొస్తామని అధికారులు చెప్పుతున్నారు.
ఇన్‌స్టాంట్ రిజిస్ట్రేషన్, ఇన్‌స్టాంట్ అప్రువల్ కేటగిరీలలో అనుమతుల మంజూరు ప్రక్రియ ఒకటి రెండు రోజుల్లో ప్రారంభం అవుతుందని చెప్పుతున్నారు. 75 చదరపు గజాల నుంచి సుమారు 300 చదరపు గజాల స్థలాలకు ప్రస్తుతం అనుమతుల ప్రక్రియ మొదలు కానుంది. అంతకు మించిన స్థలాలకు అయితే మరో నాలుగైదు రోజుల సమయం పట్టే అవకాశం ఉందని అధికారులు చెప్పుతున్నారు.

**బహుళ అంతస్తుల భవనాల అనుమతులు జిహెచ్ఎంసికే..**

ఎక్కువ విస్తీర్ణంలోని స్థలాలకు ఇప్పటి వరకు హెచ్ఎండిఎ ద్వారా అనుమతులు పొందారు. ఇక నుంచి పూర్తి స్థాయిలో జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం నుండి అనుమతుల జారీ ప్రక్రియ మొదలు కానుంది. ఇప్పటి వరకు నాలుగు అంతస్తుల భవనాల వరకు శివారు మున్సిపల్ సంస్థలు అనుమతులు జారీ చేసేవి. ఐదు అంతస్తుల నుంచి అంతకు పైగా బహుళ అంతస్తులు నిర్మించే వారికి హెచ్ఎండిఎ అనుమతులు జారీ చేసేవారు.
ఇక నుంచి 300 చదరపు గజాల స్థలాలకు సర్కిల్ కార్యాలయాలు, 400 చదరపు గజాల నుంచి 1100 చదరపు గజాల వరకు జోనల్, 1100 చదరపు గజాలు దాటిన వాటికి జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయం ద్వారా భవన నిర్మాణ అనుమతులు మంజూరు అవుతున్నాయి. ఇప్పటికే నిర్మాణ అనుమతుల కోసం హెచ్ఎండిఎ దరఖాస్తు చేసుకున్న వాటిని మినహాయించి, కొత్త దరఖాస్తులు ఇక నుంచి జిహెచ్ఎంసికి చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించిన బిల్డ్‌నౌ సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేస్తున్నారు. అప్‌డేట్ చేసిన సాఫ్ట్‌వేర్ అందుబాటులోకి రాగానే ఇక జిహెచ్ఎంసికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## మరోసారి పోలీస్ కస్టడీకి ఐబొమ్మ రవి..!

ప్రజాపక్షం/హైదరాబాద్: పైరసీ కేసులో పట్టుబడి రిమాండ్ ఖైదీగా చంచల్ గూడ జైలులో ఉన్న ఐబొమ్మ రవిని మరోసారి పోలీసు కస్టడీకి అనుమతిస్తూ నాంపల్లి కోర్టు ఆదేశాలిచ్చింది. ఇప్పటికే రవిని కోర్టు అనుమతితో రెండు సార్లు కస్టడీకి తీసుకున్న పోలీసులు మొత్తం ఎనిమిది రోజులపాటు విచారించారు. నాలుగు వేరు వేరు కేసులు నమోదయ్యాయి. రవి నుండి తెలుసుకోవాల్సిన విషయాలు, సేకరించాల్సిన ఆధారాలు ఇంకా ఉన్నాయని, మరోసారి రవిని కస్టడీకి ఇవ్వాలని పోలీసులు అభ్యర్థించడంతో మరో మూడు రోజులపాటు కస్టడీకి అనుమతిస్తూ కోర్టు ఆదేశాలిచ్చింది. ఈ మూడు రోజులు కలిపితే మొత్తం పదకొండు రోజులు విచారించినట్లు అవుతుంది. మరోవైపు రవి బెయిల్ పిటిషన్‌పై విచారణ కొనసాగుతోంది. కస్టడీకి ఇచ్చిన నేపథ్యంలో బెయిల్ విచారణ వచ్చే సోమవారానికి వాయిదా పడింది. కోర్టు నుండి అనుమతి వచ్చిన నేపథ్యంలో శనివారం ఉదయం రవిని చంచల్ గూడ జైలు నుండి పోలీసులు కస్టడీకి తీసుకోనున్నారు.



## ఆస్ట్రేలియాతో కీలక ఒప్పందం

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు

ప్రజాపక్షం/హైదరాబాద్: ఆస్ట్రేలియాకు చెందిన డీకిన్ యూనివర్సిటీ భాగస్వామ్యంతో రాష్ట్రంలో కృత్రిమ మేథకు సంబంధించిన సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ఏర్పాటు చేయడానికి తెలంగాణ ప్రభుత్వం శుక్రవారం నాడు కీలక ఒప్పందం చేసుకుంది. దేశంలోనే ఈ తరహా నైపుణ్య శిక్షణ కేంద్రం (సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్) మొట్టమొదటిది. ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్యా మంత్రి జూలియన్ హిల్‌తో కలిసి సచివాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఎంఒయు వివరాలను వెల్లడించారు. ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేయనున్న ఎఐ యూనివర్సిటీలో ఈ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను నెలకొల్పనున్నట్లు శ్రీధర్‌బాబు తెలిపారు. డీకిన్ అప్లయిడ్ ఆర్టిఫిషియల్ ఇన్ స్టిట్యూట్ ఈ ఎక్సలెన్స్ సెంటర్‌ను రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి నిర్వహిస్తుందని ఆయన వివరించారు. కాలేజిల నుంచి అకడమిక్ గ్రాడ్యుయేట్లను కాకుండా ప్రపంచ స్థాయి నైపుణ్యాలతో కూడిన ప్రతిభావంతులను తయారు చేయాలన్న లక్ష్యంతోనే ఆస్ట్రేలియా ప్రభుత్వంతో ఈ భాగస్వామ్య ఒప్పందం చేసుకున్నట్టు ఆయన చెప్పారు. విదేశీ విశ్వవిద్యాలయాలను రాష్ట్రానికి తీసుకురావడానికి సిఎం రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగానే ఈ ఒప్పందం జరిగిందని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలోని ప్రముఖ విద్యాసంస్థల్లో కూడా నైపుణ్య శిక్షణ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇటీవల ఆస్ట్రేలియాను సందర్శించిన సందర్భంగా డీకిన్ యూనివర్సిటీని రాష్ట్రంలో క్యాంపస్ ఏర్పాటు చేయాల్సిందిగా ఆహ్వానించాం. తెలంగాణాలో నూతన ఆవిష్కరణలకు అనుకూలమైన ఎకోసిస్టం ఉంది. దీనికి ఈ ఎక్స్ లెన్స్ సెంటర్ సేవలు మరింత ఉపయోగపడతాయి. ఇప్పటికే ఉద్యోగాల్లో ఉన్న వృత్తి నిపుణులకు తమ దేశంలో ఉన్నత స్థాయి నైపుణ్యాల్లో శిక్షణ అందించడానికి కూడా ఆస్ట్రేలియా అంగీకరించింది. ఎంఒయు కార్యక్రమంలో ప్రభుత్వ ఐటి సలహాదారు ఐ.సాయిక్రిష్ణ, ఆస్ట్రేలియా ప్రతినిధులు క్యామ్ గ్రీన్, కరేన్ సాండర్ కాక్, నథానియెల్ వెబ్, స్టీవెన్ బిడిల్, హిల్లరీ మెక్ గీచి, స్టీవెన్ కానోలీ, విక్రం సింగ్, ఐటీ శాఖ చీఫ్ స్ట్రాటెజిస్ట్ శ్రీకాంత్ లంకా తదితరులు పాల్గొన్నారు.

## 10న ఉస్మానియా వర్సిటీకి సిఎం

విద్యార్థుల పోరాట పటిమను ప్రతిబింబించే చిహ్నాలు
ఈ నెలాఖరు నాటికే అభివృద్ధి పనులపై తుది నిర్ణయం
ఉస్మానియా యూనివర్సిటీ పనుల్లో విద్యార్థుల అభిప్రాయాలకు ప్రాధాన్యం



ప్రజాపక్షం/హైదరాబాద్: ఉస్మానియా యూనివర్సిటీలో (ఓయు) చేపట్టనున్న అభివృద్ధి పనులలో విద్యార్థులు, బోధన సిబ్బంది అభిప్రాయాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. ఓయు అభివృద్ధి పనులపై తన నివాసంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఉస్మానియా యూనివర్సిటీలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై తొలుత సిఎంకు అధికారులు వివరించారు. అనంతరం పనులకు సంబంధించిన వివిధ నమూనాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను సిఎం వీక్షించారు. హాస్టల్ భవనాలు, రహదారులు, అకడమిక్ బ్లాక్స్, ఆడిటోరియం నిర్మాణాలకు సంబంధించి పలు మార్పులు చేర్పులను సిఎం సూచించారు. యూనివర్సిటీ పరిధిలోని అటవీ ప్రాంతంలో పనులకు అర్బన్ ఫారెస్ట్రీ నిధులు వినియోగించే అంశాన్ని పరిశీలించాలని అధికారులను సిఎం సూచించారు. యూనివర్సిటీ పరిధిలో ఇప్పటికే ఉన్న జల వనరులను సంరక్షిస్తూనే నూతన జల వనరుల ఏర్పాటుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సిఎం సూచించారు. హాస్టల్, అకడమిక్ భవనాల నిర్మాణం విషయంలో వంద మంది విద్యార్థులుంటే అదనంగా మరో పది శాతం విద్యార్థులకు వసతులు ఉండేలా చూడాలని సిఎం తెలిపారు. విద్యార్థులు, సిబ్బంది భవిష్యత్తులోనూ ఎటువంటి అసౌకర్యానికి గురికాకుండా నిర్మాణాలు ఉండాలని సిఎం అన్నారు.

**విద్యార్థుల పోరాట పటిమను ప్రతిబింబించే చిహ్నాలు**

ఉస్మానియా విద్యార్థుల పోరాట పటిమను ప్రతిబింబించే చిహ్నాలు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఉస్మానియా యూనివర్సిటీ అభివృద్ధి పనులకు సంబంధించి ఎంత ఖర్చు చేసేందుకైనా వెనుకాడబోమని సిఎం చెప్పారు. యూనివర్సిటీ పరిధిలోని చారిత్రక, వారసత్వ భవనాలను సంరక్షించాలని సిఎం సూచించారు. చారిత్రక ప్రాధాన్యం లేని పురాతన భవనాలకు భారీ మొత్తాలు వెచ్చించి మరమ్మతులకు చేసే బదులు నూతన భవనాల నిర్మాణానికి ప్రాధాన్యం ఇవ్వాలని సిఎం సూచించారు. సైకిల్ ట్రాక్‌లు, వాకింగ్ పాత్‌లతో పాటు ప్రతి పనిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సిఎం తెలిపారు..

**10న సిఎం యూనివర్సిటీ సందర్శన**

ఉస్మానియా యూనివర్సిటీని ఈ నెల 10వ తేదీన సందర్శించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అకడమిక్ బ్లాక్‌లు, హాస్టళ్లను పరిశీలిస్తానని సిఎం తెలిపారు. యూనివర్సిటీ అభివృద్ధి పనులకు సంబంధించి విద్యార్థులు, బోధనా సిబ్బంది అభిప్రాయాలు స్వీకరించాలని సిఎం అధికారులకు సూచించారు. తొలుత అభివృద్ధి నమూనాలు వారి ముందు ఉంచాలని, తర్వాత వారి అభిప్రాయాలు తెలిపేందుకు డ్రాప్ బాక్సలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రత్యేక వెబ్‌సైట్‌ను ఏర్పాటు చేయాలని సిఎం సూచించారు. విద్యార్థుల అభిప్రాయాలకు ప్రాధాన్యమిస్తూ ఈ నెలాఖరు నాటికి అభివృద్ధి ప్రణాళికలపై తుది నిర్ణయం ఖరారు చేయాలని సిఎం ఆదేశించారు. సమీక్షలో సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.కేశవరావు, సిఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన, ఉస్మానియా విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ మొలుగారం కుమార్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కాశీం పాల్గొన్నారు.

## సర్పంచ్ పదవికి ఇద్దరు భార్యలు నామినేషన్లు!



ఏ భార్యను సర్పంచ్ చేయాలనే సందిగ్ధంలో భర్త


ప్రజాపక్షం/సిద్దిపేట : సర్పంచ్ పదవికి నామినేషన్లలో కొన్ని విచిత్ర ఘటనలు చోటు చేసుకుంటూ ఉంటాయి. సర్పంచ్ వేలం పాట, రాజకీయ ఎత్తుగడలు, నామినేషన్ ఉపసంహరణ లాంటి అనేక రకాల ఘటనలను చూశాం. కాని ఒకే సీటుకు ఇంట్లో ఉన్న ఇద్దరి భార్యలతో ఓ భర్త నామినేషన్లు దాఖలు చేయించారు. ఇందులో మరో గమ్మత్తు ఏమిటంటే బరిలో ఆ వ్యక్తి ఇద్దరు భార్యలు మాత్రమే నిలవడం. ఒకరు ఉపసంహరించుకుంటే మరొకరికి సర్పంచ్ పదవి ఏకగ్రీవం కానుంది. వివరాల్లోకి వెళ్తే సిద్దిపేట జిల్లాలోని అక్బర్‌పేట భూంపల్లి మండలం జంగపల్లి సర్పంచ్ పదవి జనరల్ మహిళకు రిజర్వ్ అయ్యింది. ఆ గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి ఇద్దరు భార్యలు ఉన్నారు. నవంబర్ 30న తన మొదటి భార్యతో సర్పంచ్ పదవికి నామినేషన్ దాఖలు చేయించాడు. ఆ తరువాత అతనికి వచ్చిన ఓ ఆలోచనతో నామినేషన్ పత్రాలతో ఏవైన తప్పులు ఉంటే స్క్రూట్నీలో ఎక్కడ తొలగిస్తారోనన్న భయంతో తన రెండో భార్యతో మరో నామినేషన్ వేయించాడు. నామినేషన్ల దాఖలు ముగిసే సమయానికి ఈ ఇద్దరే పోటీలో ఉన్నారు. వీరిలో ఒకరు నామినేషన్ ఉపసంహరించుకుంటే మరొకరికి సర్పంచ్ పదవి ఏకగ్రీవం కానుంది. దీనితో ఎవరితో నామినేషన్ ఉపసంహరించుకోవాలో తెలియని భర్త అయోమయంలో పడిపోయాడు. ఇది జిల్లా అంతటా చర్చనీయాశంగా మారింది.


## జర్నలిస్టులకు ఎఐతో ప్రయోజనం



'ప్రజాపక్షం' వార్షికోత్సవ సభలో మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్ : జర్నలిస్టులు మరింత సమాచారం కోసం, వార్తా కథనాలను రాసేందుకు ఆధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఎఐ) పట్ల అవగాహన అవసరమని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి అన్నారు. 'ప్రజాపక్షం' తెలుగు దినపత్రిక మరింత నూతనత్వంతో ముందుకు సాగాలన్నారు. 'ప్రజాపక్షం' తెలుగు దినపత్రిక 7వ వార్షికోత్సవ కార్యక్రమం శుక్రవారం హైదరాబాద్ బండ్లగూడలోని ప్రజాపక్షం కార్యాలయం నల్లమల గిరిప్రసాద్ భవన్‌లో జరిగింది. నవ చేతన విజ్ఞాన సమితి అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకట రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కె.శ్రీనివాస్ రెడ్డి, నవచేతన విజ్ఞాన సమితి పాలకమండలి సభ్యులు బి.ఎస్.ఆర్ మోహన్‌రెడ్డి, తక్కెళ్లపల్లి శ్రీనివాస రావు, కళవేన శంకర్, వి.ఎస్.బోస్, ఉజ్జిని రత్నాకర్ రావు, జనరల్ మేనేజర్ ఎన్. మధుకర్, 'ప్రజాపక్షం' సంపాదకులు మక్కెన సుబ్బారావు, ఎగ్జిక్యూటివ్ ఎడిటర్ బొమ్మగాని కిరణ్‌కుమార్, అసిస్టెంట్ ఎడిటర్లు బి.లక్ష్మి నారాయణ, ఇ.చంద్రశేఖర్, న్యూస్ ఎడిటర్ పి.శ్రీనివాస్ రెడ్డి, జనరల్ మేనేజర్ (యాడ్స్) వి.మదన్ తదితరులు పాల్గొన్నారు. వార్షికోత్సవం సందర్భంగా జంగయ్య, తోట సుధాకర్‌ను పాలక వర్గం సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఉత్తమ గ్రామీణ వార్తా కథనాలు రాసిన ప్రజాపక్షం అక్కన్నపేట విలేకరి నారదాసు ఈశ్వర్, పినపాక విలేకరి నరేశ్, నిర్మల్ రూరల్ విలేకరి లింగేశ్వర్‌లను శాలువాతో సన్మానించి, నగదు పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ప్రజాపక్షం మరింత మెరుగైన వార్తాకథనాలు, రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలతో ఆకర్షణీయంగా తీసుకురావాలని అన్నారు. జర్నలిజం వృత్తిలో కొనసాగాలనుకునే వారికి ఎఐ పట్ల అవగాహన ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందని సూచించారు. ప్రజా సమస్యలు ఉన్న చోట విలేకరులు ఉండాలన్నారు. పల్లా వెంకట్ రెడ్డి మాట్లాడుతూ జర్నలిస్టులకు అన్ని అంశాలపై అవగాహన ఉండాలని, ఇందు కోసం మండల, జిల్లా స్థాయి విలేకరుల వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్టు తెలిపారు. మక్కెన సుబ్బారావు మాట్లాడుతూ త్వరలో జర్నలిస్టులకు ఉమ్మడి జిల్లాల వారిగా శిక్షణ తరగతులను నిర్వహిస్తామని చెప్పారు. బొమ్మగాని కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల తన చైనా దేశ పర్యటన, అక్కడి ప్రభుత్వ పనితీరు, స్థానిక పరిపాలన, విద్యా వ్యవస్థల అధ్యయన విషయాలను వివరించారు. కమ్యూనిస్టుల ప్రభుత్వాల పరిపాలనలో దేశం ఎలా అభివృద్ధి చెందుతుందో చెప్పేందుకు చైనా ఉదాహరణ అని, అక్కడ ప్రజల కేంద్రం గా పరిపాలన కొనసాగుతుందన్నారు. భారతదేశంతో సంబంధాలను మరింతగా మెరుగుపర్చుకునేందుకు ప్రయత్నిస్తోందని కిరణ్ కుమార్ తెలిపారు.





## గ్లోబల్ సమ్మిట్‌కు మూడంచెల భద్రత

ఏర్పాట్లను సమీక్షించిన డిజిపి బి.శివధర్ రెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలం ఫ్యూచర్ సిటీలో నిర్వహించే గ్లోబల్ సమ్మిట్‌కు మూడంచెల భద్రత కల్పిస్తున్నట్లు డిజిపి బి.శివధర్‌రెడ్డి వెల్లడించారు. భద్రతా ఏర్పాట్లపై శుక్రవారం అడిషనల్ డిజిపిలు మహేష్ ఎం.భగవత్, డిఎస్ చౌహాన్, అగ్నిమాపక శాఖ డిజి విక్రమ్ సింగ్‌మాన్, టిజిఐఐసి ఎండి శశాంక్, ఐజిపి (పిఎల్) ఎం. రమేష్‌లతో కలిసి రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా డిజిపి బి.శివధర్‌రెడ్డి మాట్లాడుతూ....రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబల్ సమ్మిట్‌కు అన్ని రకాల ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. సుమారు 3 వేల మంది జాతీయ, అంతర్జాతీయ ప్రముఖులు గ్లోబల్ సమ్మిట్‌కు రానున్నారని తెలిపారు. ఆహ్వానితులకు మాత్రమే డిసెంబర్ 8, 9 తేదీలలో అనుమతి ఉంటుందని గుర్తు చేశారు. ఆ తర్వాత నాలుగు రోజులు మాత్రం సాధారణ ప్రజలకు కూడా అనుమతి ఉంటుందని అన్నారు. విఐపి ప్రతినిధుల చుట్టూ మూడంచెల భద్రత ఉంటుందని గ్లోబల్ సమ్మిట్ జరిగే ప్రాంతంలో అడుగడుగునా నిఘా పెట్టేందుకు సుమారు వెయ్యికిపైగా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీటిని సెంట్రల్ పోలీసు కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేస్తామని తెలిపారు. రేపు సాయంత్రం లోపు అన్ని ఏర్పాట్లు పూర్తవుతాయని ఆయన అన్నారు. బందోబస్త్ విషయంలో పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని, అధికారులు సమన్వయంతో పని చేయాలని ఆయన అధికారులకు సూచించారు. సిఎం ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో ఈ సమ్మిట్ నిర్వహిస్తునందున కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. గ్లోబల్ సమ్మిట్‌కి కావాల్సిన సదుపాయాలపై, బేరక్స్, మెస్, కిచెన్, మరుగుదొడ్లవంటి మౌలిక సదుపాయల గురించి అధికారులతో చర్చించామని పేర్కొన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం సుమారు వెయ్యి మంది ట్రాఫిక్ పోలీసులను నియమించనున్నామని వివరించారు. రహదారుల మళ్లింపు, బారికేడ్ల ఏర్పాటు, వాహనాల పార్కింగ్ నిర్వహణ వంటి వాటి కోసం ట్రాఫిక్ మార్షల్స్ పనిచేస్తారన్నారు. ఎలాంటి ట్రాఫిక్ అంతరాయం, ఇబ్బందులు జరగకుండా ఆయా మార్గాలను పటిష్టమైన పోలీసు బందోబస్తు ఉంటుందని, సాధారణ ప్రజలు, ఇతర వాహనదారులకు రెండు రోజుల పాటు ఆయా మార్గాలలో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని వెల్లడించారు.

## గ్లోబల్ సమ్మిట్‌కు రండి

పలు రాష్ట్రాల సిఎంలకు ఆహ్వానపత్రిక అందజేత





ప్రజాపక్షం/హైదరాబాద్: హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో ఈనెల 8,9 తేదీల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ రైజింగ్ 2047 గ్లోబల్ సమ్మిట్‌కు హాజరు కావాలని జార్ఖండ సిఎం హేమంత్ సోరెన్‌ను తెలంగాణ డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు ప్రత్యేకంగా ఆహ్వానించారు. జార్ఖండ్ సిఎం నివాసంలో శుక్రవారం



జరిగిన ఈ భేటీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ముద్రించిన గ్లోబల్ సమ్మిట్ ఆహ్వాన పత్రికను సిఎం హేమంత్ సోరెన్‌కు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క అందజేశారు. 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వృద్ధి లక్ష్యంగా తెలంగాణ భవిష్యత్తు సంకల్పంతో ముందుకు సాగుతుందని డిప్యూటీ సిఎం వివరించారు. దీనికి అనుగుణంగా అన్ని రంగాల వృద్ధి లక్ష్యాలు, అనుసరించే భవిష్యత్తు ప్రణాళికలను విశ్లేషించేలా తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించినట్లు ఈ భేటీలో డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క వివరించారు. నీతి అయోగ్ సలహాలు సూచనలతో పాటు అన్ని రంగాల నిపుణుల మేథో మధనంతో తయారుచేసిన ఈ విజన్ డాక్యుమెంట్‌ను గ్లోబల్ సమ్మిట్‌లో ఆవిష్కరించనున్నట్లు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు జార్ఖండ్ సిఎంకు వివరించారు. అలాగే చెన్నైలోని సచివాలయంలోని తన కార్యాలయంలో తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్‌ను నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి కలిసి డిసెంబర్ 8, 9 తేదీలలో హైదరాబాద్‌లో జరిగే తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025కు ఆహ్వానించారు. 'భారత్ ఫ్యూచర్ సిటీ'లో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు హాజరు కావాలని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్‌ను రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బెంగళూరులో కలిసి సాదరంగా ఆహ్వానించారు.

**ఎపి సిఎం చంద్రబాబుతో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

గ్లోబల్ సమ్మిట్ 2025లో పాల్గొనాలని ఎపి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి శుక్రవారం ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధాని అమరావతిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో చంద్రబాబుతో భేటి అయిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భారత్ ఫ్యూచర్ సిటీలో ఈనెల 8,9 తేదీల్లో నిర్వహించ తలపెట్టిన రైసింగ్ తెలంగాణ విజన్ 2047 గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనాలని రాష్ట్ర ప్రభుత్వం తరుపున శాలువాతో సత్కరించి, ఆహ్వాన పత్రిక అందజేశారు. చంద్రబాబు విజన్ 2020 అంశాలు ఈ సందర్భంగా చర్చకు వచ్చాయి. తెలంగాణ ప్రభుత్వం విజన్ 2047 ప్రణాళికతో ముందుకెళ్లడం మంచి పరిణామమని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి వెంట ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య యాదవ్, నిరంజన్ రెడ్డి తదితరులు ఉన్నారు.



## వర్సిటీ విద్యార్థులను విడుదల చేయాలి : ఎమ్మెల్సీ నెల్లికంటి



ప్రజాపక్షం/హైదరాబాద్: మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ పట్ల నిజ నిర్ధారణకు వెళ్లిన ఉస్మానియా, కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులను అక్రమ నిర్బంధించడాన్ని సిపిఐ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ఖండించారు. ప్రపంచంలో ఎక్కడ అన్యాయం జరిగినా ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు స్పందిస్తారని, ఇందులో భాగంగానే మారేడుమిల్లి ఎన్‌కౌంటర్ అంశంలో కూడా వాస్తవాలను ప్రజలకు తెలియజేసేందుకు వారు ముందుగానే మావోయిస్టులకు, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రికి, ఆంధ్రప్రదేశ్ డిజిపికి బహిరంగంగానే లేఖలు రాశారని నెల్లికంటి సత్యం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిజనిర్ధారణకు వెళ్లిన విద్యార్థుల వాహనాలను చింతూరు పోలీస్ స్టేషన్ పరిధిలో నిలిపివేసి, వారిని అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు పోలీస్ స్టేషన్‌లో అక్రమంగా నిర్బంధించారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులను ఎటువంటి ఇబ్బందులకు గురి చేయకుండా తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

**కాగా...** మావోయిస్టు నేత హిడ్మా ఎన్‌కౌంటర్ అంశంలో నిజనిర్ధారణకు వెళ్ళిన విద్యార్థులను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని పిఎస్‌యు రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు, కార్యదర్శి కోట ఆనంద్ అన్నారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశంలో నిజ నిర్ధారణ చేసేందుకు వెళ్తున్న ఒయు, కాకతీయ విశ్వవిద్యాలయాలకు చెందిన 14 మంది విద్యార్థుల బృందాన్ని ఆంధ్రప్రదేశ్ పోలీస్‌లు చింతూరు పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించడాన్ని వారు శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. బేషరతుగా విద్యార్థులను విడుదల చేసి, వారికి నిజనిర్దారణ చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## త్వరలో గ్రూప్-3 అభ్యర్థులకు పోస్టింగ్స్

సిఎం ప్రజావాణిలో 367 దరఖాస్తులు
రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మన్ చిన్నారెడ్డి



ప్రజాపక్షం/హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన సిఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 367 దరఖాస్తులు అందాయని అధికారులు తెలిపారు. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 144, రెవెన్యూ శాఖకు సంబంధించి 23, ఇందిరమ్మ ఇండ్ల కోసం 83, మున్సిపల్ శాఖకు 18, పౌర సరఫరా శాఖకు 30 దరఖాస్తులు వచ్చాయని, ఇతర శాఖలకు సంబంధించి 69 దరఖాస్తులు అందయన్నారు. సిఎం ప్రజావాణి ఇంచార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ దరఖాస్తులు స్వీకరించడంతో పాటు ప్రజల సమస్యలు తెలుసుకొని, సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించారు.

**త్వరలో గ్రూప్– 3 అభ్యర్థులకు పోస్టింగ్స్..** పోటీ పరీక్షల ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఎంపికైన 1,388 మంది పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్3 అభ్యర్థులకు త్వరలో పోస్టింగ్స్ ఇవ్వనున్నట్లు రాష్ట్ర ప్రణాళికా వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి తెలిపారు. శుక్రవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజా భవన్‌లో జరిగిన సీఎం ప్రజా భవన్‌కు పెద్ద ఎత్తున గ్రూప్ 3 అభ్యర్థులు తరలి వచ్చారు. తమకు పోస్టింగ్స్ త్వరగా ఇప్పించాలని వారు కోరారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ సెక్రటరీ ప్రియాంకతో ఫోన్‌లో మాట్లాడిన చిన్నారెడ్డి త్వరలో పోస్టింగ్స్ ఇవ్వనున్నట్లు గ్రూప్ 3 అభ్యర్థులకు తెలిపారు. దీంతో గ్రూప్ 3 అభ్యర్థులు సంతోషం వ్యక్తం చేశారు.


సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ ఆఫ్ తెలంగాణ లిమిటెడ్
ఆపరేషన్ / డివిజన్ / వనపర్తి

షార్ట్ టెండర్ నోటీసు

టెండర్ స్పెసిఫికేషన్స్-W-01 to W-04/2025-26

వనపర్తి డివిజన్‌లోని వివిధ విద్యుత్ పనుల కొరకు టెండర్ నోటీస్ : 05/2025-26. Sp.Nos: W-01 to W-04/2025-26 వరకు అర్హత కలిగిన విక్రేతల నుండి బిడ్లను ఆహ్వానించడమైనది. **సేల్ టెండర్ల ప్రారంభ తేది:** 06.12.2025 మరియు **టెండర్ల స్వీకరణకు ఆఖరి తేది:** 15.12.2025, 13:30 గం.ల వరకు. టెండరు నోటీసుకు సంబంధించి మరిన్ని వివరాలకు దయచేసి www.tssouthernpower.com లో చూడవచ్చు.

సం/- డివిజనల్ ఇంజనీర్ Elecl., ఆపరేషన్ / టిజిఎస్‌పిడిసిఎల్ / వనపర్తి.

DIPR R.O. No. : 11737-PP/CL/ADVT/1/2025-26, Date: 05-12-2025



# జనరల్
STATE & REGIONAL NEWS

## సాయుధ దళాల పతాక దినోత్సవం



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** సాయుధ దళాల పతాక దినోత్సవం సందర్భంగా మన దేశ రక్షణలో త్యాగ నిరతితో అంకిత భావంతో మహత్తర భూమిక నిర్వహిస్తున్న సైనికుల సహాయార్థం ఏర్పాటు చేసిన సైనిక పతాక దినోత్సవం నిధికి విరాళాలు అంద చేయాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్.పి.డి.జానకి లు విజ్ఞప్తి చేశారు. సాయుధ దళాల పతాక దినోత్సవ సందర్భముగా మాజీ సైనికులు, ఎన్ సి.సి క్యాడెట్ లతో కలిసి జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్.పి.డి.జానకి లు సాయుధ దళాల పతాక నిధికి విరాళం అంద చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైనిక సంక్షేమ అధికారి ఎ.శ్రీనివాస్ రెడ్డి, త్రివిధ దళాల మాజీ సైనికులు పాల్గొన్నారు.

# 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పన వేగవంతం

### సిఎస్ నేతృత్వంలో కొనసాగుతున్న కసరత్తు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్ భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న గ్లోబల్ సమ్మిట్‌లో సుమారు వెయ్యి మంది ప్రతినిధులకు 'తెలంగాణ రైజింగ్– 2047' విజన్ డాక్యుమెంట్‌ను అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తుంది. రాష్ట్ర భవిష్యత్ అభివృద్ధిని సూచించే ఈ డాక్యుమెంట్ రూపకల్పన వేగంవంతం చేసినట్లు అధికారులు తెలిపారు. తెలంగాణను 2047 నాటికి దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ఈ విజన్ డాక్యుమెంట్ ప్రధాన ఉద్దేశమని కాంగ్రెస్ ప్రజా ప్రబుత్వం ప్రకటించింది. యువత, రైతులు, మహిళల సాధికారత ద్వారా 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థ లక్ష్యాన్ని చేరుకునే దిశగా వ్యూహాలు రచిస్తున్నది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణ రావు నేతృత్వంలోని ఉన్నతాధికారుల బృందం, వివిధ శాఖల నుంచి ఇన్‌పుట్స్ ఆధారంగా డాక్యుమెంట్‌ను రూపొందించే ప్రక్రియ వేగవంతం చేశారు. డాక్యుమెంట్ డిజైన్‌కు తుది మెరుగులు దిద్దుతున్నారు. ఈ డాక్యుమెంట్ ఇంగ్లీష్, తెలుగు, ఉర్దూ భాషల్లో సిద్ధం చేస్తున్నారు. దీనికి సంబంధించిన సాఫ్ట్ కాపీలు త్వరలో ప్రభుత్వ వెబ్‌సైట్లలో అందుబాటులోకి రానున్నాయి. ప్రజాభవన్ లోని తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్ రూపకల్పన వార్ రూమ్‌ను శుక్రవారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సందర్శించారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సిఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డిలతో కలిసి తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్, తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లను సమీక్షించారు. వివిధ రంగాల, అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు పాల్గొనే ఈ గ్లోబల్ సమ్మిట్‌లో విజన్ డాక్యుమెంట్ ప్రధాన ఆకర్షణగా నిలవనుంది. దీని కవర్ పేజీలో భవిష్యత్‌లో భారత్ ఫ్యూచర్ సిటీలో రూపుదిద్దుకోనున్న సూచనాత్మకనగరంప్రతిబింబించేలా రూపొందిస్తున్నారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి ప్రతిభా కేంద్రంగా మార్చేందుకు 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'తో పాటు 'ఈజ్ ఆఫ్ అట్రాక్టింగ్ టాలెంట్'పై కూడా దృష్టి సారించింది. మేధస్సును ఆకర్షించే తొలి భారత రాష్ట్రంగా నిలవాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతుంది. 2047 నాటికి ప్రతి తెలంగాణ రైతు ఉత్పత్తిదారునిగా, ప్రాసెసర్‌గా, బ్రాండ్ యజమానిగా, ఎగుమతిదారుగా ఎదగాలన్నదే ప్రభుత్వం లక్ష్యం. ఆధునిక టెక్నాలజీతో పాటు సుస్థిర సేంద్రియ వ్యవసాయాన్ని ప్రోత్సాహించనుంది. మహిళలకు ఆర్థిక స్వేచ్ఛ, నైపుణ్యాలు, అవకాశాలు కల్పించి తద్వారా కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే దిశగా ప్రణాళికలు చేస్తున్నారు. బాలికలకు నాణ్యమైన పాఠశాల విద్య, డిజిటల్ లెర్నింగ్, స్టెమ్ (ఎస్‌టిఈఎం) పరిజ్ఞానం ద్వారా వారికి ఉజ్వల భవిష్యత్తు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతుంది.

### అభివృద్ధి ప్రణాళికలపై మరిన్ని విషయాలను డాక్యుమెంట్‌లో చేర్చాలి

రాష్ట్ర భవిష్యత్తు అభివృద్ధి ప్రణాళికలపై మరిన్ని విషయాలను విజన్ డాక్యుమెంట్‌లో చేర్చడానికి ప్రాధాన్యత ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. విజన్ డాక్యుమెంట్ సాధారణ ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని సిఎం అధికారులను కోరారు. దావోస్‌లో వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ స్థాయి, విజయాన్ని ప్రదర్శించడం పట్ల తన ఆలోచన విధానాన్ని ముఖ్యమంత్రి అధికారులకు వివరించారు.



**న్యూఢిల్లీ :** రెండు రోజుల భారత పర్యటనను ముగించుకున్న రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ స్వదేశానికి తిరిగి వెళ్లారు. ఢిల్లీ నుంచి రష్యాకు బయల్దేరిన ఆయనకు విమానాశ్రయంలో భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ వీడ్కోలు పలికారు. అంతకుముందు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఇచ్చిన విందుకు పుతిన్ హాజరయ్యారు. విందు ముగిసిన తర్వాత అక్కడి నుంచి ఆయన నేరుగా పాలం విమానాశ్రయానికి చేరుకున్నారు. 'కలిసి సాగుదాం, కలిసి ఎదుగుదాం'.. అన్న నినాదంతో పుతిన్ తన భారత పర్యటనకు ముగింపు పలికారు.

## సింగరేణి విజన్ డాక్యుమెంట్ 2030-2047 విడుదల



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విజన్ 2047 కు అనుబంధంగా సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ తన విజన్ 2030–2047 డాక్యుమెంట్ ను ప్రకటించింది. హైదరాబాద్ సింగరేణి భవన్ లో శుక్రవారం జరిగిన సమావేశంలో సంస్థ ఛైర్మన్ ఎండి ఎన్. బలరామ్ విజన్ డాక్యుమెంట్ ను విడుదల చేసి దానిపై స్ఫూర్తిదాయకంగా వివరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్లు, వివిధ విభాగాల ఏరియాల జనరల్ మేనేజర్లు పాల్గొన్నారు. సింగరేణి సంస్థ భవిష్యత్తుతో పాటు రాష్ట్ర, దేశ అవసరాలకు అనుగుణంగా కంపెనీని బొగ్గు రంగం తో పాటు ఇతర రంగాల్లోకి పెద్ద ఎత్తున విస్తరింపజేయాలని ప్రణాళికలు రూపొందించినట్లు పేర్కొన్నారు. ముఖ్యంగావివిధరకాలపునరుత్పాదక విద్యుత్తు ఉత్పత్తి భారీ ఎత్తున ప్రణాళికలు తయారు చేశామని, దేశవిదేశాల్లో కీలక ఖనిజరంగం లో ప్రవేశించడానికి సింగరేణికి అనుబంధంగా గ్లోబల్ సింగరేణి లిమిటెడ్ ను ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. విజన్ డాక్యుమెంట్ లోని స్వల్ప, మధ్య కాలిక ప్రణాళికలో 2030 నాటికి లక్ష్యంగా పెట్టుకున్న అంశాలను వివరించారు. సింగరేణి సంస్థ 2030 నాటికి 100 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.దీని కోసం ప్రస్తుత లీజు ప్రాంతంలోనే కాక, లీజుకు వెలుపల ఉన్న ప్రాంతంలోని కొత్త బ్లాకులను, వివిధ రాష్ట్రాలలోని కొత్త బ్లాకులను కూడా చేపట్టాలని నిర్ణయించామన్నారు. ప్రస్తుతం 1,200 మెగా వాట్లథర్మల్‌విద్యుత్తుఉత్పాదనను 4,400 మెగా వాట్లకుపెంచాలని,అందుకుఅనుగుణంగా కొత్త ప్లాంట్లుఏర్పాటు చేయాలని రూపొందించింది.

## ఉద్యోగావకాశాలకు ప్రాధాన్యం

### హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ బాలకిష్టారెడ్డి

### ఈ సమ్మిట్ విద్యార్థులకు లాభదాయకమైన ఫలితాలను తీసుకురాబోతుంది

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'కరికులం'లో ఉద్యోగావకాశాలకు ప్రాధాన్యం ఇస్తున్నామని హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ బాలకిష్టా రెడ్డి తెలిపారు. తెలంగాణ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్, ఆల్ ఇండియా ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్‌తో కలిసి గ్లోబల్ టిపిఒ,హెచ్‌ఆర్ లీడర్‌షిప్ ఎక్సలెన్స్ సమిట్ 2025ను శుక్రవారం మాదాపూర్‌లోని టీహబ్‌లో నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎలాంటి జాబ్ ఓరియెంటెడ్ కోర్సులు ఉండాలి, ఎలాంటి జాబ్ ఓరియెంటెడ్ ఆపర్చునిటీస్ క్రియేట్ అవుతున్నాయన్న దానిపై ఈ వర్క్‌షాప్ చాలా ఉపయోగపడుతుందని తెలిపారు. జెఎన్‌టియు పరిధిలో ఉన్న 235 కళాశాలలు విద్యార్థులతో పాటు పలు కంపెనీల సిఇఒలు, హెచ్‌ఆర్‌లు ఈ సమ్మిట్‌కు హజరయ్యారని తెలిపారు. ప్రత్యేకంగా జాబ్ అవుట్ కమ్ ఒరియెంటెడ్ కోర్సులు క్రియేట్ చేస్తున్నామని, వారి అవసరాలను బేస్ చేసుకొని కరికులాన్ని తయారు చేస్తున్నామని చెప్పారు. జెఎన్‌టియు రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఇప్పుడు పోటీ పక్కవాడితో కాదని, ప్రపంచంతో పోటీ పడాలని పేర్కొన్నారు. అందుకు పాఠ్యాంశాలలో సమూలంగా మార్పులు చేశామని, రైజింగ్ తెలంగాణ 2047లో విద్య ఎంతో ముఖ్యమని తెలిపారు. ఆల్ ఇండియా ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డాక్టర్ జయరాం మాట్లాడుతూ ఈ సమ్మిట్ విద్యార్థులకు లాభదాయకమైన ఫలితాలను తీసుకురాబోతుందని అన్నారు.

24 రాష్ట్రాల ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్స్ ఛాప్టర్లు, హెచ్‌ఆర్ నాయకులు, పాలసీ మేకర్లు, అకాడమిషియన్లు ఒకే వేదికపై సమావేశం కావడం విశేషమన్నారు.

## నిమ్స్ ఆసుపత్రికే పరిమితం చేయడం దుర్మార్గం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రైవేటు ఆసుపత్రులకు పెండింగ్ బకాయిలను విడుదల చేయకుండా ఆరోగ్య భద్రత ద్వారా పోలీసులకు అందించే వైద్య చికిత్సలను నిమ్స్ ఆసుపత్రికే పరిమితం చేయడం అత్యంత దుర్మార్గమని బిఆర్‌ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. పోలీసుల జీతాల నుండి ప్రతినెలా ఆరోగ్య భద్రత కోసం డబ్బులుకట్‌చేసుకుంటున్న రాష్ట్ర ప్రభుత్వం, వారికి సేవలు అందించడంలో మాత్రం తీవ్ర వివక్ష చూపిస్తోందని శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిత్యం ప్రజల భద్రత కోసం కృషి చేసే పోలీసులకుకార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యాన్ని దూరంచేసి,నిమ్స్ ఆసుపత్రికే పరిమితం చేయడం శోచనీయమన్నారు. ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లి అనేక ఇబ్బందులు ఎదుర్కుంటున్నప్పటికీ పాలకులకు మాత్రం మొద్దు నిద్ర వీడటం లేదన్నారు. తక్షణమే పెండింగ్ లో ఉన్న ఆరోగ్య భద్రత బకాయిలను చెల్లించి, నిమ్స్‌తో పాటు అన్ని కార్పొరేట్ ఆసుపత్రుల్లో పోలీసులకు, వారి కుటుంబ సభ్యులకు వైద్య సేవలు పునరుద్ధరించాలని కోరారు.

## రూ.347 కోట్లతో 'జోగులాంబ దేవాలయ' అభివృద్ధికి ప్రణాళిక



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తుంగభద్ర నది ఒడ్డున ఆలంపూర్ వద్ద కొలువైన 5వ శక్తి పీఠం జోగులాంబ అమ్మ వారి ఆలయ అభివృద్ధికి రూ. 347 కోట్లతో ప్రణాళికను సిద్ధం చేశారు. తక్షణం బాలాలయం, వజ్ర లేపనం, కుంబాభిషేకం వంటి పనులు ప్రారంభించేందుకు రూ. 35 కోట్లు అవసరమని నిర్ణయించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జి.చిన్నారెడ్డి, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, స్తపతి గోవింద హరి,ఆలయ అభివృద్ధి రూపశిల్పిసూర్యనారాయణ మూర్తి తదితరులు జోగులాంబ ఆలయ అభివృద్ధిపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు.త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ప్రత్యేకంగా సమావేశం కావాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. కాగా రూ. 347 కోట్ల ప్రణాళికలో మొదటి దశలో రూ. 138.40 కోట్లు, రెండవ దశలో రూ. 117.60 కోట్లు, మూడవ దశలో రూ. 91 కోట్లు అవసరం అని సమావేశంలో నిర్ణయానికి వచ్చారు.

## అమెరికాలో అగ్నిప్రమాదం.. ఇద్దరు తెలుగు విద్యార్థుల మృతి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** అమెరికాలోని బర్మింగ్‌హామ్ లోని అపార్ట్‌మెంట్ కంప్లెక్స్‌లో భారీ అగ్నిప్రమాదం జరిగింది. అపార్ట్‌మెంట్ కంప్లెక్స్‌లో నివసిస్తున్న పదిమంది తెలుగు విద్యార్థులు హఠాత్తుగా చెలరేగిన మంటలతో చిక్కుకున్నారు. అపార్ట్‌మెంట్‌లో ఫైర్ ప్రారంభమై కాసేపటిలోనే ఘాటైన పొగ రావడంతో విద్యార్థులు శ్వాస తీసుకోలేక భయందోళనకు గురయ్యారు. అగ్నిమాపక సిబ్బంది లోపల చిక్కుకుపోయిన 13 మంది విద్యార్థులను బయటకు తీసుకొచ్చారు. ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ హైదరాబాద్ చెందిన ఇద్దరు తెలుగు విద్యార్థులు మృతి చెందినట్లు తెలిసింది. మృతి చెందిన వారిలో చెందిన ఉడుముల సహజరెడ్డి, కూకట్ పల్లి కి చెందిన మరొక విద్యార్థి ఉన్నారు. అలబామా యూనివర్సిటీలో ఉన్నత విద్య చదువుతున్న విద్యార్థులుగా గుర్తించారు.

## రైల్వే ప్రయాణికులకు మెరుగైన సేవలు

### డిఆర్‌యుసిసి కమిటీ సూచనలు అత్యంత కీలకం



**ప్రజాపక్షం/హైదరాబాద్:**రైల్వే ప్రయాణీకులకు మెరుగైన సేవలు అందించడంలో డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ (డిఆర్‌యుసిసి) వంటి కమిటీల సూచనలు అత్యంత కీలకమని డివిజనల్ రైల్వే మేనేజర్ (డిఆర్‌ఎం) సంతోష్‌కుమార్ వర్మ చెప్పారు. సికింద్రాబాద్ రైల్ నిలయంలోని ఆడిటోరియంలో హైదరాబాద్ రైల్వే విభాగం ఆధ్వర్యంలో 73వ డివిజనల్ రైల్వే యూజర్స్ కన్సల్టేటివ్ కమిటీ (డిఆర్‌యుసిసి) సమావేశం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా డివిజనల్ రైల్వే మేనేజర్ (డిఆర్‌ఎం) సంతోష్ కుమార్ వర్మ, అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ డాక్టర్ అనికేత్ పర్మార్ హాజరయ్యారు. సమావేశంలో రైల్వే వినియోగదారుల సమస్యలు, సేవల మెరుగుదల, సౌకర్యాల విస్తరణ, భద్రత, ప్రయాణీకుల సదుపాయాల పెంపు వంటి కీలక అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. కమిటీ సభ్యులు పలు సూచనలను ప్రస్తావించగా, అధికారులు వాటిని పరిశీలించి అమలు చేయడానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. సంతోష్ కుమార్ వర్మ మాట్లాడుతూ రాబోయే నెలల్లో స్టేషన్లలో ఆధునీకరణ పనులు, డిజిటల్ సౌకర్యాలవిస్తరణ, రద్దీ నియంత్రణ, పర్యావరణహిత చర్యలపై దృష్టి పెడతామని వివరించారు.అదనపు డిఆర్‌ఎం డాక్టర్ అనికేత్ పర్మార్ మాట్లాడుతూ ప్రయాణికుల భద్రత, సమయపాలన, శుభ్రత వంటి అంశాల్లో విభాగం ఎల్లప్పుడూ ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందనిపేర్కొన్నారు. కమిటీ సభ్యుల అభిప్రాయాలు రైల్వే సేవలను మరింత సమర్థవంతంగా మార్చడంలో సహాయపడతాయని తెలిపారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల అధికారి, డిఆర్‌యుసిసి సభ్యులు, వినియోగదారుల ప్రతినిధులు సమావేశంలో పాల్గొన్నారు. పలు సమస్యలను తక్షణంపరిష్కరించేందుకుఅధికారుల బృందాలు ఏర్పాటుచేయాలనినిర్ణయంతీసుకున్నారు. మొత్తంగా, ప్రయాణికుల సౌకర్యాలను పెంపొందించేందుకు హైదరాబాద్ రైల్వే విభాగం తీసుకుంటున్న చర్యలకు మరింత దారితీసింది.

## ఈశ్వరచారి మృతికి కాంగ్రెస్, బిజెపిలే కారణం

### బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్‌గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాంగ్రెస్ ప్రభుత్వం బిసి రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని మోసపూరిత హామీలు ఇచ్చి, రిజర్వేషన్లను పెంచకుండానే స్థానిక సంస్థల ఎన్నికలకు వెళ్లడం జీర్ణించుకోలేకనే సాయి ఈశ్వరచారి ఆత్మహత్య చేసుకున్నాడని రాష్ట్ర బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, ఎంఎల్‌సి తీన్మార్ మల్లన్న అన్నారు. ఆయన మృతికి సంతాపంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా శనివారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ముమ్మాటికీ సాయి ఈశ్వరచారి మృతికి కాంగ్రెస్, బిజెపిలే బాధ్యులని పేర్కొన్నారు. సాయి ఈశ్వరచారి మరణ వార్త తెలుసుకున్న బిసి సంఘాల నేతలు పెద్ద ఎత్తున గాంధీ ఆసుపత్రికి తరలివచ్చి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. దీంతో అక్కడికి చేరుకున్న పోలీసులు వారిని అరెస్ట్ చేసి, హైదరాబాద్ నగరంలో బొల్లారం, తిరుమలగిరి, అంబర్‌పేట, ఉప్పల్ పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. ఈ సందర్భంగా జాజుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. బిసి రిజర్వేషన్లను 42 శాతానికి పెంచుతామని మోసగించిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ సాయి ఈశ్వరచారి ప్రాణత్యాగం చేశారని అన్నారు. సిఎం రేవంత్ రెడ్డితో పాటు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిలే ఈ హత్యకు బాధ్యత వహించాలని, సాయి ఈశ్వర్ మృతితోనైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దిగి రావాలన్నారు.సాయిఈశ్వర్ మృతిపై పార్లమెంట్‌లో చర్చ జరిపి, బిసి రిజర్వేషన్ల చట్టాన్ని ఈ పార్లమెంటు సమావేశాల్లోనే ఆమోదించాలని డిమాండ్ చేశారు. బిసి ద్రోహుల పార్టీలైన కాంగ్రెస్, బిజెపిల నాయకుల ఇండ్లను ముట్టడించి, తక్షణమే సర్పంచ్ ఎన్నికలు నిలిపివేసేలా ఒత్తిడి తేవాలన్నారు. కాంగ్రెస్, బిజెపిలలో ఉన్న బిసి నేతలు తమ పదవులకు రాజీనామా చేసి, బిసి ఉద్యమాల్లో ప్రత్యక్షంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సాయి ఈశ్వరచారి మృతిపై అఖిలపక్ష పార్టీల వైఖరి ప్రకటించడంతో పాటు అతడి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయలను ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## సాయి ఈశ్వరాచారి మృతి బాధాకరం

### బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిసిలకు అన్యాయం జరిగిందంటూ నడిరోడ్డున ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాప్రయత్నం చేసి, తీవ్ర గాయాలపాలైన సాయి ఈశ్వరాచారి శుక్రవారం గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించడం తీవ్ర ఆందోళనకు గురిచేసిందని బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అన్నారు. 42 శాతం బిసిల రిజర్వేషన్లు సాధించేవరకు పోరాటం చేయాలి తప్ప మానసికంగా కలత చెంది ఇటువంటి విధంగా దుర్మరణాలకు పాల్పడవద్దని విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్లు అమలవుతాయని నమ్మిన బిసిలు చివరకు అది 21.39 శాతానికి అమలు కావడం పట్ల బిసిలు ఎంత మానసిక ఆవేదనకు గురవుతున్నారో అనడానికి ఇదొక నిదర్శనమన్నారు. రిజర్వేషన్లలో తప్పులు జరిగాయని, వాటిని పరిశీలించాలని విజ్ఞప్తులు చేసిన పట్టించుకోకుండా ఎన్నికలకు పోవడం దురదృష్టకరమన్నారు. సాయి ఈశ్వరాచారి మృతి పట్ల తీవ్రమైన సంతాపాన్ని వ్యక్తం చేస్తూ ఆయన ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తూ, ఆయన మృతి ఊరికే పోదని 42 శాతంరిజర్వేషన్‌అమలయ్యేవరకుస్ఫూర్తిగాఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దివంగత సాయి ఈశ్వరాచారి కుటుంబాన్ని ఆదుకోవడంతో పాటు రూ. 25 లక్షలు ఎక్స్ గ్రేసియా ప్రకటించాలని నిరంజన్ విజ్ఞప్తి చేశారు.

## రాజేశ్ మృతి కారకులైన ఎస్ఐ, సిఐపై చర్యలు తీసుకోండి

### రాష్ట్ర ప్రభుత్వానికి మందకృష్ణ మాదిగ విజ్ఞప్తి

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** కోదాడ దళిత వ్యక్తి కర్ల రాజేశ్ లాకప్‌డెత్ కారకులైన చిలుకూరు ఎస్ఐ, కోదాడ రూరల్ సిఐలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎంఆర్‌పిఎస్ జాతీయ వ్యవస్థాపకులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కర్ల రాజేశ్ మీద ఎలాంటి ఫిర్యాదు లేకపోయినప్పటికీ 2025 నవంబర్ 4న అక్రమంగా అదుపులోకి తీసుకొని 8న ఉదయం చిలుకూరు పోలీస్‌స్టేషన్‌లో, రాత్రి కోదాడ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో చిత్రహింసలకు గురిచేశారని తెలిపారు. నెలరోజులు గడుస్తున్నా ఇప్పటివరకు సూర్యాపేట ఎస్ఐ, కోదాడ సిఐలపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఎంఆర్‌పిఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. రెండు రోజుల్లో డిజిపిని కలిసి రాజేశ్ ఘటన వివరాలను వెల్లడిస్తామన్నారు. రాజేశ్ బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఎంఎస్‌పి హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు టివి నరసింహ, ఎంఎస్‌ఎఫ్ హైదరాబాద్ అధ్యక్షులు జన్నపాల మహేశ్ మాదిగ, ఇటుక కిషన్ మాదిగ, శివకుమార్ మాదిగ, మాదిగ మహిళా సమాఖ్య రేణుక దేవి, సుజాత, దుర్గాదేవి తదితరులు పాల్గొన్నారు.

### ఉద్యోగులకు పనివేళల్లో వెలుపల...

## పని సంబంధిత కాల్స్ నిరాకరించే హక్కు

**న్యూఢిల్లీ :** ఉద్యోగులు పనివేళల్లో వెలుపల పని సంబంధిత ఫోన్‌కాల్స్, ఇమెయిల్స్ స్వీకరించకుండా డిస్‌కనెక్ట్ చేసే హక్కును అనుమతించాలని కోరుతూ ఒక ప్రైవేట్ బిల్లును శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ప్రభుత్వం చట్టం తీసుకురావాలని భావించే అంశాలపై లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు ప్రైవేట్ బిల్లులను ప్రవేశపెట్టేందుకు అనుమతి ఉంది. కొన్ని కేసులను మినహాయించి, ప్రతిపాదిత చట్టంపై ప్రభుత్వం స్పందించిన తర్వాత చాలా ప్రైవేట్ సభ్యుల బిల్లులను ఉపసంహరించుకుంటారు.నేషనలిస్ట్‌కాంగ్రెస్‌పార్టీ (ఎన్‌సిపి) ఎంపి సుప్రియా సూలే 'రైట్ టూ డిస్‌కనెక్ట్ బిల్లు2025'ను ప్రవేశపెట్టారు. ఇది ప్రతీ ఉద్యోగికీ పని గంటలకు మించి, సెలవు దినాలలో పని సంబంధిత టెలిఫోన్ కాల్స్, ఇమెయిల్స్‌ల నుండి డిస్ కనెక్ట్ చేసే హక్కును అందించడానికి ఉద్యోగుల సంక్షేమ అధికారాన్ని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించింది. పనివేళల వెలుపల ఫోన్ కాల్స్, ఇమెయిల్స్‌కు సమాధానం ఇవ్వడానికి నిరాకరించే హక్కు, దానికి సంబంధించిన అన్ని విషయాలను ఈ బిల్లు ప్రతిపాదిస్తుంది. రుతు స్రావం సమయంలో పని ప్రదేశాలలో మహిళలకు కొన్ని ప్రయోజనాలను అందించడానికి చట్టపరమైన ఒక చట్టాన్ని రూపొందించడానికి ఈ బిల్లు ప్రయత్నిస్తుంది. రాంవిలాస్ పాశ్వాన్ స్థాపించిన లోక్ జన్‌శక్తి పార్టీ (ఎల్‌జెపి)కి చెందిన శాంభవి చౌదరి కూడా ఒక చట్టాన్ని ప్రవేశ పెట్టారు. ఉద్యోగ మహిళలు, మహిళా విద్యార్థులకు వేతనంతో కూడిన రుతు సెలవు హక్కును పొందడంతో పాటు, రుతు క్రమ సమయంలో రుతు పరిశుభ్రత సౌకర్యాలు, ఇతర ఆరోగ్య ప్రయోజనాలను పొందేలా కూడాఇదిహామీఇచ్చింది.గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్ (నీట్) నుండి తమిళనాడును మినహాయించే బిల్లును కాంగ్రెస్ ఎంపి మాణిక్యం ఠాగూర్ ప్రవేశపెట్టారు. నీట్ ద్వారా వైద్య ప్రవేశాలను అందించకుండా రాష్ట్రానికి మినహాయింపునిచ్చే ప్రతిపాదిత చట్టానికి రాష్ట్రపతి అనుమతి నిరాకరించడాన్ని వ్యతిరేకిస్తూ తమిళనాడు ప్రభుత్వం గత నెలలో సుప్రీంకోర్టును ఆశ్రయించింది. దేశంలో మరణశిక్షను రద్దు చేయాలనే డిమాండ్లు ఉన్నాయి. దేశంలో మరణశిక్షను రద్దు చేయడానికి డిఎంకె ఎంపి కనిమొళికరుణానిధిఒక బిల్లును ప్రవేశపెట్టారు. దేశంలో మరణశిక్షను రద్దుచేయాలనే డిమాండ్లు ఉన్నాయి.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## మహాత్మా గాంధీ సమాధి వద్ద పుతిన్ ఘన నివాళి

**న్యూఢిల్లీ :** జాతిపిత మహాత్మాగాంధీకి రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నివాళి అర్పించారు. న్యూఢిల్లీలోని రాజ్‌ఘాట్‌లో ఉన్న ఆయన సమాధి వద్ద శుక్రవారం పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సందర్శకుల పుస్తకంలో గాంధీ గురించి పుతిన్ రాసిన వ్యాఖ్యాలు ఇలా ఉన్నాయి. ' ఆధునిక భారత రాజ్య స్థాపకుల్లో ఒకరైన, రాజకీయవేత్త , ఆలోచనాపరుడు మహాత్మా గాంధీ, సత్యం,అహింస మార్గం మానవాళిని స్వేచ్ఛ, సమానత్వం, న్యాయం, పురోగతికి నడిపిస్తుందని విశ్వసించారు. మహాత్మా గాంధీ తన విశ్వాసాలు,జీవిత మార్గం ప్రకారం, లియో టాల్‌స్టాయ్ ఆలోచనలకు దగ్గరగా ఉన్నాడు. లియో నికోలాయెవిచ్ టాల్‌స్టాయ్‌ను గాంధీ తన గురువు, ఆధ్యాత్మిక గురువుగా భావించాడు. టాల్‌స్టాయ్ మానవతా వార సత్వం, న్యాయం, సమానత్వం కోసం ప్రయత్నిస్తున్న వారందరికీ స్ఫూర్తినిస్తూనే ఉంది. ఈ గొప్ప ఆలోచనాపరుల ఆలోచనలు నేటికీ ప్రాసంగికత కలిగి ఉన్నాయి. న్యాయమైన ప్రపంచ క్రమం పేరుతో రష్యా, భారతదేశ ప్రజలను దగ్గర చేస్తాయి– వి. పుతిన్'

# భారత సరుకులు మరిన్ని కొంటాం

### భారత్, ఇఎఇయుల మధ్య త్వరితగతిన సంతకాలు చేయాలి
### ఇండియా, రష్యా బిజినెస్ ఫోరమ్ సమావేశంలో పుతిన్




**న్యూఢిల్లీ :** సరుకు రవాణా, సేవలు, పెట్టుబడి బదిలీకి అడ్డంకులు తగ్గించేందుకు వీలు కల్పించేందుకు భారతదేశం, యురేషియన్ ఎకనామిక్ యూనియన్ (ఇఎఇయు) మధ్య ప్రాధాన్యతా వాణిజ్య ఒప్పందంపై త్వరితగతిన సంతకాలు చేయాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సూచించారు.భారతదేశం, యురేషియన్ ఎకనామిక్ యూనియన్ గత వారం స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కోసం మొదటి విడత చర్చలు జరిపాయి. రష్యా, అర్మేనియా, బెలారస్, కజకిస్తాన్ ,కిర్గిస్తాన్‌లతో కూడిన ఐదు సభ్య దేశాలతో ఇఎఇయు ఏర్పాటైంది. భారత్, ఇఎఇయుల మధ్య ఆగస్టు 20న ఒప్పందం పరిశీలనాంశాలపై సంతకం జరిగింది. న్యూఢిల్లీలోని భారత్ మండపంలో శుక్రవారం జరిగిన ఇండియా– రష్యా బిజినెస్ ఫోరమ్ సమావేశంలో ప్రధాని మోదీతో కలిసి పుతిన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రష్యా అధ్యక్షుడు మాట్లాడుతూ తాను, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2030 నాటికి రెండు దేశాల మధ్య 100 బిలియన్ డాలర్ల వాణిజ్య లక్ష్యాన్ని నిర్దేశించుకున్నామని చెప్పారు. ఈ లక్ష్యాన్ని సాధించడానికి రెండు దేశాల వ్యాపార వర్గాల చురుకైన ప్రయత్నాలు అవసరమని ఆయన అన్నారు. వివిధ రంగాలలో భారతదేశంతో తాము బహుముఖ సంబంధాల అభివృద్ధిని కోరుకుంటున్నామని ఆయన అన్నారు. భారతదేశం నుండి వస్తువులు, సేవల కొనుగోళ్ళు అనేక రెట్లు పెంచడానికి రష్యన్ సంస్థలు సిద్ధంగా ఉన్నాయని ఆయన చెప్పారు. స్థిరమైన ద్వైపాక్షిక పరిష్కారం, విశ్వసనీయమైన చెల్లింపు, భీమా విధానాలు లేకుండా స్వేచ్ఛా వాణిజ్యం ఊహించలేనిది అని పుతిన్ నొక్కిచెప్పారు.వాణిజ్యంలో జాతీయ కరెన్సీలను ఉపయోగించడం ద్వారా స్పష్టమైన ప్రయోజనాలు అందించబడుతున్నాయని ఆయన పేర్కొన్నారు. బాహ్య పరిణామాలతో సంబంధం లేకుండా నిరంతరాయ ఆర్థిక లావాదేవీలను కొనసాగించడం చాలా ముఖ్యం అని ఆయన అన్నారు. భారతదేశం–రష్యా సహకారం,= వాణిజ్యానికి మాత్రమే పరిమితం కాకూడదని, ఇరుదేశాల పారిశ్రామిక సహకారాన్ని పెంపొందించుకోవడానికి ముందుకు సాగాలని, ఉభయ దేశాలు ఇప్పటికే చాలా ముందున్న కృత్రిమ మేధస్సు రంగంలో విస్తృత సహకారానికి తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు.

## భారత్‌లో ఆర్‌టి ఇండియా ఛానల్

### ప్రారంభించిన పుతిన్




**న్యూఢిల్లీ :** రష్యా ప్రభుత్వ ప్రాయోజిత టెలివిజన్ 'ఆర్‌టి' ఛానల్ భారతదేశంలో 'ఆర్‌టి ఇండియా' పేరుతో ఛానల్‌ను ప్రారంభించింది. రెండు రోజుల పర్యటనలో భాగంగా భారత్‌కు వచ్చిన రష్యా దేశాధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ శుక్రవారం ఈ ఛానల్ ప్రసారాలను ఒక హోటల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రారంభించారు.ఈ సందర్భంగా పుతిన్ మాట్లాడుతూ ఆర్‌టి పాశ్చాత్య ప్రచార యంత్రాంగం కంటే చాలా భిన్నంగా ఉంటుందని,మొదటగా రష్యా గురించి, ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న దాని గురించి వాస్తవ సమాచారాన్ని తన ప్రేక్షకులకు తెలియజేయడానికి ప్రయత్నిస్తుందని అన్నారు. రష్యా వాస్తవికత గురించి మరింత తెలుసుకునే అవకాశాన్ని ఆర్‌టి ఇండియా లక్షలాది మంది భారతీయ పౌరులకు కల్పిస్తుందని చెప్పారు. ఆర్‌టి ఇండియాలో రోజుకు నాలుగు కార్యక్రమాలను ఆంగ్లంలో ప్రసారం చేస్తారు.

### పిటిఐ, టాస్ మధ్య ఒప్పందం

భారతదేశం, రష్యాలో పరిణామాలపై వార్తలను మార్పిడి చేసుకోవడానికి వీలుగా ప్రెస్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా (పిటిఐ), రష్యన్ వార్తా సంస్థ టాస్ శుక్రవారం ఒక సహకార ఒప్పందంపై సంతకం చేశాయి. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటన సందర్భంగా జరిగిన ఇండియా–రష్యా బిజినెస్ ఫోరం సమావేశంలో పిటిఐ సిఇఒ, ఎడిటర్ ఇన్ చీఫ్ విజయ్ జోషి, టాస్ డైరెక్టర్ జనరల్ ఆండ్రీ కొండ్రాషోవ్ ఈ ఒప్పందంపై సంతకాలు చేశారు.

## మేము తటస్థం కాదు..శాంతి పక్షం

### రష్యా అధ్యక్షుడితో చర్చల సందర్భంగా ప్రధాని మోదీ



**న్యూఢిల్లీ:** ఉక్రెయిన్‌లో యుద్ధాన్ని ముగించేందుకు చేసిన తాజా ప్రయత్నాలను ప్రధాని నరేంద్ర మోదీ శుక్రవారం గట్టిగా సమర్థించారు. ఈ వివాదానికి సామరస్యపూర్వక పరిష్కారం కనుగొనేందుకు వీలుగా జరిగే అన్ని శాంతి ప్రయత్నాలలో భారతదేశం భుజం భుజం కలిపి నిలబడుతుందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు తెలియజేశారు. ఇరు దేశాల నా యకుల మధ్య జరిగిన వార్షిక శిఖరాగ్ర చర్చలలో ఉక్రేన్ సమస్య ప్రముఖంగా ప్రస్తావించబడింది.భౌగోళిక రాజకీయ వా తావరణం, ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ, దా దాపు ఎనిమిది దశాబ్దాల ద్వైపాక్షిక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయడ మే లక్ష్యంగా ఈ చర్చలు సాగాయి. ఉక్రేన్ ఘర్షణ విషయంలో భారతదేశం తటస్థంగా లేదని, యుద్ధం ముగించేందుకు భారతదేశం శాంతి వైపు ఉందని టెలివిజన్‌లో ప్రసారమైన చర్చల ప్రారంభ ప్రసంగంలో మోదీ వ్యాఖ్యానించారు.ఉక్రెయిన్ ఘర్షణ ప్రారంభమైన తర్వాత తాము చ ర్చలు జరుపుతున్నామని, సన్నిహిత స్నే హితుడిగా పుతిన్ పరిస్థితి గురించి తమకు క్రమం తప్పకుండా తెలియజేస్తున్నారని, విశ్వాసం ఒక ప్రధాన బలం అని తాను భావిస్తున్నట్లు ప్రధాని తెలిపారు. మనమంద రం శాంతి మార్గాన్ని కనుగొనాలని, తాజా ప్రయత్నాల గురి ంచి తనకు తెలుసునని, ప్రపం చం శాంతి దిశగా మళ్ళుతుందని తనకు విశ్వాసం ఉందని అన్నారు.
'భారతదేశం తటస్థంగా లేదని నేను ఎ ప్పుడూ చెబుతూనే ఉన్నాను, భారతదేశం ఒక వైపు ఉంటుంది. అది శాంతి వైపు. మేము అన్ని శాంతి ప్రయత్నాలకు మద్ద తు ఇస్తాము.అన్ని శాంతి ప్రయత్నాలలో మేము భుజం భుజం కలిపి నిలబడతా ము' అని ఆయన అన్నారు.సంఘర్షణకు శాంతియుత పరిష్కారం కోసం మాస్కో తన వంతుగా కృషి చే స్తోందని పుతిన్ చెప్పారు. నాలుగు సంవత్సరాల తర్వాత తొలిసారిగా భారతదేశానికి వచ్చిన పుతిన్‌కు గురువారం సాయంత్రం రెడ్ కార్పెట్ స్వాగతం లభించింది. ఫిబ్రవరి 2022లో ఉక్రెయిన్‌లో యుద్ధం ప్రారంభమైన తర్వాత ఆయన భారతదేశానికి పర్యటించడం ఇదే మొదటిసారి.ప్రధాని మోదీ పాలం విమానాశ్రయంలో రష్యా నాయకుడిని వ్యక్తిగతంగా కౌగిలించుకుని స్వాగతం పలికారు. తరువాత పు తిన్‌ను తెల్లటి ఎస్‌యువిలో ప్రధానమంత్రి తన అధికారిక నివాసానికి ప్రైవేట్ విందు కోసం తోడ్కొని వెళ్ళారు.విందు సందర్భం గా ఇద్దరు నాయకుల మధ్య జరిగిన సంభాషణ 23వ భారతదేశం–రష్యా శిఖరా గ్ర సమావేశ చర్చల్లో భాగమైంది. ఇరు దే శాల కాలానుగుణ సంబంధాన్ని మరింత విస్తృతం చేయడానికి అనేక స్పష్టమైన ఫలితాలను ఇస్తుందని భావిస్తున్నారు.

# ప్రభుత్వ గుత్తాధిపత్యం వల్లే...

### 'ఇండిగో' సర్వీసుల్లో అంతరాయంపై ప్రతిపక్షనేత రాహుల్‌గాంధీ విమర్శ



**న్యూఢిల్లీ:** దేశంలోని అతిపెద్ద విమానాయాన సంస్థ ఇండిగో సర్వీసుల్లో అంతరాయంపై లోక్‌సభలో ప్రతిపక్షనేత ఘాటుగా స్పందించారు. 'ఇండిగో' వైఫల్యము బిజెపి నేతృత్వంలోని కేంద్రం ప్రభుత్వ 'గుత్తాధిపత్య నమూనా' వల్లేనని ఆ రోపించారు. ప్రతి రంగంలోనూ భారత్ న్యా యమైన పోటీకి అర్హమైనదని, మ్యాచ్ ఫిక్సింగ్ గుత్తాధిపత్యాలు కాదని చెప్పారు. ఇండిగో గురువారం 550కి పైగా విమానాలను, శుక్రవారం 400 విమానాలను రద్దు చేయడం ద్వారా వందలాది మంది ప్రయాణికుల ప్రయాణ ప్రణాళికలకు అంతరాయం కలిగి ంచిన నేపథ్యంలో, సాధారణ భారతీయులు ఆలస్యం, ర ద్దు, నిస్సహాయతకు మూల్యం చెల్లిస్తున్నారని రాహుల్‌గా ంధీ శుక్రవారం ఎక్స్ వేదికగా కేంద్రంపై తీవ్రంగా మండిపడ్డారు. 'మ్యాచ్ ఫిక్సింగ్ గుత్తాధిపత్యాలలో కాదు, ప్రతి ర ంగంలోనూ భారతదేశం న్యాయమైన పోటీకి అర్హమైనది' అ ని స్పష్టం చేశారు. కాంగ్రెస్ మాజీ చీఫ్ గత సంవత్సరం ఒక వార్తాపత్రికలో ప్రచురించబడిన తన కథనాన్ని కూడా పం చుకున్నారు. అందులో అసలు ఈస్ట్ ఇండియా కంపెనీ 15 0 సంవత్సరాల క్రితం ముగిసిపోయిందని, కానీ అది అప్పు డు సృష్టించిన పచ్చి భయం కొత్త జాతి గుత్తాధిపత్యం స్థాన ంలోకి వచ్చిందని ఆయన అన్నారు. 'ప్రగతిశీల భారతీయ వ్యాపారానికి కొత్త ఒప్పందం అనేది సమయం వచ్చిన ఆలోచన అని నొక్కిచెప్పారు. కాగా, కాంగ్రెస్ మీడియా విభాగం అధిపతి పవన్ ఖేరా విమానాశ్రయాలలో జరుగుతున్నది గుత్తాధిపత్యం లేదా ద్వంద్వత్వ ఫలితమని పేర్కొన్నారు. 'చెప్పులు వేసుకున్న వ్యక్తులు విమానాల్లోకి ఎక్కుతారని చెప్పేవారు. కానీ విమానాశ్రయాలలో, ప్రయాణికులకు, ఇండిగో సిబ్బందికి మధ్య బూట్లు, చెప్పులు మార్పిడి చేయబడుతున్నాయి.ఇద్దరు వ్యక్తులు పార్టీని నడిపిస్తారు. ఇద్దరు వ్యక్తులు ప్రభుత్వాన్ని నడిపిస్తారు. ఇద్దరు వ్యక్తులు వ్యాపారాలను నడిపిస్తారు. కాబట్టి, ఇది జరుగుతుంది' అని ఖేరా ఎక్స్‌లో ఒక పోస్ట్‌లో చేశారు. మన విమానయాన రంగంలో 92 శాతం వాటా కేవలం రెండు కంపెనీలైన ఇండిగో, టాటా చేతుల్లోనే ఉందని, ప్రభుత్వం వాటి ముందు తల వంచాల్సి వచ్చిందన్నారు. ఈ కంపెనీల ఒత్తిడి కారణంగా కొత్త ప్రయాణికుల భద్రతా మార్గదర్శకాలను ఉపసంహరించుకోవలసి వచ్చిందన్నారు. గుత్తాధిపత్యం అంశంపై, కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా లేకరులతో మాట్లాడుతూ, 'దేశవ్యాప్తంగా, చాలా విషయాలు కొద్దిమందికి మాత్రమే చెందుతాయని మనందరికీ తెలుసు. అది ఈ ప్రభుత్వం చేసే పని. అది ఆరోగ్యకరమైనది కాదు. ఇది ఆర్థిక వ్యవస్థకు, ప్రజాస్వామ్యానికి, దేశానికి ఆరోగ్యకరమైనది కాదు' అని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ప్రభుత్వం 'ఒకప్పుడు పోటీతత్వం ఉన్న పరిశ్రమను రెండుగా తగ్గించిందని, ప్రయాణికుల ప్రయోజనాల కంటే కార్పొరేట్ దురాశకు ప్రాధాన్యత ఇచ్చిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కె సి వేణుగోపాల్ ఆరోపించారు. 'జెట్ ఎయిర్‌వేస్, గో ఫస్ట్ పతనం నుండి ఎయిర్ ఇండియా గుత్తాధిపత్య విలీనం వరకు ఈ వినాశకరమైన ఫలితానికి దోహదపడిన ప్రతి చర్య వారి పర్యవేక్షణలోనే జరిగిందని ఆయన ఎక్స్‌లో వెల్లడించారు. 'ఇది సాధారణ కార్యాచరణ అవాంతరం కాదు, ఇది ప్రభుత్వం ఆమోదించిన వ్యవస్థాగత వైఫల్యం, వెంటనే కఠినమైన చర్యలు తీసుకోకపోతే మళ్ళీ మళ్ళీ జరుగుతుంది' అని వేణుగోపాల్ పేర్కొన్నారు.

## నిర్వహణ వైఫల్యం

### ఇండిగో సంక్షోభంపై సిపిఐ : తక్షణ, పారదర్శక చర్యలకు డిమాండ్



**న్యూఢిల్లీ:** ఇండిగో విమానయాన సంస్థలో నెలకొన్న సంక్షోభం గుత్తాధిపత్య పర్యవసానం, నిర్వహణ వైఫల్యంతో ఏర్పడే ప్రమాదాలను బయటపెట్టిందని సీపీఐ వ్యాఖ్యానించింది. 'చాలా ఏళ్లుగా కేంద్ర పౌర విమానాయన శాఖ, కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరిసున్నా పట్టించుకోలేదు. పౌర విమానయాన రంగాన్ని గుత్తేదారుల చేతుల్లో పెట్టిన ఫలితంగా నేడు ప్రయాణికుల భద్రతతో రాజీ పడే పరిస్థితి ఏర్పడింది. పైలెట్లు, సిబ్బందిపై భారం పెరిగింది. ప్రజా ప్రయోజనాలు పణంగా ప్రైవేటు విమానయాన సంస్థలు బలోపేతమవుతున్నాయి. ఇండిగో కార్యకలాపాలు స్తంభించడం ఈ ఆందోళలను నిరూపించింది' అని సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా శుక్రవారం సామాజిక మాధ్యమం వేదికగా పేర్కొన్నారు. గుత్తేదారుల చేతుల్లోకి వ్యవస్థ వెళితే ఎంతటి ప్రమాదమో ఇండిగో సంక్షోభంతో తేలిందని వ్యాఖ్యానించారు. రెగ్యులేటరీ చర్యల లోపంతో పరిస్థితి మరింత జఠిలమైందని విమర్శించారు. డీజీసీఏ, పౌర విమానయాన శాఖ తక్షణమే స్పందించి పారదర్శక చర్యలు తీసుకోవాలని డి.రాజా డిమాండ్ చేశారు. భద్రతా నియమాలను సమర్థంగా పాటించేలా హామీనివ్వాలన్నారు. కార్యకలాపాల వైఫల్యానికి విమానయాన సంస్థ బాధ్యత తీసుకునేలా చేయాలని సూచించారు. రీబుకింగ్‌కు తోడ్పాటు అందించడమే కాకుండా బస సౌకర్యంతో పాటు ఇతర సేవలకు ఆయా సంస్థలు పూర్తిగా బాధ్యత తీసుకొనేలా తగు విధమైన చర్యలను తీసుకోవాలని డి.రాజా అన్నారు. గుత్తాధిపత్యానికి దారితీసిన విధానాలను పున:పరిశీలించాలని ప్రభుత్వానికి హితవు పలికారు. విమానయాన రంగంలో పర్యవేక్షణ వ్యవస్థను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. విమానయాన వ్యవస్థ అనేది ప్రయాణికులను, వర్కర్లను కాపాడేదిగా ఉండాలేగానీ కార్పొరేట్ లాభాలకు వాహనంగా మారకూడదని డి.రాజా పేర్కొన్నారు.

## పుతిన్‌కు రష్యన్ భాషలో భగవద్గీత బహుకరించిన మోదీ



**న్యూఢిల్లీ :** రష్యన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు రష్యన్ భాషలో ముద్రించిన భగవద్గీత ప్రతిని బహూకరించినట్లు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు.
'రష్యన్ భాషలో గీత ప్రతిని అధ్యక్షుడు పుతిన్‌కు బహూకరించారు. గీత బోధనలు ప్రపంచవ్యాప్తంగా లక్షలాది మందికి స్ఫూర్తినిస్తాయి' అని ప్రధాని మోదీ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. రెండు రోజుల పర్యటన కోసం ఇక్కడకు వచ్చిన పుతిన్ కోసం ప్రధాని మోడీ తన 7, లోక్ కళ్యాణ్ మార్గ్ నివాసంలో ప్రైవేట్ విందును ఏర్పాటు చేశారు.

### పుతిన్‌కు రాష్ట్రపతి విందు
## రాహుల్, ఖర్గేకు అందని ఆహ్వానం

**న్యూఢిల్లీ :** రాష్ట్రపతి నివాసంలో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గౌరవార్థం శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విందుకు లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ, రాజ్యసభ ప్రతిపక్ష నాయకుడు మల్లికార్జున్ ఖర్గేలకు ఆహ్వానం వెళ్ళలేదు. ఈ విషయాన్ని కాంగ్రెస్ వర్గాలు ఒక ఆంగ్ల దినపత్రికు ధృవీకరించాయి. అయితే కాంగ్రెస్ ఎంపికి శశి థరూర్‌కు మాత్రం ఆహ్వానం లభించింది.

### పాయింట్ ఆఫ్ ఆర్డర్
## లేవనెత్తడం సభ్యుల హక్కు : టిఎంసి

**న్యూఢిల్లీ:** సభలో పా యింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తడంలో సభ్యుల హ క్కులను కాపాడాలని అ ఖిల భారత తృణమూల్ కాంగ్రెస్ (ఎఐటిసి) ఎంపి డెరెక్ ఓ బ్రెయిన్ చైర్మన్ సి.పి. రాధాకృష్ణన్‌ను కోరారు. కొన్నిసార్లు వారు తమ సమస్యలను లేవనెత్తడానికి చాలాసేపు నిలబడాల్సి వ స్తుందని పేర్కొన్నారు. అయితే, అనేక మంది స భ్యులు తరచుగా ఒకే సమయంలో ఆర్డర్ పాయింట్‌లను లేవనెత్తుతారని, ఒక సభ్యుడు మాత్రమే మాట్లాడడానికి చైర్మన్ అనుమతిస్తారని చైర్మన్ అన్నారు. జీరో అవర్ సమయంలో పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఎంపి రూల్ 258 కింద పాయింట్ ఆఫ్ ఆర్డర్‌ను లేవనెత్తుతూ వచ్చే వారం సభ కార్యకలాపాలను జాబితా చేస్తున్నప్పుడు పార్లమెంటరీ వ్యవహారాల సహాయ మంత్రి ఎల్ మురుగన్ ఎన్నికల సంస్కరణలపై చర్చను ఎజెండాలో పెట్టలేదన్నారు. దానిపై రాజ్యసభ బిజినెస్ అడ్వైజరీ కమిటీ తన చివరి సమావేశంలో ఇప్పటికే నిర్ణయించిందన్నారు. గురువారం 45 నిమిషాలు నిలబడి ఉన్నప్పటికీ ప్రతిపక్ష సభ్యులకు ఆర్డర్ పాయింట్స్ లేవనెత్తే అవకాశం పదేపదే నిరాకరించబడిందని కూడా ఆయన ఆరోపించారు. మురుగన్ ముందుగా మాట్లాడుతూ వచ్చే వారం సభలో మూడు అంశాలు చర్చకు వస్తాయని, వాటిలో వందేమాతరం 150వ వార్షికోత్సవంపై చర్చ, కేటాయింపు బిల్లుతో సహా రెండు బిల్లులను తిరిగి పంపడం వంటివి ఉన్నాయని చెప్పారు. తన పాయింట్ ఆఫ్ ఆర్డర్‌లో టిఎంసి సభ్యుడు ఓ బ్రెయిన్ మాట్లాడుతూ వ్యాపార సలహా కమిటీ (బిఎసి) ముందు స్వల్పకాలిక చర్చ కోసం రెండు అంశాలను ఎజెండాలో పెట్టినట్లు చెప్పారు.రాజ్యసభ చైర్మన్ స్పందిస్తూ 'మీరు పాయింట్ ఆఫ్ ఆర్డర్ లేవనెత్తినప్పుడు, ఒకే ఒక్క వ్యక్తి పాయింట్ ఆఫ్ ఆర్డర్ అడగాలి. అందరూ అరుస్తున్నారు, అప్పుడు పాయింట్ ఆఫ్ ఆర్డర్ ఏమిటి? అని ప్రశ్నించారు. అయితే పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి ఓ'బ్రియన్ ఆందోళనలను అంగీకరించారు.

## ఆలయ దేవతకు చెందిన డబ్బును.. సహకార బ్యాంకులను కాపాడేందుకు ఉపయోగించలేం

- 'సుప్రీంకోర్టు' కీలక వ్యాఖ్యలు
- కేరళ హైకోర్టు ఆదేశాలను సమర్థించిన సుప్రీం

**న్యూఢిల్లీ :** ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న సహకార బ్యాంకులను ప్రోత్సహించడానికి ఆలయ దేవతకు చెందిన డబ్బును ఉపయోగించరాదని శుక్రవారం సుప్రీంకోర్టు చెప్పింది. తిరునెల్లి ఆలయ దేవస్వామ్‌కు చెందిన డిపాజిట్లను వారికి తిరిగి ఇవ్వాలని కేరళ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ కొన్ని సహకార బ్యాంకులు దాఖలు చేసిన పిటిషన్ల విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి ధర్మాసనం ఈ పదునైన వ్యాఖ్యలు చేసింది. ఈ స ందర్భంగా అత్యున్నత న్యాయస్థానం కేరళ హైకోర్టు ఆదేశాలను సమర్థించింది. 'మీరు ఆలయ ధనాన్ని బ్యాంకును కాపాడటానికి ఉపయోగించాలనుకుంటున్నారా ? ఆలయ డబ్బును చాలా కష్టంతో ఊపిరి పీల్చుకుంటున్న సహకార బ్యాంకులో కాకుండా గరిష్ఠ వడ్డీని ఇవ్వగలిగే జాతీయ బ్యాంకుకు మార్చాలని ఆదేశించడంలో తప్పు ఏమిటి' అని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ ప్రశ్నించారు. ఆలయ డబ్బు దేవతకు చెందినది కాబట్టి ఆ డబ్బును 'ఆదాచేయడం, రక్షించడం, ఆలయ ప్రయోజనాల కోసం మాత్రమే ఉపయోగించడం అనేది సహకార బ్యాంక్‌కు ఆదాయ వనరుగా లేదా మనుగడకు వనరుగా మారకూడదు' అని సిజెఐ అన్నారు. హైకోర్టు ఉత్తర్వులకు వ్యతిరేకంగా మనంతవాడి కోఆపరేటివ్ అర్బన్ సొసైటీ లిమిటెడ్, తిరునెల్లి సర్వీస్ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ హైకోర్టు ఆదేశాలను వ్యతిరేకిస్తూ అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్లు దాఖలు చేశారు. బ్యాంకులు మెచ్యూర్డ్ డిపాజిట్లను విడుదల చేయడానికి పదేపదే తిరస్కరించడంతో దేవస్వామ్ ఫిక్స్‌డ్ డిపాజిట్లను క్లియర్‌చేసి, రెండు నెలల్లోపు మొత్తం డబ్బును తిరిగి చెల్లించాలని కేరళ హైకోర్టు 5 సహకార బ్యాంకులను ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలు ఆకస్మిక ఇబ్బందులను కలిగిస్తున్నాయని చేసిన వాదనలతో ధర్మాసనం ఏకీభవించలేదు. బ్యాంకులు ప్రజల్లో విశ్వసనీయతనుతప్పకుండానెలకొల్పాలని ధర్మాసనంహితవు పలికింది.'మీరు (బ్యాంకులు) ఒకవేళ కస్టమర్లను, డిపాజిటర్లను ఆకర్షించలేకపోయినట్లయితే అది మీ సమస్య' అని ధర్మాసనం స్పష్టం చేసింది.ఈ పిటిషన్లను విచారించడానికి అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. అయితే అభ్యంతరకరమైన ఆదేశాన్ని పాటించడానికి సమయం పొడిగించాలని కోరుతూ బ్యాంకులు హైకోర్టును ఆశ్రయించడానికి సుప్రీంకోర్టు అనుమతించింది. తిరునెల్లి సర్వీస్ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, సుశీలా గోపాలన్ స్మారక వనితా కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్, మనంతవాడి కోఆపరేటివ్ అర్బన్ సొసైటీ లిమిటెడ్, వాయనాడ్ టెంపుల్ ఎంప్లాయీస్ కోఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్‌లను రెండు నెలల గడువులోపు నిధులను తిరిగి ఇవ్వాలని హైకోర్టు ఆదేశించిన విషయం తెలిసిందే.

## మీ వల్ల కాదంటే ... వైస్‌ఛాన్సలర్లను మేమే నియమిస్తాం

- కేరళ సిఎం, గవర్నర్లకు 'సుప్రీం' సుతిమెత్తని చురక
- డిసెంబరు 9నాటికి ఒక ఏకాభిప్రాయానికి రావాలని సూచన



**న్యూఢిల్లీ:** కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, గవర్నర్‌కమ్‌ఛాన్సలర్ రాజేంద్ర అర్లేకర్ ఒక ఏకాభిప్రాయానికి రానట్లయితే కేరళలోని రెండు సాంకేతిక విద్యాలయాల వైస్‌ఛాన్సలర్ల ఎంపికపై కొనసాగుతున్న ప్రతిష్ఠంభనను పరిష్కరించడానికి తామే జోక్యం చేసుకుంటామని శుక్రవారం సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఎ.పి.జె. అబ్దుల్ కలాం టెక్నలాజికల్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ డిజిటల్ సైన్సెస్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీల వైస్ ఛాన్సలర్‌ల నియామాకాలకు సంబంధించిన పిటిషన్లను జస్టిస్ జె.బి.పార్థివాలా, జస్టిస్ పి.బి.వరాలేలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. ఈ ప్రతిష్ఠంభనకు సామరస్యపూర్వక పరిష్కారం కనుగొనాలని గవర్నర్ తరపున హాజరైన అటార్నీ జనరల్ ఆర్.వెకంటరమణి, ముఖ్యమంత్రి తరపున హాజరైన సీనియర్ న్యాయవాది జైదీప్‌గుప్తాను ధర్మాసనం కోరింది. జస్టిస్ (రిటైర్డ్) సుధాంశు ధులియా కమిటీ రెండు సెట్ల పేర్లను సిఫారసు చేయగా ఛాన్సలర్ రెండు పేర్లను ఎంపిక చేశారని అటార్నీ జనరల్ వెంకటరమణి వెల్లడించారు. 'కొన్ని సాధారణ పేర్లతో ముఖ్యమంత్రికి కొంత ఇబ్బంది ఉంది' అని అటార్నీజనరల్ చెప్పారు. దీనిపై సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా మాట్లాడుతూ ముఖ్యమంత్రికి ఆమోదయోగ్యం కాని పేరును గవర్నర్‌కమ్‌ఛాన్సలర్ మాత్రమే సూచిస్తున్నారని చెప్పారు. 'ఈ కోర్టు ద్వారా ఒక పరిష్కారం కనుగొనబడాలని నేను భావిస్తున్నాను' అని గుప్తా సమాధానమిచ్చారు.జస్టిస్ ధులియా నేతృత్వంలోని కమిటీ రెండు యూనివర్సిటీలకు నాలుగుపేర్లు సూచించారని, గవర్నర్, ముఖ్యమంత్రి తప్పకుండా రెండు బ్యాచ్‌లకు చెందిన అత్యంత మెరిట్ అభ్యర్థులను మాత్రమే నియమించాలని జస్టిస్ పార్థివాలా సీనియర్ న్యాయవాదులను ఉద్దేశించి అన్నారు. డిసెంబర్ 9 నాటికి ఏకాభిప్రాయం కుదరకపోత తాము జోక్యం చేసుకుని నియామకాలను స్వయంగా చేపడతామని ధర్మాసనం పేర్కొంటూ 'మంగళవారం నాటికి ఏకాభిప్రాయానికి రావాలి లేదంటే మేమే వైస్‌ఛాన్సలర్లను నియమించి సమస్యను పరిష్కరిస్తాం' అని సుప్రీంకోర్టు నొక్కిచెప్పింది.అనంతరం అత్యున్నత న్యాయస్థానం ఈ కేసు విచారణను గురువారం నాటికి వాయిదా వేసింది.

### 'మహాయుతి' ప్రభుత్వం ఏడాదిపాలనపై
## శ్వేతపత్రం విడుదల చేయాలి




**ముంబయి:** మహారాష్ట్రలోని మహాయుతి ప్రభుత్వం శుక్రవారంతో ఏడాది పూర్తి చేసుకోనుంది. ఈ నేపథ్యంలో రానున్న శీతాకాల శాసనసభ సమావేశాల్లో గత 12 నెలల్లో సాధించిన విజయాలను వివరిస్తూ 'శ్వేతపత్రం' సమర్పించాలని ప్రతిపక్ష కాంగ్రెస్ డిమాండ్ చేసింది. బిజెపి నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వం ఒక సంవత్సరం పాలన పూర్తి చేయడంతో మహారాష్ట్ర ప్రజలు నిరాశకు గురయ్యారని కాంగ్రెస్ శాసనసభా పార్టీ (సిఎల్‌పి) నాయకుడు విజయ్ వాడేట్టివార్ అన్నారు. శుక్రవారం ఆయన నాగ్‌పూర్‌లో విలేకరులతో మాట్లాడుతూ గత ఏడాది కాలంలో రైతు ఆత్మహత్యలు పెరిగాయని, వ్యవసాయ ఉత్పత్తులకు హామీ ధరలు లభించడం లేదని, రైతులు విత్తనాలు లేదా ఎరువులు సకాలంలో అందుకోలేక ఇబ్బంది పడుతున్నారని మాజీ మంత్రి పేర్కొన్నారు. 'ప్రభుత్వం తన వీపును తానే తడుముకోవడంలో బిజీగా ఉంది. వారు ఫైవ్ స్టార్ హోటళ్లలో కూర్చుని తమ విజయాలను వివరిస్తున్నారు, కానీ ప్రజలకు నిరాశ తప్ప మరేమీ లభించలేదు' అని వడేట్టివార్ అన్నారు. డిసెంబర్ 8న నాగ్‌పూర్‌లో ప్రారంభమయ్యే శాసనసభ శీతాకాల సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలు, నిర్ణయాలు, అమలును వివరిస్తూ 'శ్వేతపత్రం' సమర్పించాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యంగా, 'శ్వేతపత్రం' అనేది ప్రజా ప్రయోజనానికి సంబంధించిన అంశంపై సమాచారం లేదా ప్రతిపాదనలు ఇచ్చే ప్రభుత్వ నివేదికను సూచిస్తుంది. బిజెపి, శివసేన, ఎన్‌సిపిలతో కూడిన పాలక మహాయుతి సంకీర్ణం మహిళలపై నేరాలను అరికట్టడంలో, పిల్లల ఆరోగ్యాన్ని కాపాడడంలో సహా అనేక అంశాలలో విఫలమైందని సిఎల్‌పి నాయకుడు అన్నారు. 'మరాఠ్వాడ (మధ్య మహారాష్ట్ర)లో వరదలు రైతులను నాశనం చేశాయి. పోషకాహార లోపం ఉన్న పిల్లల సంఖ్య పెరిగింది. రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల పరిస్థితి క్షీణించింది. మహిళలపై నేరాలు పెరుగుతున్నాయి. బిల్డర్లు, మంత్రులు పరస్పర అవగాహనతో కోట్లాది విలువైన భూమిని లాక్కుంటారు. సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతుంటే, అనుకూల పారిశ్రామికవేత్తలు ప్రయోజనం పొందుతున్నారు' అని వాడేట్టివర్ పేర్కొన్నారు. తాను ఎమ్మెల్యేగా ఉన్న చంద్రపూర్ జిల్లాలో అక్రమ బొగ్గు తవ్వకాలు జరుగుతున్నాయని కాంగ్రెస్ నాయకుడు ఆరోపించారు. 'చంద్రపూర్‌లోని బరంజ్ బొగ్గు గనిలో నిబంధనలను పూర్తిగా ఉల్లంఘిస్తూ అక్రమ వెలికితీత జరుగుతోంది. లక్షల విలువైన బొగ్గును మార్కెట్లో బహిరంగంగా అమ్ముతున్నారు' అని ఆయన పేర్కొన్నారు. 2023లో ఈ ప్రాంతంలో బొగ్గు తవ్వకాలకు అనుమతి మంజూరు చేస్తున్నప్పుడు పర్యావరణ శాఖ విధించిన షరతులు ఉల్లంఘించబడ్డాయని, ప్రాజెక్టు ప్రభావిత కుటుంబాల పునరావాసం ఇంకా పెండింగ్‌లో ఉందని మాజీ రాష్ట్ర మంత్రి అన్నారు. పర్యావరణ మంత్రి నుండి అటవీ శాఖ అధికారుల వరకు అందరూ అవినీతికి పాల్పడ్డారని అని ఆయన పేర్కొన్నారు. ఈ విషయాన్ని వచ్చే వారం అసెంబ్లీలో లేవనెత్తుతామని చెప్పారు. రెండు సభల్లోనూ ప్రతిపక్ష నాయకుడిని నియమించనందుకు ప్రభుత్వాన్ని విమర్శిస్తూ, పాలక సంకీర్ణానికి ప్రజాస్వామ్యం లేదా రాజ్యాంగం పట్ల గౌరవం లేదని వాడేట్టివార్ నొక్కి చెప్పారు.
'ప్రజాస్వామ్యంలో, శక్తివంతమైన ప్రతిపక్షం అవసరం, కానీ ఈ ప్రభుత్వానికి ప్రతిపక్షం, అసమ్మతి స్వరం అవసరం లేదు' అని ఆయన అన్నారు. నాగ్‌పూర్‌లో ఆనవాయితీగా జరిగే శీతాకాల సమావేశాలకు బదులుగా, మహారాష్ట్ర రెండవ రాజధానిలో పూర్తి స్థాయి బడ్జెట్ సమావేశాన్ని నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రజాపక్షం
శనివారం, 06 డిసెంబరు

# పుతిన్ పర్యటన మరో మైలురాయి

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటనను అసాధారణమైన అంతర్జాతీయ పరిస్థితుల్లో విశేష ప్రాధాన్యతగల సందర్భంగా అభివర్ణించవచ్చు. ఇది పైకి కనిపించే వాణిజ్య ఒప్పందాలు, పరస్పర మెప్పుకోళ్లు, స్వాగత సత్కారాలకు మించిన ప్రాధాన్యతగలది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలు, డాలర్‌ను ఆయుధంగా ఉపయోగిస్తూ అంతర్జాతీయ వాణిజ్య వ్యవస్థలను అల్లకల్లోలం చేస్తుండగా, ఉక్రేన్–రష్యా యుద్ధం కారణంగా రష్యాను ఆర్థికంగా, సైనికంగా కృంగదీసి దెబ్బతీసేందుకు అమలు జరుపుతున్న ఆంక్షలు, రెట్టింపు సుంకాల విధింపు నేపథ్యంలో, వాణిజ్య ఒప్పందంకోసం మనదేశంపై ఒత్తిడి చేస్తుండగా భారత–రష్యా చిరకాల మైత్రి వ్యూహాత్మకం, చెక్కుచెదరనిదని ప్రపంచ దేశాలకు చాటిచెప్పటానికి పుతిన్ భారత పర్యటన ఇరుదేశాలకు ప్రయోజనకరమైంది. పుతిన్ పర్యటనను ''ప్రత్యేకమైనది, ప్రత్యేకతగల భాగస్వామ్యం'' అనే దౌత్య పరిభాషలో పేర్కొన్నప్పటికీ, దానికున్న అత్యంత భూగోళ రాజకీయ ప్రాముఖ్యత సుస్పష్టం. ఈ పర్యటన ఫలితాలకోసం వాషింగ్టన్, బ్రస్సెల్స్, రియాద్, బీజింగ్, టోక్యో, ప్రతి ఒక్క ఏసియన్ కూటమి దేశం ఆతృతతో ఎదురుచూడటమే దాని ప్రాధాన్యతను వెల్లడిస్తున్నది. పుతిన్‌కు భారత ప్రభుత్వ ఆతిథ్యంతీరు, ప్రధాని మోదీ ప్రోటోకాల్ పక్కనబెట్టి స్వయంగా విమానాశ్రయానికి వెళ్లి ఆయనకు స్వాగతం చెప్పటం ఒక విశేషమైతే, మరోవైపున మోదీ నియోజకవర్గం వారణాసివాసులు కనీవినీ ఎరుగని రీతిలో గంగానదివెంట రష్యా నేత ఫోటోలకు విభూతిదిద్ది, పూలదండలు వేసి, హారతులిచ్చి ''ఇండియా–రష్యా ఫ్రెండ్‌షిప్ మార్చ్'' నిర్వహించి, క్లిష్ట సమయాల్లో భారత్‌కు అండగా నిలిచిన రష్యాకు కృతజ్ఞతలు చెప్పారు. డ్రమ్ములు–సాంప్రదాయక సంగీతవాయిద్యాల మధ్య మహిళలు ప్రార్థనలు చేయగా, ప్రదర్శకులు ''భారత్–రష్యా సంబంధాలు వర్థిల్లాలి'' అనే నినాదంతో బ్యానర్లు ప్రదర్శించారు. విశాల భారత సంస్థాన్, స్థానిక బృందాలు ఈ కార్యక్రమం నిర్వహించారు. భారత్–రష్యా మైత్రి ప్రపంచ శాంతికి అవసరమన్నారు.

1950వ దశకంలో సోవియట్ యూనియన్‌తో దౌత్యసంబంధాలు నెలకొల్పుకోవటం ద్వారా నాటి ప్రధాని పండిత జవహర్‌లాల్ నెహ్రూ స్నేహ–సహకార సంబంధాలకు పునాది వేశారు. లాల్ బహదూర్ ప్రధానిగా ఉన్న స్వల్పకాలంలో అవి ప్రగాఢమైనాయి. ఇందిరాగాంధి పాలన కాలంలో – బంగ్లాదేశ్ విముక్తి పోరాటం సందర్భంలో అమెరికా జోక్యాన్ని నివారించేందుకు సోవియట్ యూనియన్‌తో ఆమె సంతకం చేసిన శాంతి – స్నేహ – సహకార పాతికేళ్ల ఒప్పందం ఇరుదేశాల సంబంధాలను రక్షణ విషయంలో శిఖరాగ్రానికి తీసుకెళ్లింది. అమెరికా వెనక్కు తగ్గింది, బంగ్లాదేశ్ విముక్తి పోరాటం విజయవంతమైంది. సోవియట్ యూనియన్ విచ్ఛిన్నం తదుపరి అంతర్జాతీయంగా ప్రచ్ఛన్నయుద్ధం ముగిశాక ఆ దేశ వారసత్వ బాధ్యత రష్యా తీసుకున్నా అది రాజకీయ గందరగోళంలో పడింది. ఆ దశలో వరల్డ్‌బ్యాంక్ ఆదేశించిన నయా ఉదారవాద విధానాలను స్వీకరించిన కాంగ్రెస్ పాలకులు అమెరికా వైపు మొగ్గుదలకు బాటవేయగా, నరేంద్రమోదీ నాయకత్వంలోని ఆర్‌ఎస్‌ఎస్–బిజెపి ప్రభుత్వం గత దశాబ్దంలో మన దేశాన్ని అమెరికా రక్షణ వలయం దగ్గరలోకి తీసుకెళ్లింది. ''ప్రియ మిత్రుడు'' అనుకున్న ట్రంప్ 'నాకు అమెరికాయే ముఖ్యం''అంటూ ఎడాపెడా సుంకాలతో మోదీ ఆశలపై నీరు చల్లటమేగాక, తానే భారత్–పాకిస్థాన్ యుద్ధాన్ని ఆపానంటూ మన రక్షణ పాటవాన్ని, సార్వభౌమత్వాన్ని పదేపదే కించపరిచాక అమెరికాతో ఎడముఖం–పెడముఖం తప్పలేదు. ఈ పరిస్థితుల్లో ''వ్యూహాత్మక స్వేచ్ఛ'' పునరుద్ఘాటిస్తూ రష్యా, చైనాలతో సంబంధాల మెరుగుదలను న్యూఢిల్లీ ప్రారంభించింది. రష్యా కష్టకాలంలో అది తక్కువ రేటుకు ఇచ్చిన ఆయిలును భారీగా కొనుగోలు చేసి చైనాతో పాటు భారత్ చేయూతగా నిలబడింది. ఆ విధంగా ఇరుదేశాల ప్రయోజనాలు మమేకమై తాజా పర్యటనకు దోహదం చేశాయి.

2030 వరకు ఆర్థిక, వాణిజ్య సంబంధాలను పెంపొందించుకునే పంచవర్ష ప్రణాళికను పుతిన్ పర్యటనలో పటిష్ఠం చేశారు. ఆరోగ్యం, సందర్శనలు, కార్మికులకు అవకాశం, ఆహార భద్రత, నౌకాయానం, అణుశక్తి, రక్షణరంగంలో సహకార వృద్ధి తదితర ఒప్పందాలు కుదిరాయి. ఇండియా, ఇరాన్, అఫ్ఘానిస్థాన్, ఆర్మేనియా, అజర్‌బైజాన్, రష్యా, మధ్య ఆసియా, యూరప్ మధ్య సరుకు రవాణాకు ఉద్దేశించిన 7200 కిలోమీటర్ల బహుళ తరహా రవాణా ప్రాజెక్టు (అంతర్జాతీయ నార్త్–సౌత్ ట్రాన్స్‌పోర్ట్ కారిడార్ (ఐఎన్ఎస్‌టిసి)కై, చెన్నై–వ్లాడివోస్టాక్ కారిడార్‌లపై ఎప్పుడో కుదిరిన ఒప్పందాల అమలును వేగవంతం చేయాలని నిర్ణయించారు. ఇప్పుడున్న 65 బిలియన్ డాలర్ల వాణిజ్యాన్ని 100 బిలియన్ డాలర్లకు పెంచుకోవాలని నిర్ణయించారు. అయితే రష్యాకు భారత ఎగుమతులు 5 బిలియన్ డాలర్లుగానే ఉండి పెద్ద వాణిజ్యలోటు ఉన్నందున – దాన్ని తగ్గించేందుకు భారత్ నుంచి దిగుమతుల పెంపుదలకు రష్యా హామీ ఇచ్చింది.

ఇంధన రంగంలో న్యూఢిల్లీతో సహకారం విస్తరణకు రష్యా ఆసక్తితో ఉందని, భారత్‌కు నిరాటంకంగా ఇంధన సరఫరాకు రష్యా సిద్ధంగా ఉందని పుతిన్ చెప్పినమాట ఆసక్తిదాయకం. ఉక్రేన్ యుద్ధం ముగింపుపై ప్రస్తుతం ట్రంప్ వైపు నుంచి జరుగుతున్న శాంతి కృషి సఫలమైతే ఇది సాధ్యం. ఆరోజు దగ్గర్లోనే ఉన్నట్లు పుతిన్ మాటలు సూచిస్తున్నాయి.

## వెనిజులాపై దాడికి

# ఇరాక్ యుద్ధం తరహాలో ట్రంప్ ఎత్తులు

**అశోక్ నీలకంఠన్ అయ్యర్స్**

గత శనివారం అధ్యక్షుడు ట్రంప్ వెనిజులా విమానయాన ఆవరణను 'పూర్తిగా మూసివేయబడినట్లు' ప్రకటించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా కార్యకలాపాలకు వ్యతిరేకంగా పోరాటం అనే పేరుతో ఆయన ఆ దేశ భూ తలంపై సైనిక దాడులకు అవకాశాలు ఉన్నట్లు బెదిరించారు.

గత మూడు నెలల్లో మాదకద్రవ్యాలను తీసుకువెళుతున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ఓడలపై అమెరికా దళాలు దాదాపు రెండు డజన్ల ప్రాణాంతక దాడులు నిర్వహించాయి. ఫలితంగా కనీసం 82 మంది మరణించారు. నావికాదళంలో అత్యంత అధునాతన విమాన వాహక నౌక అయిన యుఎస్ గెరాల్డ్ ఆర్.ఫోర్డ్ ప్రస్తుతం కరేబియన్ జలాల్లో గస్తీ తిరుగుతోంది. కోస్ట్ గెరాల్డ్ డ్రోన్లు 1 బిలియన్ డాలర్లకు పైగా మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకున్నాయి. వైట్ హౌస్ నుండి వెలువడిన వాచాలత్వం వెనిజులా అధ్యక్షుడు నికోలస్ మదురో పట్ల క్రమంగా మరింత యుద్ధోన్మాదంగా మారింది.

మాదకద్రవ్యాల నిరోధక చర్యగా మొదలైన వ్యవహారం పెరుగుతున్న ముప్పుకు అవసరమైన ప్రతిస్పందనగా మారిందని పరిపాలన అధికారులు నొక్కి చెబుతున్నారు. కానీ ప్రస్తుత, మాజీ అధికారులు పరిశీలించిన నిఘా అంచనాలు, అమెరికా సైనిక ఆస్తుల విస్తరణ విధానాలు, వ్యూహాత్మక స్థానాలతో పాటు, మరింత సంక్లిష్టమైన లక్ష్యాన్ని సూచిస్తున్నాయి. అవి మిస్టర్ మదురో ప్రభుత్వాన్ని అస్థిరపరచడం, చివరకు వెనిజులాలోని విస్తారమైన చమురు సంపదను చేజిక్కించుకోవటం.రెండు దశాబ్దాల క్రితం ఇరాక్ యుద్ధానికి ముందు అమలైన వ్యూహంతో ప్రస్తుత ఘటనలకు ఇబ్బందికర పోలిక ఉంది. అమెరికా అత్యంత వినాశకరమైన విదేశాంగ విధాన తప్పిదాలలో ఒకటి పునరావృతం అవుతున్నట్లు లాటిన్ అమెరికన్ దౌత్యవేత్తలు, ఐక్యరాజ్యసమితి అధికారులు లేదా కాంగ్రెస్ సభ్యులు సమాంతర పరిణామాల పట్ల ఎక్కువగా ఆందోళన చెందుతున్నారు.


కరేబియన్ జలాల్లో మోహరించిన యుఎస్ గెరాల్డ్ ఆర్.ఫోర్డ్

సైనిక విస్తరణ వేగంగా, గణనీయంగా సాగుతోంది. ప్రధానంగా తీరజలాల్లో నిశ్శబ్దంగా మానవతా కార్యకలాపాలపై దృష్టి సారించేదిగా చాలా కాలంగా పరిగణించబడుతున్న యుఎస్ సదరన్ కమాండ్ ఆగస్టు మాసం నుంచి యుద్ధ కార్యకార్యకలాపాలకు ప్రధాన కేంద్రంగా మారింది. ఇది పెంటగాన్ అధికారులు చెబుతున్నట్లుగా దశాబ్దాలలో అత్యంత ముఖ్యమైన అర్ధగోళ సైనిక చర్యగా రూపాంతరం చెందింది.

స్వయంప్రతిపత్తి వ్యవస్థల కోసం 350 మిలియన్ల డాలర్‌లను వెచ్చించడం ద్వారా బలోపేతం చేయబడిన ఈ తీర రక్షక నావ వందలాది వైమానిక, సముద్రగర్భ డ్రోన్లను మోహరించింది. మళ్లీ ఇంధనం నింపకుండా 1,150 మైళ్ళు ప్రయాణించగల వి–బిఎటి విమానం ఫ్లీట్ భారీగా మాదకద్రవ్య స్వాధీనంకు దారితీసిన నౌకలను ట్రాక్ చేయడంలో ఘనత పొందింది. వీటిలో ఈ నెల ప్రారంభంలో పోర్ట్ ఎవర్‌గ్లేడ్స్, ఫ్లోరిడాలో రికార్డు స్థాయిలో 60,000 పౌండ్ల కొకైన్ రవాణా బైటపడిన వ్యహారం కూడా ఉంది.

ఆఫ్ఘనిస్తాన్ నుండి ఉపసంహరణ తర్వాత ఆదాయాలు క్షీణించిన రక్షణ సాంకేతిక సంస్థలు, లాభదాయకమైన కొత్త మార్కెట్‌ను కనుగొన్నాయి. షీల్డ్ ఎఐ, వన్నెవర్ ల్యాబ్స్, డజన్ల కొద్దీ ఇతర సంస్థలు ఇప్పుడు 'నార్కోఇంటర్డిక్షన్' అని అధికారులు పిలిచే ఫెడరల్ ఏజెన్సీలకు కృత్రిమ మేధస్సు వేదికలు, నిఘా వ్యవస్థలు, స్వయంప్రతిపత్తి వాహనాలను అందిస్తున్నాయి.

ఈ సాంకేతిక పెరుగుదలకు గల కారణాన్ని వివరిస్తూ 'మాదకద్రవ్యాల ముప్పు నిజమైనది, స్థిరమైనది, కేవలం మనుషులతోనే ఒంటరిగా పోరాడటం అసాధ్యం' అని సీనియర్ కోస్ట్ గార్డ్ రోబోటిక్స్ అధికారి ఆంథోనీ ఆంటోగ్నోలి అన్నారు. కానీ ఈ దాడులను అంతర్జాతీయంగా తీవ్రంగా ఖండించారు. వెనిజులా విదేశాంగ మంత్రిత్వ శాఖ వాటిని 'న్యాయవ్యవస్థ యేతర హత్యలు' , 'వలసవాద ముప్పు' అని అంటుండగా, అమెరికన్ స్టేట్స్ సంస్థ సంయమనం పాటించాలని కోరింది. గత బుధవారం వెనిజులా రాజధాని కారకాస్ ఆరు విదేశీ విమానయాన సంస్థల ల్యాండింగ్ హక్కులను రద్దు చేసింది. తమ దేశాన్ని ఏకాకిని చేయడానికి వాషింగ్టన్ చేస్తున్న ప్రయత్నాలకు అవి సహకరిస్తున్నాయని ఆరోపించింది.

దీనిని మాదకద్రవ్యాల వ్యతిరేక చర్యలుగా ట్రంప్ అధికార యంత్రాంగం ప్రచారం గావిస్తుండగా, ఆపరేషన్ పరిధి, తీవ్రతలు మాత్రం 'అధికారం మార్పు' దిశగా ఉన్నాయని నిఘా అధికారులు విధాన విశ్లేషకులు మాత్రం చెబుతున్నారు.

ఈ నెలలో అమెరికా అధికారికంగా కార్టెల్ డి లాస్ సోలెస్ (అంతర్జాతీయ డ్రగ్స్ అక్రమ నెట్‌వర్క్) నేరుగా మిస్టర్ మదురో, సీనియర్ సైనిక అధికారులచే నియంత్రించబడుతోందని వాషింగ్టన్ ఆరోపించింది. దానిని విదేశీ ఉగ్రవాద సంస్థగా పేర్కొంది. థాంక్స్ గివింగ్ సందర్భంగా మోహరించిన దళాలను ఉద్దేశించి ట్రంప్ చేసిన వ్యాఖ్యలలో వెనిజులా నేత ఎన్నికలలో రిగ్గింగ్, పద్ధతి ప్రకారం మానవ హక్కుల ఉల్లంఘనకు పాల్పడుతున్నాడనీ, వ్యక్తిగతంగా యునైటెడ్ స్టేట్స్‌లోకి మాదకద్రవ్యాల అక్రమ రవాణాను నిర్వహిస్తున్నాడని ఆరోపించారు.మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను 'మేము సముద్రం ద్వారా దాదాపు 85శాతం ఆపాము', 'ఇప్పుడు మేము వాటిని భూమి ద్వారా ఆపడం ప్రారంభించబోతున్నాము. భూమి సులభం. అది చాలా త్వరగా ప్రారంభం కానుంది అని అధ్యక్షుడు అన్నారు.

వెనిజులా అధికారులు అన్ని ఆరోపణలను తోసిపుచ్చారు. సైనిక జోక్యాన్ని సమర్థించడానికి రూపొందించిన 'కల్పిత యుద్ధం'గా అమెరికా ప్రచారాన్ని అభివర్ణించారు. కానీ, సున్నితమైన నిఘా అంచనాలపై చర్చించడానికి తమ గుర్తింపును దాచాలనే షరతుపై అనేక మంది లాటిన్ అమెరికన్ దౌత్యవేత్తలు మాట్లాడుతూ వాషింగ్టన్ మిస్టర్ మదురో ప్రభుత్వంతో ప్రత్యక్ష ఘర్షణకు పునాది వేస్తున్నదని తాము విశ్వసిస్తున్నట్లు చెప్పారు.

'ఇది 2003 పూర్వపు ఇరాక్ కాలం నాటి ఇబ్బందులను గుర్తుకు తెస్తోంది' అని ఒక సీనియర్ దక్షిణ అమెరికన్ అధికారి అన్నారు. 'ముప్పు ఆసన్నమైంది, ఆస్తుల పెరుగుదల, స్వతంత్రంగా ధృవీకరించలేని నిఘా వినియోగం వంటి వృత్తాంతాల స్క్రిప్ట్ సుపరిచితం.' అని ఆయన పేర్కొన్నారు,

ఇరాక్‌పై చర్యలకు సమాంతరంగా కార్యకలాపాలు ఉన్నప్పుడు, అంతర్లీనంగా ఉన్న వ్యూహాత్మక బహుమతి కూడా అంతే స్పష్టం. ప్రపంచంలోనే అతిపెద్ద చమురు నిల్వల పైన వెనిజులా కూర్చొని ఉందని నిరూపితమైంది. అక్కడ 300 బిలియన్ బ్యారెల్లకు పైగా చమురు, దానిలో ఎక్కువభాగం భారీ ముడి చమురు ఉన్నప్పటికీ, దశాబ్దాల కాలంగా సరిపడ పెట్టుబడి పెట్టకపోవడం, అంతర్జాతీయ ఆంక్షల కారణంగా ఎక్కువగా వినయోగించబడలేదు.

ప్రపంచంలోనే అతిపెద్ద చమురు, సహజవాయువు ఉత్పత్తిదారుగా అమెరికా ఉన్నప్పటికీ, వెనిజులా నిల్వలను భౌగోళికంగా రాజకీయంగా కీలకమైనవిగా ఆ దేశం చాలా కాలంగా భావిస్తోంది. ప్రత్యేకించి కారకాస్‌తో చైనా,రష్యా ఆర్థిక, సైనిక బంధాలను మరింత గాఢతరం చేసుకోవడం ఇందుకు కారణం. ఇంధన విశ్లేషకులు, మాజీ పెంటగాన్ అధికారులు చమురు కోణాన్ని సైనిక ప్రచారం నుండి వేరు చేయలేమని అంటున్నారు. ఏ పరిపాలన అధికారి బహిరంగంగా దీనిని అంగీకరించేందుకు సిద్ధంగా లేరు. 'మాదకద్రవ్యాల గురించి అనే ఆలోచన కచ్చితంగా పరిశీలనకు నిలబడదు' అని పేరు వెల్లడించడానికి ఇష్టపడని అట్లాంటిక్ కౌన్సిల్‌లోని సీనియర్ ఇంధన ఆర్థికవేత్త అన్నారు. 'అమెరికా పెరట్లోనే భూగ్రహంలోనే అతిపెద్ద చమురు నిల్వలు ఉన్నప్పటికీ భౌగోళిక రాజకీయ పరపతిని పొందడం వ్యూహాత్మకంగా అమూల్యమైనది' అని ఆయన పేర్కొన్నారు.

ఇరాక్‌పై దండయాత్ర జరిపేందుకు సద్దాం హుస్సేన్ వద్ద సామూహిక విధ్వంసక ఆయుధాలు ఉన్నాయనే వాదనలపై బుష్ అధికార యంత్రాంగం ఆధారపడింది. నిఘా వర్గాలు ఆ వాదనలను తప్పుగా నిరూపించాయి. ఐక్యరాజ్యసమితి తనిఖీదారులు దాడికి ముందు క్రియాశీల ఆయుధ కార్యక్రమాలకు సంబంధించి ఎటువంటి ఆధారాలు కనుగొనలేదు. అయినప్పటికీ యుద్ధం కొనసాగింది. చివరికి ఇరాకీ చమురు క్షేత్రాలను పాశ్చాత్య కంపెనీల కోసం తెరిచింది. ఇస్లామిక్ రాజ్యంలోకి విస్తరించిన హింసాత్మక ఉగ్రవాదాన్ని పుట్టించింది.

అప్రచురిత ట్రంప్ జాతీయ రక్షణ వ్యూహం అర్ధగోళ భద్రతకు అసాధారణ శ్రద్ధ వహించడంతో పాటు పోటీలో ఉన్న చైనాను 'వెనుక సీటు'కు పరిమితం చేయడంగా ఒక అధికారి పేర్కొన్నారు. వెనిజులా రాజకీయ దృశ్యాన్ని పునర్నిర్మించడం ద్వారా ప్రపంచ చమురు మార్కెట్లను, ఒపెక్ ప్రభావాన్ని ప్రాథమికంగా మారుస్తుందని అనేకమంది ప్రస్తుత, మాజీ రక్షణ శాఖ అధికారులు భావిస్తున్నారు. 'వెనిజులా రాజకీయ దృశ్యాన్ని వాషింగ్టన్ పునర్నిర్మించగలిగితే, అది ఒక తరానికి సంబంధించి ప్రపంచ చమురు ప్రభావం సమతుల్యతను మారుస్తుంది' అని మాజీ సీనియర్ రక్షణ శాఖ వ్యూహకర్త అన్నారు. 'అదే నిశ్శబ్ద గణితం.'

అమెరికా తన అత్యంత తీవ్రమైన వ్యూహాత్మక తప్పిదాలలో ఒకదాన్ని పునరావృతం చేయబోతోందా అనేది ఇప్పుడు ప్రాంతీయ నిపుణులను, కాంగ్రెస్ సభ్యులను చుట్టుముడుతున్న ప్రశ్న. అతిగా పేర్కొన్న ముప్పు సాకుతో సైనిక జోక్యాన్ని సమర్థించడం, అదే సమయంలో అసలు సమస్యను పరిష్కరించకుండా సంక్లిష్టం చేసే ఊహించని పరిణామాలను సృష్టిస్తుందని వారు భావిస్తున్నారు. ఇరాక్ యుద్ధం లక్షలాది మందిని చంపింది. ట్రిలియన్ల డాలర్లు ఖర్చు చేసింది. ఐసిస్ ఎదుగుదలకు దారితీసిన అధికార శూన్యతను సృష్టించింది. ఆ సమూహం క్రూరత్వం, పరిధి చివరికి అమెరికాను స్థిరీకరించడాని కి ప్రయత్నించిన అదే ప్రాంతంలోకి తిరిగి నెట్టివేసింది. సైనిక చర్యలను మరో దశాబ్దం పాటు పొడిగించింది.

వెనిజులా స్వతహాగానే జ్వలించే అస్థిరతను కలిగిఉంది. ఇటీవలి సంవత్సరాలలో ఏడు మిలియన్లకు పైగా ప్రజలు పారిపోవడంతో దేశం ఆర్థిక పతనంతో నాశనమైంది. మిస్టర్ మదురోకు చెందిన భద్రతా దళాలు క్రమబద్ధమైన అణచివేతకు పాల్పడుతున్నాయని ఆరోపణలు ఉన్నాయి. కొలంబియన్ గెరిల్లాలు, స్థానిక మిలీషియాలతో సహా సాయుధ సమూహాలు సరిహద్దు ప్రాంతాలలో వివిధ స్థాయిలలో క్రూరమైన అణచివేతకు పాల్పడుతున్నాయి. అస్థిరీకరణ పొందిన వెనిజులా ప్రస్తుత సంక్షోభాన్ని మించి మానవతా విపత్తును ప్రేరేపించగలదని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. అదే సమయంలో తీవ్రవాద సమూహాలు, బహుళజాతి నేర సంస్థలు, శత్రు దేశాల శక్తులకు తమ ప్రభావాన్ని విస్తరించడానికి అవకాశాలు సృష్టిస్తుంది.పారదర్శకమైన చట్టపరమైన సమర్థన లేకుండా నిరంతరం జరుగుతున్న సముద్ర దాడులు 'అంతర్జాతీయ చట్టం తీవ్రమైన ఉల్లంఘనలు' గా పరిగణించబడతాయని ఐక్యరాజ్యసమితి హెచ్చరించింది. వాషింగ్టన్, కారకాస్‌లతో సంక్లిష్టమైన సంబంధాలు కలిగిన బ్రెజిల్, కొలంబియా, మెక్సికో దేశాలు దౌత్యపరమైన పరిష్కారాల కోసం పిలుపునిచ్చాయి. అయినప్పటికీ మిస్టర్ ట్రంప్ చలించనట్లు కనిపిస్తున్నారు. ఇటీవల కాలంలో తీరప్రాంతాలకు సమీపంలో వెనిజులా తమ వైమానిక రక్షణ వ్యవస్థలను తిరిగి ఏర్పాటు చేయడం ప్రారంభించింది. అమెరికా డ్రోన్లు సార్వభౌమ గగనతలాన్ని ఉల్లంఘిస్తున్నాయని ప్రభుత్వ మీడియా పేర్కొంది. వెనిజులా గడ్డపై దాడులను వైట్ హౌస్ తోసిపుచ్చలేదు.భూతల కార్యకలాపాలు ప్రారంభమైతే, అమెరికా మరోసారి యుద్ధాన్ని ప్రారంభించవచ్చు. దీన్ని మాదకద్రవ్యాల అక్రమ రవాణా ను ముగించడం అనే ముసుగులో భౌగోళిక రాజకీయ ఆశయాలు, ఆర్థిక ప్రయోజనాలు, దేశీయ రాజకీయ లెక్కలు సరిచేసుకునేందుకు మరింత క్లిష్టమైన విషయాలను దాచిపెట్టబడుతుంది. ఇరాక్‌లో మాదిరిగానే ఘర్షణ పర్యవసనాలు చమురు క్షేత్రాలను దాటి చాలా వరకు విస్తరించవచ్చు. *(ఐపిఎ సర్వీస్)*

# ఎన్నికలు ప్రజాస్వామ్యానికి కీలకం

భారతీయ ప్రజాస్వామ్యంలో అత్యంత బలమైన పునాది గ్రామం. గ్రామం బలపడితేనే దేశం బలపడుతుంది. ఈ గ్రామ పాలనలో అత్యంత ప్రధానమైనవి గ్రామపంచాయతీ ఎన్నికలు. శాసనసభ, పార్లమెంటు ఎన్నికల కంటే సాధారణంగా చిన్నవి అనుకున్నా, నిజంగా చూసుకుంటే మన దైనందిన జీవితంపై ప్రతిరోజూ ప్రభావం చూపేది గ్రామస్థాయి పరిపాలనే. నీరు, రహదారులు, వీధి దీపాలు, చెత్త నిర్వహణ, పాఠశాల పరిస్థితే కాకుండా, సంక్షేమ పథకాలు, అభివృద్ధి ప్రణాళికలు ఇవన్నీ నిర్ణయించే బాధ్యత గ్రామపంచాయతీలోని సర్పంచ్‌దే. అందుకే ఈ ఎన్నికల్లో ఓటు వేయడం హక్కు మాత్రమే కాదు, భవిష్యత్తును నిర్మించే బాధ్యత కూడా. ఈ నేపథ్యంలో ప్రతి ఓటరు ఏ విషయాలు ఆలోచించి ఓటువేయాలి? సర్పంచ్ అభ్యర్థిని ఎంపికచేసే ముందు ఎలాంటి అంశాలను పరిశీలించాలి?అనే అంశంపై లోతైన చర్చ చేసుకోవాలి.

ఎన్నికల ముందు అభ్యర్థులు హామీల వరద పారిస్తారు. అప్పుడు ఓటరు మాయమాటలకు లోనుకాకుం డా ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి, 'ఇప్పటి వరకు అభ్యర్థి ఏంచేశారు?' అనే ప్రశ్నే అత్యంత ప్రధానమైనది. గతంలో పదవిలో ఉన్న అభ్యర్థి అయితే అతని పనులు పరిశీలించాలి. కొత్త అభ్యర్థి అయితే గ్రామంకోసం చేసిన సామాజిక సేవలు చూసుకోవాలి. వాగ్దానాల జాబితా పొడవుండొచ్చు, కానీ హామీలను సాధించే, నెరవేర్చే కృతనిశ్చయం అభ్యర్థి కలిగివుండాలి. అభివృద్ధి అనేది కాగితంపై గీసిన ప్రణాళిక కాదు, అది రహదారుల రూపంలో, పరిశుభ్రమైన వీధుల రూపంలో, పారదర్శక పాలన రూపంలో కనిపించాలి.

సర్పంచ్ ఒక పదవి మాత్రమే కాదు, గ్రామానికి చెవి, కళ్లు, హృదయం. కాబట్టి అభ్యర్థి వ్యక్తిత్వం అత్యంత కీలకం. నిజాయితీ ఉన్నవాడా? ప్రజల మాట వినగలడా? వివాదాలను శాంతితో పరిష్కరించగలడా? అహింసను నమ్ముతాడా? అని ఆలోచించాలి. గ్రామ రాజకీయాలు ఎక్కువగా వ్యక్తిగత విభేదాలపై తిరుగుతాయి. అలాంటి సమయంలో నాయకుడు కోపానికి లోనుకాకుండా, ప్రజల మధ్య సమైక్యతను పెంచేవాడై ఉండాలి. చాలా గ్రామాల్లో 'మా ఇంటివాళ్లే రావాలి', 'అది మా వర్గం', 'మా గోత్రం' అనే భావాలతో ఓటు వేయడం సంప్రదాయం అయిపోయింది. కానీ గ్రామ అభివృద్ధికి ఈ భావజాలం అడ్డంకి. సర్పంచ్ అభ్యర్థిని ఎంచుకోవడంలో చూడవలసింది, అభ్యర్థి సామర్థ్యం, జ్ఞానం, దూరదృష్టి మాత్రమే. ప్రజలు కుటుంబ సంబంధాల్ని పక్కనబెట్టి సమర్థ వంతుడైన అభ్యర్థినిఎన్నుకుంటేనే గ్రామ పరిపాలనలో నూతన మార్పులు వస్తా యి. సర్పంచ్‌కు ఉన్నత విద్య తప్పనిసరి కాకపోయి నా, పనుల నిర్వహణ, ప్రణాళికలు రూపొందించడం, డేటా అర్థం చేసుకోవడం, ప్రభుత్వ పథకాలపై అవగాహన ఇవన్నీ అతనికి తప్పనిసరైన నైపుణ్యాలు. అభ్యర్థి వద్ద ఇవి ఉన్నాయా? ప్రభుత్వ పథకాల వినియోగం ఎలా చేయాలో తెలుసా? బడ్జెట్‌పై అవగాహన ఉందా? టెండర్లు, నిర్మాణ పనులు, పారదర్శక ఖర్చులపై అవగాహన ఉందా? విద్య ఉన్నవారు మాత్రమే మంచి నాయకులు అవుతారు అనేది నిజం కాకపోయినా, తెలివితేటలు, నేర్చుకోవాలన్న మనస్తత్వం మాత్రం ఉండాలి. ప్రతి గ్రామానికీ సమస్యలు ఉంటాయి. ఎక్కడ నీటి కష్టమో, ఎక్కడ రహదారి సమస్యో, ఎక్కడ చెత్త నిర్వహణలో లోపమో, ఎక్కడ విద్యుత్ వైఫల్యమో అనేవి అభ్యర్థి తెలుసుకోవడమే కాకుండా, ప్రతి సమస్యకు క్రియాత్మక పరిష్కార ప్రణాళికలు ఉన్నవాడై ఉండాలి. కేవలం తీర్చేస్తాం, చేస్తాం అంటూ సభలలో చెప్పడం సరిపోదు. ఎలా చేస్తాడు? ఏ నిధులతో చేస్తా డు? ఏ సమయంలో పూర్తి చేస్తాడు? అనే ప్రశ్నలకు సమాధానం చెప్పగల అభ్యర్థినే ప్రజలు ఎన్నుకోవాలి.

గ్రామాల్లో చాలా సంవత్సరాలుగా ఒకే నాయకత్వం కొనసాగుతుంటుంది. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా యువత, మహిళలకు అవకాశమివ్వడం గ్రామ అభివృద్ధికి కొత్త దిశను ఇస్తుంది. యువతలో ఉన్న శక్తి, సాంకేతిక జ్ఞానం గ్రామానికి అవసరం. అందువల్ల అభ్యర్థులలో కొత్త ఆలోచనలకు ప్రాధాన్యం ఇవ్వాలి. ఎన్నికల సమయంలో చాలా చోట్ల డబ్బు, బహుమతులు, విందులు ఇవ్వడం సాధారణం. అవి తీసుకుని ఓటు వేయడం మన వ్యక్తిగత ప్రయోజనం అనిపించినా, గ్రామ భవిష్యత్తుకు అది పెద్ద నష్టం. డబ్బు ఇచ్చే నాయకుడు పదవిలోకి వెళ్లాక మరింత డబ్బు సంపాదించడానికే ప్రయత్నిస్తాడు. అందువల్ల ఓటర్లు 'ఈరోజు ప్రయోజనం' కన్నా 5 సంవత్సరాల అభివృద్ధి గురించి ఆలోచించాలి. గ్రామాభివృద్ధి అనేది మాంత్రికం కాదు, అది సమష్టి కృషి. కానీ ఆ కృషికి దిశనిచ్చేది, గ్రామాన్ని ముందుకు నడిపేది సర్పంచ్ మాత్రమే. మంచి నాయకుడు ఉంటే గ్రామం అద్భుత మార్పులు చూడగలదు. చెడు నాయకుడు ఉంటే గ్రామం సంవత్సరాల పాటు వెనుకబడిపోవచ్చు. అందుకే ఓటు వేయడానికి ముందు ఓటరు నిశితంగా ఆలోచించాలి. ఓటు వేసి కర్తవ్యాన్ని ముగించేశామని భావించడం తప్పు. ప్రజలు తమ సర్పంచ్‌ను పనులపై ప్రశ్నించాలి. గ్రామసభలకు హాజరుకావాలి బడ్జెట్ వివరాలు అడగాలి. నిర్ణయాలలో పాల్గొనాలి ఇలా ప్రజలు చురుకైన పాత్ర పోషిస్తేనే నిజమైన ప్రజాస్వామ్యం పరిపుష్టం అవుతుంది. గ్రామపంచాయతీ ఎన్నికల్లో ఓటు వేయడం అంటే కేవలం ఓటు చెల్లించడం కాదు; మన గ్రామ భవిష్యత్తుకు ఓ నిర్ణయం తీసుకోవడం. మన పిల్లల రేపటి పరిస్థితులు, మన జీవన ప్రమాణాలు, మన ఓటుతోనే నిర్ణయించబడతాయి.అభ్యర్థి పనులు చూసి నిర్ణయించి, సామర్థ్యాన్ని పరిశీలించి మాత్రమే సర్పంచ్ అభ్యర్థిని ఎన్నుకోవాలి. గ్రామం అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుంది, రాష్ట్రం అభివృద్ధి చెందితేనే దేశం బలపడుతుంది. ఆ బలం మన చేతుల్లో ఉన్న ఓటుతో ప్రారంభమవుతుంది.

**తుమ్మ కమలహాసన్,** 9505618252

# దళిత హక్కుల కోసం పోరాడిన ధన్యజీవి డాక్టర్ బిఆర్ అంబేద్కర్


**మన్నవ హరిప్రసాద్**
8247728296

డిసెంబరు 6వ తేదీకి ఒక ప్రత్యేకత ఉంది. ఒకటి భారత రాజ్యాంగ డ్రాఫ్టింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ బి ఆర్ అంబేద్క ర్ వర్ధంతి కాగా, రెండవది, ఆర్‌ఎస్‌ఎస్ కరసేవకులు అయోధ్యలో బాబ్రీ మసీదును పడగొట్టిన రోజు (1992). ఆర్‌ఎస్‌ఎస్ ప్రపంచంలోనే సుదీర్ఘ చరిత్ర గలిగినటువంటి ఫాసిస్టు సంస్థ. భారతదేశాన్ని హిందూదేశంగా చేయాలనేది దాని లక్ష్యం. కాషాయ కార్పొరేట్ పెట్టుబడిదారి భావజాలం దాని సిద్ధాంతం. 1956వ సంవత్సరం డిసెంబర్ 6వ తేదీన భౌతికంగా మనల్ని విడిచి వెళ్లారు. ఆయన మరణాంతరం 1990 సంవత్సరంలో భారత ప్రభుత్వం ఆయనకు భారతరత్న అవార్డు ఇచ్చింది. జాతీయోద్యమ కాలంలో అంబేద్కర్ షెడ్యూల్ కులాల తెగల అంటరానితనానికి వ్యతిరేకం గా పోరాడాడు. లాహోర్‌లోని కుల నిర్మూలన హిందూ సంస్థ జాక్పాత్ తోడక్ మండల్ 1935లో ఆయనను కుల వ్యవస్థ పై ఉపన్యసించడానికి ఆహ్వానించారు. ఆ సమావేశంలో మాట్లాడటానికి ఆయన ఒక ఉపన్యాసం తయారు చేశాడు. ఆ తరువాత వారు ఆయనను సభకు రావద్ద ని తెలియజేశారు. ఆ తరువాత అదే 'కుల నిర్మూలన' రచనగా ప్రచురించారు. 1934లో కమ్యూనిస్టు పార్టీ కుల వ్యవస్థపైన డ్రాఫ్ట్ ప్రోగ్రామ్ ను రచించింది. తీర్మానించింది. కుల వ్యవస్థ నిర్మూలన జరగకుండా భారతదేశంలో ప్రజాస్వామ్యం వర్ధిల్లాలని తీర్మానం చేయబడినది. 1927లో రామచంద్ర మోరే అనే కమ్యూనిస్టు నాయకుడు స్వగ్రామం మహాద్, ఆ గ్రామం మహాదా తహసిల్‌లో ఉన్నది. మహాద్ చెరువులో దళితులను మంచినీరు ముంచుకోవడానికి వీలులేదని అగ్ర వర్ణాలవారు నిషేధించారు. దీనికి వ్యతిరేకంగా రామచంద్ర మోరె ఆహ్వానంపై డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మహత్ సత్యాగ్రహానికి నాయకత్వం వహించా డు.

మహాద్‌లో దళిత జాతుల మహాసభ జరిగింది. మహారాష్ట్ర, గుజరాత్‌ల నుండి కొన్ని వేలమంది వచ్చా రు. మహాద్ చెరువులోని నీటిని త్రాగుటకు వీలు లేకపోయినా, అంటరానివారికి ఆ చెరువులో ప్రవేశం లేకుండినది. అంబేద్కర్ నాయకత్వంలో వేలాదిమంది చెరువు నీరు స్వీకరించారు. ఈ సంఘటన మహారాష్ట్రంలో సంచలనం కలిగించింది. 1927 డిసెంబర్ 25వ తేదీన భారతదేశానికి కుల ధర్మాన్ని బోధించే మనుస్మృతిని బహిరంగంగా దానం చేశారు.

1927లో అంబేద్కర్ 'బహిష్కృత భారతి' అనే మరాఠి పక్ష పత్రిక ప్రారంభించాడు. ఆ పత్రికలో ఒక వ్యాసం వ్రాస్తూ అంబేద్కర్ ఇలా అన్నాడు: తిలక్ గనుక అంటరానివాడుగా పుట్టివుంటే 'స్వరాజ్యం నా జన్మ హక్కు' అని ఉండడు. 'అస్పృశ్యత నివారణే నా ధ్యేయం, నా జన్మ హక్కు' అని ప్రకటించి ఉండేవాడని వ్రాశాడు. అంటే ఆనాడు అంబేద్కర్ కులతత్వవాదులు పెట్టిన బాధలను ఎంతగా అనుభవించాడో తెలుస్తుంది. 1927లో ఛత్రపతి శివాజీ త్రిశతి జయంతి ఉత్సవాలు మహారాష్ట్ర అంతటా



గొప్పగా జరిగాయి. అంబేద్కర్‌ను సాదరంగా ఆహ్వానించాడు కొలాబాలోని ఉత్సవ సంఘాధ్యక్షుడైన బ్రాహ్మణుడైన బాలాయ శాస్త్రి. ఆ ఉత్సవాలలో ప్రసంగిస్తూ అంబేద్కర్ పీష్వాల సామ్రాజ్య పతనానికి ముఖ్యకారణం అస్పృశ్యతను పాటించడమే అన్నాడు. 1919 మాంటేగ్ చేమ్స్ ఫర్డ్ సంస్కరణలు భారతదేశంలో ఎలా పనిచేస్తున్నాయో అధ్యయనం చేయ దానికి, నూతన రాజ్యంగ సంస్కరణల కోసం సూచించేందుకు ఏర్పాటు చేసిన సైమన్ కమిషన్ భారతదేశాన్ని 1928లో పర్యటించింది. ఆ పర్యటన అనంతరం ఆ కమిటీ బ్రిటిష్ ప్రభుత్వానికి అందించిన నివేదికను చర్చించడానికి బ్రిటిష్ ప్రభుత్వం మూడు రౌండ్ టేండ్ సమావేశాలను ఏర్పరచింది.1930, 1931 రౌండ్ టేబుల్ సమావేశాలకు హిందూ మహాసభ నాయకుడు డాక్టర్ బిఎస్ ముంజే కూడా హాజరయ్యాడు. ఈ సమావేశాలు 1930, 1931,1932 లలో జరిగాయి. ఈ మూడు సమావేశాలకు అంబేద్కర్ హాజరు కాగా రెండవ సమావేశంలో భారత జాతీయ కాంగ్రెస్ తరపున గాంధీ హాజరు అయ్యారు. ఈ సమావేశంలోనే గాంధీకి అంబేద్కర్‌కు మధ్య భేదాభిప్రాయాలు ఏర్పడ్డాయి. అంబేద్కర్ దళితులకు ప్రత్యేక నియోజకవర్గాలు ఇవ్వాలని పట్టుబట్టగా, అలా ఇస్తే హిందూ సమాజం విచ్ఛిన్నమవుతుందని అందుకు గాంధి ఒప్పుకోలేదు. ఏకాభిప్రాయం కుదరకపోవడంతో రెండవ రౌండ్ టేబుల్ సమావేశం నుండి గాంధీ బయటకు వచ్చేసాడు. 1932లో రామ్సే మెక్ డోనాల్ 'కమ్యూనల్ అవార్డు'ను ప్రకటించడం జరిగింది. దీని ప్రకారం దళితులకు ప్రత్యేక నియోజక వర్గాలు ప్రతిపాదించడం జరిగింది. ఈ ప్రకటన వెలువడే నాటికి గాంధీ శాసనోల్లంఘన ఉద్యమంలో భాగంగా అరెస్ట్ అయి ఎరవాడ జైలులో ఉన్నాడు. ఈ ప్రక టన గురించి తెలుసుకొని గాంధీ నిరాహారదీక్ష చేపట్టాడు. అంబేద్కర్‌పై నైతిక ఒత్తిడి పెరిగింది. చివరికి గాంధీకి అంబేద్కర్‌కు మధ్య పూనా ఒప్పందం కుదిరి కమ్యూనల్ అవార్డ్ కన్నా ఎక్కువ స్థానాలు ఉమ్మడి నియోజకవర్గాలలో ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. దీని తర్వాత గాంధి 'హరిజన్ సేవక్ సమాజ్' ఏర్పరచి అస్పృస్యత నివారణకు కృషి చేసాడు. అంబేద్కర్‌ను కూడా ఇందులో భాగస్వామిని చేసాడు గాంధీ. కాని అంటరానితనం నిర్మూలనలో గాంధీకి ఉన్న చిత్తశుద్ధి మిగతా కాంగ్రెస్ నాయకులకు లేదు అని అంబేద్కర్ అన్నాడు. దీనితో అంబేద్కర్ గాంధీ ఉద్యమం నుండి బయటకు వచ్చి ప్రత్యేకంగా దళిత సమస్యల పరిష్కారానికి ఆలిండియా డిప్రె సస్డ్ క్లాస్ కాంగ్రెస్, ఆలిండియా షెడ్యూల్ కాస్ట్ ఫెడరేషన్ వంటి అనేక రాజకీయ పార్టీలను ఏర్పాటు చేసి దేశవ్యాప్తంగా దళితులను సమీకరించే ప్రయత్నం చేసాడు. ఈ సందర్భంలో క్విట్ ఇండియా ఉద్యమం, ఆ తరువాత దేశ విభజనతో కూడిన స్వాతంత్ర్యం రావడం జరిగాయి. 1956 సంవత్సరంలో ఆయన చనిపోవటానికి కొద్ది నెలల ముందు హిందూమతాన్ని త్యజించి వేలాదిమంది అనుచరులతో నాగపూర్‌లో బౌద్ధ మతాన్ని స్వీకరించాడు.

ఆధునిక భారత రాజ్యాంగ శిల్పిగా, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 1949 నవంబరు 26వ తేదీన రాజ్యాంగ సభకు సమర్పించాడు. ఆ సందర్భంగా మాట్లాడుతూ 'రాజ్యాంగం ఎంత మంచిదైనా, అది అమలు చేయాల్సిన వారు చెడ్డవారైతే అది చెరుపు చేస్తుంది. అదేవిధంగా ఒక రాజ్యాంగం ఎంత చెడ్డదైనా దాన్ని అమ లు చేసేవారు మంచివారైతే రాజ్యాంగం మంచే చేస్తుంది. రాజ్యాంగ ప్రవృత్తిపై పూర్తిగా రాజ్యాంగ ఆచరణ ఆధారపడి ఉండదు' అన్నారు. బ్రిటిష్ ఇండియా కాలంలో మంత్రిగా, ఆ తరువాత నెహ్రూ మంత్రివర్గంలో న్యాయశాఖ కేంద్రమంత్రిగా పనిచేశారు. దళితుల హక్కుల కొరకు పోరాడిన సంస్కరణ వాది అంబేద్కర్ ధన్యజీవి.

**(డిసెంబర్ 6వ తేదీ అంబేద్కర్ వర్ధంతి సందర్భంగా)**

## శ్రీ సత్యేశ్వర సేవ ఆశ్రమం మరో మైలు రాయి

**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల శ్రీ సత్యేశ్వర సేవ ఆశ్రమం వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనాథ మానసిక దివ్యాంగుల ఆశ్రమంలో బుధవారం మరొక మైలురాయిని చేరింది. గత నెల క్రితం మహబూబ్ నగర్ పట్టణం లో మతి స్మితం కోల్పోయి నగ్నంగా రోడ్డున తిరుగుతున్న కుమారి అనే యువతిని సఖి ద్వారా ఆశ్రమానికి చేర్చారు. అలా వచ్చిన కుమారి అనే యువతి ఇప్పుడు కోలుకొని వారి స్వగ్రామం భూత్పూర్ అని తెలుపగా వారిని వారి కుటుంబ సభ్యులకు శుక్రవారం అప్పచెప్పడం జరిగింది. మతి స్థిమితం కోల్పోయి మహబూబ్ నగర్ వద్ద రోడ్డుపై తిరుగుతూ ఎంతో దయ నీయమైన స్థితిలో ఉన్న ఆమెను ఆశ్రమ నిర్వాహకులు చిత్తనూరి ఈశ్వర్ ఆశ్రమానికి చేర్చి, ఆమెకు చికిత్స అందించి నేడు వారి కుటుంబ సభ్యులకు అప్పజెప్పడం జరిగింది. గత 7 సంవత్సరాల నుండి నిర్వహిస్తున్న ఈ కార్య క్రమంలో శ్రీ సత్యేశ్వర సేవ ఆశ్రమం వారు ఇప్పటి వరకు ఆశ్రమానికి చేరు కున్న 122 మందిని వారి కుటుంబ సభ్యులకు అప్పజెప్పడం జరిగింది.

## క్రిటికల్ పోలింగ్ స్టేషన్‌ను సందర్శించిన ఎన్నికల పరిశీలకురాలు



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ రూరల్ మండలం కోడూరు గ్రామం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రిటికల్ పోలింగ్ స్టేషన్ ను గ్రామ పంచా యితీ ఎన్నికల సాధారణ పరిశీలకురాలు కాత్యాయని దేవి ఐఏఎస్ శుక్రవారం సంద ర్శించారు. గ్రామపంచాయితీ సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలకు జరుగుతున్న మొదటి విడత ఎన్నికల్లో పోలింగ్ సజావుగా, ప్రశాంతంగా నిర్వహించేలా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

## రేషన్ బియ్యం పట్టివేత



**ప్రజాపక్షం/అచ్చంపేట :** పట్టణంలో పిడిఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచి అమ్మకానికి సిద్ధంగా ఉన్న బియ్యాన్ని సివిల్ సప్లై అధికారులు పట్టు కొని కేసు నమోదు చేశారు. అధికారుల సమాచారం మేరకు శుక్రవారం ఉదయం పట్టణంలోని పాతబస్టాండు సమీపంలో ఒక ఏరియాలో అక్ర మంగా భద్రపర్చిన పిడిఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు వారు తెలిపారు. ఈ బియ్యం ఏడు బస్తాలలో 3క్వింటాళ్లు ఉంటుందన్నారు. ఈబియ్యంపై విచా రించగా పట్టణానికి చెందిన కొత్త రాఘవేందర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. స్థానిక ఎస్ఐ సద్దాంహుస్సేన్, సివిల్‌సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటి హేమ్లానాయక్ ఈ బియ్యాన్ని పట్టుకున్నట్లు తెలిపారు.

## ఎస్‌పి చెక్‌పోస్టు తనిఖీ



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్ :** గ్రామపంచాయితీ ఎన్నికల భద్రత ఏర్పాట్ల లోభాగంగా శుక్రవారం మన్ననూర్ చెక్‌పోస్టును జిల్లా ఎస్‌పి సంగ్రామ్ సింగ్ పాటిల్ తనిఖీచేశారు. ఈసందర్భంగా గ్రామపంచాయితీ ఎన్నికల నేపథ్యంలో భద్రత ఏర్పాట్లను పటిష్టంచేయాలన్నారు. చెక్‌పోస్టులో వాహ నాల తనిఖీలకు సంబంధించిన రిజిస్టర్‌లను పరిశీలించారు. ఎన్నికల సమ యంలో అక్రమడబ్బు, మద్యం రవాణా అవకాశాలపై అధికారులు అప్రమ త్తంగా ఉండాలని పలు సూచనలు చేశారు. ప్రతి వాహనం, ప్రతి వ్యక్తిని పూర్తిగా తనిఖీ చేసిన తర్వాతనే వదిలివేయాలన్నారు. అనుమానస్పద వ్యక్తులు, వాహనాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలన్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఏవస్తువుల రవాణా జరగకుండా కట్టుదిట్టంగా తనిఖీలు కొన సాగించాలని సిబ్బందిని ఆదేశించారు.

## టిప్పర్ బోల్తా... డ్రైవర్‌కు గాయాలు

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** ఇసుక టిప్పర్ బోల్తాపడిన సంఘటన శుక్రవారం కల్వకుర్తి మండలంలో జరిగింది. వివరాల్లోకి వెళితే... నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం దాసర్లపల్లి గ్రామ సమీపంలోగల దుందుభివాగు నుండి టిప్పర్ ద్వారా కల్వకుర్తికి ఇసుక తరలిస్తున్నారు. మార్గమధ్యలో లింగసానిపల్లి గ్రామసమీపంలో గొర్రెలు ఎదురు రావడంతో వాటిని తప్పిం చేక్రమంలో టిప్పర్ అదుపుతప్పి బోల్తాపడింది. ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలైనట్లు తెలిసింది. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు.

## ఇసుక తరలిస్తున్న ఇద్దరిపై కేసు



**ప్రజాపక్షం/నారాయణపేట:** నారాయణపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరి ధిలో అర్ధరాత్రి రెండు ట్రాక్టర్లలో ఇసుకను తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. వివరాల్లోకి వెళ్తే .. కొల్లంపల్లి గ్రామానికి చెందిన కుక్కలి అశోక్, కొత్తమొగులప్పలు అనుమతి లేకుండా పాత తాండ నుండి కొల్లం పల్లికి అక్రమంగా ఇసుక తరలిస్తుండగా, పిడుగుండు తాండ దగ్గర పట్టు కుని ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించి ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేయడం జరిగిందని నారాయణపేట రూరల్ ఎస్సై రాముడు తెలిపారు.

**టిప్పర్ పట్టివేత**



**ప్రజాపక్షం/కృష్ణ:** కృష్ణ మండలం టై రోడ్డులో ఉదయం 2 గంటల సమయంలో కృష్ణ ఎస్సై, సిబ్బంది దగ్గర వెహికల్ చెకింగ్ చేస్తుండగా ఒక టిప్పర్ కెఎ 33బి7862 అనుమానాస్పదంగా తిరుగు తుండగా ఆపి తనిఖీ చేయగా ఆ టిప్పర్ నిండా ఇసుక ఉంది. అనుమతులు లేకుండా మాన్వి నుండి సైదాపుర తరలి స్తున్నఆ టిప్పర్‌ను స్టేషన్‌కు తరలించి, డ్రైవర్ బుగ్గప్ప, తండ్రి యాదగిరి మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు కృష్ణ ఎస్ఐ నవీద్ తెలిపారు. కృష్ణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎవరైనా పర్మిషన్ లేకుండా అక్రమ చర్యలకు పాల్పడితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై తెలిపారు.

## ఘంటసాల స్వాతంత్ర్య సమరయోధులు

**ప్రజాపక్షం/వనపర్తి టౌన్:** వనపర్తి జిల్లా కేంద్రంలోని సిఐటియు కార్యా లయ భవనంలో గురువారం సిటిజన్ న్యూస్ సీఈఓ డి.రవిప్రసాద్ అధ్యక్ష తన, వనపర్తి కళాకారుల ఐక్యవేదిక సంయుక్త ఆధ్వర్యంలో గాన గంధ ర్వులు పద్మశ్రీ ఘంటసాల వెంకటేశ్వరరావు 103వ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వరాంజలి కార్యక్రమంలో కార్యనిర్వాహ కులు, జర్నలిస్టు డి.రవి ప్రసాద్‌ను కళాకారులు శాలువాతో సన్మానించి అభినందించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల ద్వారా సమాజాన్ని పీడిస్తున్న అసాంఘిక కార్యకలాపాలను రూపుమాపు టకు ఇలాంటి వేదికలు ఎంతైనా అవసరమని వాటిని ప్రోత్సాహించడం మన అందరి బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం వనపర్తి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జబ్బార్, గంధం నాగరాజు, గాయకులు గాయనీ మనులు రిటైర్డ్ టీచర్ సత్తార్, నందిమల్ల రాములు, ఉపాధ్యా యులు రవిప్రసాద్ గౌడ్, గంధం రాజు, వెంకట్ పిఈటి , ఉపాధ్యాయులు సుజాత, ఉపాధ్యాయులు నరేందర్, బ్రహ్మయ్య చారి, కార్యక్రమ నిర్వాహ కులు గంధం రవి, మోహన్, సంజీవరావు, సంగీత అభిమానులు తదిత రులు పాల్గొన్నారు.



# పోలింగ్ మెటీరియల్ పంపిణీకి ఏర్పాట్లు

### రాజాపూర్ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్ ఏర్పాట్లు పరిశీలించిన కలెక్టర్ విజయేందిర బోయి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్/జడ్చర్ల:** మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా శుక్రవారం రాజా పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి సందర్శించారు. జడ్.పి ఉన్నత పాఠశాలలో పోలింగ్ మెటీరియల్ పంపిణీకి ఏర్పాట్లను పరిశీలించి అధికారులతో చర్చించి కలెక్టర్ సూచనలు చేశారు. జడ్.పి. ఉన్నత పాఠశాలలో పోలింగ్ మెటీరియల్ పంపిణీకి ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. పోలింగ్ సిబ్బంది సంఖ్య కు సరిపడా బస్సులు ఏర్పాటు చేయాలని, వారికి బోజన సదుపాయం, పార్కింగ్ ఏర్పాట్లు, చేయాలని ఎంపిడిఓకు ఆమె సూచిం చారు. మొదటి విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహణకు అవసరమైన పోలింగ్ సామాగ్రి పంపిణీ సజావుగా నిర్వహించాలని ఆదేశించారు. అనం తరం ఎంపిడిఓ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ గురించి చర్చించారు. ఎన్ని కల విధులలో ఉన్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ పంపిణీ చేసి వినియోగించుకు నేలా చూడాలని తెలిపారు. మండలంలో ఓ.పి.ఓల మరోసారి శిక్షణ నివ్వా లని అన్నారు. గ్రామాలలో ఎఫ్ఎస్‌టి బృందాలు మోడల్ కోడ్ అమలు పర్య వేక్షణ నిర్వహించాలని తహాశీల్దార్ కు సూచించారు.

**నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్**

జడ్చర్ల మండలంలోని గంగాపూర్ గ్రామపంచాయితీలో నామినేషన్ స్వీక రణ కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి శుక్రవారం సందర్శించారు. మూడో దశ గ్రామపంచాయితీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ శుక్రవారంతో ముగుస్తున్నందున నామినేషన్ ప్రక్రియను ఆమె పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ వచ్చిన నామినేషన్ పత్రాలను సరిగ్గా పరిశీలించి నమోదు చేసుకోవాలని, నిర్ణీత సమయం లోగా వచ్చిన నామినేషన్లు స్వీకరిం చాలని అన్నారు. శుక్రవారం మంచి రోజు అలాగే చివరి రోజు కావడం వలన నామినేషన్ దాఖలకు అభ్యర్థులు ఎక్కువ సంఖ్యలో రావచ్చని, రద్దీ ఏర్పడే అవకాశం ఉందని అన్నారు. టీ పోల్ యాప్‌లో డేటా అప్లోడ్‌కు ఆలస్యం కాకుండా కంప్యూటర్లను, అపరేటర్లను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నామినేషన్లు సమయానికి పూర్తి చేయాలని, ఐదు గంటల లోపు వచ్చిన అభ్య ర్థులకు వరుస క్రమంలో అఖరి నుండి టోకెన్ స్లిప్‌లు ఇవ్వాలని, సాయంత్రం 5 గంటల తర్వాత ఎట్టి పరిస్థితులలో కొత్త నామినేషన్లు స్వీకరించవద్దని, ఆదేశించారు. ఎన్నికల నామినేషన్ ప్రక్రియను పారదర్శకంగా, న్యాయంగా, ఎన్నికల సంఘం జారీ చేసిన నియమ నిబంధనలను పాటిస్తూ, ఎటువంటి పొరపాట్లు జరగకుండా నిర్వహించాలని సూచించారు.

# 106 మొబైల్ ఫోన్లు రికవరీ.. బాధితులకు అందజేత

### ఎస్పీ డా.వినీత్



**ప్రజాపక్షం/నారాయణపేట :** జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో 106 మొబైల్ ఫోన్లు రికవరీ, వాటి విలువ సుమారు 16 లక్షలు, మొబైల్ ఫోన్ పోయిన వెంటనే సిఈఐఆర్ పోర్టల్‌లో లేదా దగ్గరలోని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలి. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు గత మూడు నెలల్లో సిఈఐఆర్ పోర్టల్ ద్వారా రికవరీ చేసిన 106 మొబైల్ ఫోన్లను శుక్రవారం జిల్లా ఎస్పీ డా.వినీత్ ఎస్పీ కార్యాలయంలోని కాన్ఫ రెన్సు హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో బాధితులకు తిరిగి అందజేశారు. రికవరీ చేసి మొబైల్ ఫోన్ల మొత్తం విలువ సుమారు 16 లక్షల రూపాయలు ఉంటుందని తెలిపారు. ఎస్పీ మాట్లాడుతూ మొబైల్ ఫోన్ పోయిన వెంటనే సిఈఐఆర్ పోర్టల్‌లో గానీ, దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో గానీ వెంటనే ఫిర్యాదు చేయాలని తెలిపారు. మొబైల్ దొంగతనం చేసిన వ్యక్తులపై చట్టప్ర కారం కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. చాలా వరకు దొంగతనమైన మొబైల్ ఫోన్లు నేర కార్యకలాపాలకు దుర్వినియోగం అయ్యే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అనుమానాస్పదంగా పాత/సె కండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్లు కొనరాదని సూచించారు. దొంగతనానికి గురైన సెల్‌ఫోన్లు పట్టుకునే బాధ్యత పోలీసులది అని వాటిని తప్పనిసరిగా పట్టుకో వడం జరుగుతుందని, నేరస్తులను గుర్తించి కేసులు నమోదు చేస్తామని తెలి పారు. జిల్లాలోని ఐటికోర్ పోలీసులు ఆధునాతన టెక్నాలజీ సాయంతో మొబైల్ ఫోన్ల ట్రేస్ చేసి మొత్తం 106 ఫోన్లు రికవర్ చేయడంలో కీలక పాత్ర పోషించారు. వారి కృషిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్ర మంలో అదనపు ఎస్పీ యండి. రియాజ్, హుల్ హక్, డిఎస్పిలు ఎన్.లింగయ్య, మహేష్, సిఐలు, శివశంకర్, రాజేందర్‌రెడ్డి, రామ్‌లాల్, సైదులు, ఐటికోర్ ఎస్ఐ సురేష్, ఇతర ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, మరియు మొబైల్ స్వీకరించిన బాధితులు పాల్గొన్నారు.

## సర్పంచ్ పదవికి సిపిఐ అభ్యర్థిగా చల్మారెడ్డి నామినేషన్




**ప్రజాపక్షం/వీపనగండ్ల:** వీపనగండ్ల మండలం బొల్లారం గ్రామ సర్పంచ్ పదవికి భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) తరపున గ్రామ కార్యదర్శి చల్మారెడ్డి శుక్రవారం నామి నేషన్ దాఖలు చేశారు. నామినేషన్ వేయడా నికి వచ్చిన సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మద్దతును ప్రకటించారు. చల్మా రెడ్డి ప్రస్తుతం గ్రామ శాఖ కార్యదర్శిగా, అలాగే సిపిఐ మండల కార్యవర్గ సభ్యుడిగా పనిచేస్తూ పార్టీ విభాగాలలో చురుకైన పాత్ర పోషిస్తున్నారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం, సామాజిక న్యాయం వంటి అంశాలపై పార్టీ తర పున జరుగుతున్న ఆందోళన కార్యక్రమాల్లో ఎల్లప్పుడూ ముందుండే నాయకు డిగా ఆయన పేరుపొందారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్ల డంలో, గ్రామంలో సంక్షేమ కార్యక్రమాల అమలులో చల్మారెడ్డి నిరంతరం కృషి చేస్తూ వస్తున్నారు. నామినేషన్ అనంతరం మీడియాతో మాట్లాడిన చల్మా రెడ్డి మాట్లాడుతూ, గ్రామ ప్రజలు నాపై ఉంచిన విశ్వాసానికి అనుగుణంగా పనిచేయడం నా బాధ్యత ఈ సారి సర్పంచుగా అవకాశం కల్పిస్తే, బొల్లారం గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తాను. గ్రామ అభివృద్ధి కోసం సమగ్ర ప్రణాళికను తీసుకొచ్చి, ప్రజల భాగస్వామ్యంతో పారదర్శక పరిపాలన అంది స్తానని చల్మారెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. నామినేషన్ దాఖలు సందర్భంగా పలువురు సిపిఐ నాయకులు, స్థానిక కార్యకర్తలు ఆయనకు తమ పూర్తి మద్ద తను తెలిపారు.

# ఎన్నికల దృష్ట్యా అక్రమ మద్యం అమ్మకాలపై నిఘా



అదనపు కలెక్టర్ రెవెన్యూ మధుసూదన్ నాయక్

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** అదనపు కలెక్టర్ రెవెన్యూ మధుసూదన్ నాయక్, జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి సుధాకర్, అడిషనల్ ఎక్సైజ్ సూపర్డెంట్ నరసింహారెడ్డి, మండల స్థాయి సిఐలు ఎస్సైలతో కలిసి తన ఛాంబర్ లో మీటింగ్ జరిగింది. టి మీటింగ్లో జిల్లాలోని అన్ని బెల్ట్ షాపుల ను మూసి వేసే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఏ ఫోర్ షాపులలో ఎక్కువ మొత్తంలో ఐఎంఎల్, బీర్ అమ్మకుండా పర్యవేక్షణ చేయాలని అను మతించబడిన పరిమాణానికి మించి బల్క్ లీటర్లను విక్రయించవద్దని అన్ని ఎ4 దుకాణాలకు నోటీసులు జారీ చేయాలని ఎక్సైజ్ అధికారులకు ఆదేశిం చడం జరిగింది. అలాగే ఎన్నికల సందర్భంగా సిబ్బంది అందరూ గ్రామస్థా యిలో విస్తృతంగా పర్యటించి తగు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పడం జరి గింది. ప్రతిరోజు ఎన్ని కేసులు నమోదయినవి పూర్తి వివరాలు జిల్లా ఎన్నికల అధికారి సెల్‌కు అందించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని ఈ సమావే శంలో నిర్ణయించడం జరిగింది.

## ఘనంగా వృత్తి నిపుణుల దినోత్సవం




**ప్రజాపక్షం/జడ్చర్ల :** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలో గల సంస్కార్ పాఠశా లలో నర్సరీ, ఎల్కేజీ మరియు యూకేజీ చిన్నారులతో వృత్తి నిపుణుల దినోత్స వాన్ని ఘనంగా నిర్వహించారు. చిన్నారులు భవిష్యత్తులో కావాలనుకున్న వృత్తులకు అనుగుణంగా కలెక్టర్, పోలీస్ ఆఫీసర్, డీఈఓ, ఎంఈఓ, డాక్టర్, లాయర్, సైంటిఫ్, పైలట్, ఇంజనీర్, డెంటిస్ట్, ప్రొఫెసర్, టీచర్, గార్డెనర్, నర్స్, ఫోటోగ్రాఫర్, రైతు పారామెడికల్, సర్జన్, ఫైర్మెన్, ఆర్మీ, పైలట్, నావి ఆఫీసర్, తదితర వేషధారణలలో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శిల్ప మాట్లాడుతూ, విద్యార్థులు తమ లక్ష్యాల వైపు క్రమం తప్పకుండా కృషి చేస్తూ, క్రమశిక్షణ పాటించి, తల్లిదండ్రులు, ఉపా ధ్యాయులు మరియు పెద్దలను గౌరవిస్తూ వారి సూచనలు పాటిస్తే, భవిష్య త్తులో కోరుకున్న వృత్తిలో నిలదొక్కుకోవచ్చు అని అన్నారు. ఈ కార్యక్ర మంలో పాఠశాల యాజమాన్య, సభ్యులు యు.రాధిక, సందీప్ గడ్డం, ఎ.తేజశ్రీ, అలాగే ఉపాధ్యాయ బృందంలోని కరుణ, కె.సౌజన్య, ఎ.సంధ్య, ఎ.మౌనిక, తస్లీమ్, ఎ.శోభ, జె.అపర్ణ, తదితరులు పాల్గొన్నారు.

# పాత కొత్త కలయికే పార్టీకి బలం, విజయం

### మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్:** మహబూబ్‌నగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కొత్త అధ్యక్షుడిగా ఎన్నికైన ఎం.సంజీవ్ ముదిరాజ్ ప్రమాణ స్వీకార మహోత్సవం జిల్లా కేంద్రంలోని డిసిసి కార్యాలయం శుక్రవారం ఘనంగా నిర్వహించబ డింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే యెన్నం శ్రీని వాస్ రెడ్డి నూతన అధ్యక్షుడిని అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాత నాయకులు అనుభవం, కొత్త నాయకులు ఉత్సాహం కలిసినప్పుడే ఏ పార్టీ అయినా వృద్ధి సాధిస్తుందని, మహబూబ్‌నగర్ జిల్లాలోని కాంగ్రెస్ విస్తరణకు ఇదే సరైన సమయమని, అందరూ కలిసికట్టుగా పనిచేసి క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని సూచించారు. అలాగే మాజీ డిసిసి అధ్యక్షులు జి.మధుసూదన్ రెడ్డి గత మూడు సంవత్సరాలు జిల్లాలో కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉండగా, పార్టీని నిలబెట్టడంలో పోషించిన పాత్ర చాలా కీలకం అని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమం ప్రారంభంలో నూతన డిసిసి అధ్యక్షులు పదవీ బాధ్యతలు స్వీకరించి, జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హనుమంతరావు ఎఐసిసి ప్రత్యేక ఆహ్వానితులు డా.చల్లా వంశీచంద్ రెడ్డి, మాజీ డిసిసి అధ్యక్షులు, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్ దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధు సూదన్ రెడ్డి, జడ్చర్ల ఎమ్మెల్యే జనుంపల్లి అనిరుధ్ రెడ్డి ముడా చైర్మన్ లక్ష్మ ణ్ యాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్ ముదిరాజ్, జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం పర్సన్ ఇంచార్జి గోనెల శ్రీనివాసులు, టీపిసిసి ప్రతినిధి జహీర్ అక్తర్, సీనియర్ నాయకులు వినోద్ కుమార్, ఎన్.పీ వెంకటేష్. మారేపల్లి సురేందర్ రెడ్డి. మాజీ జడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణా సుధాకర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ రాధా అమర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు వసంత, డిసిసి ఉపాధ్యక్షులు సత్తూరు చంద్రకుమార్ గౌడ్, ప్రధాన కార్య దర్శి సిరాజ్ ఖాద్రీ, వేముల కృష్ణయ్య, యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు అవేజ్, ఎస్సీ సెల్ చైర్మన్ సాయిబాబా, ఐఎన్టీయుసి రాములు యాదవ్, గోపాల్ యాదవ్, అజ్మత్ అలి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్, హన్వాడ మండల అధ్యక్షుడు వి.మహేందర్, చెన్నయ్య, హన్వాడ మండల కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు నవనీత, శారత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, రామచంద్రయ్య, ప్రవీణ్ కుమార్, మాధ వరెడ్డి, ఫయాజ్, తాహేర్, అనుప ఆంజనేయులు, యాదిరెడ్డి, రఘు దసరి, జె.వెంకటయ్య, జేసిఆర్, అబ్దుల్ హక్, మోయిజ్ పాల్గొన్నారు.

## నామినేషన్ కేంద్రాల పరిశీలన



**ప్రజాపక్షం/మక్తల్:** మక్తల్ మండల పరిధిలోని లింగంపల్లి కాచువార్‌లో ఎన్నికల దరఖాస్తుల స్వీకరణ క్లస్టర్లను శుక్రవారం ఎన్నికల ప్రత్యేక అధికారి అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ పరిశీలించారు. పంచాయితీ ఎన్నికల మూడో విడత నామినేషన్ల దరఖాస్తుల స్వీకరణ చివరి రోజు కావడంతో దర ఖాస్తుల స్వీకరణ క్లస్టర్లను విధులు నిర్వహిస్తున్న ఆర్ఓ అధికారులతో ఎన్ని కల అధికారి మాట్లాడారు. దరఖాస్తుల స్వీకరణ నేటి సాయంత్రం ఐదు గంటలు చివరి రోజు కావడంతో పోటీ చేసే పోటీ చేయడానికి అభ్యర్థులు ఇచ్చే దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి తీసుకోవాలన్నారు. పోటీ చేసే అభ్యర్థి చేతులో నామినేషన్ పత్రాలతో క్లస్టర్ ఆవరణలోకి వచ్చిన ప్రతి ఒక్కరి నుంచి పోటీ చేసే చివరి అభ్యర్థి వరకు దరఖాస్తులు తీసుకోవాలన్నారు. రేపు దరఖాస్తుల (స్కూట్నీ) పరిశీలన ఉంటుంది. క్లస్టర్ అధికారి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని అక్కడ ఉన్న అధికారులకు సూచించారు. పరిశీలన ఎంపీడీవో రమేష్, ఎంపీఓ కాశీనాథ్ అధికారులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పక్షాన ఐజెయు నిరంతర పోరాటం




యూనియన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవం

### అధ్యక్ష, కార్యదర్శులుగా నాగరాజు గౌడ్, సతీష్ రెడ్డి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** టీయూడబ్ల్యూజే (ఐజెయూ) గత 70 ఏళ్లుగా నిరంతరంగా జర్నలిస్టుల పక్షాన్నే పోరాటం చేస్తుందని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మధుగౌడ్ పునరుద్ఘాటించారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని సురవరం ప్రతాప్‌రెడ్డి ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావే శంలో యూనియన్ జిల్లా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మహాసభను కనివినీ ఎరుగని రీతిలో విజయవంతం చేసినందుకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎన్నికల అధికారి బాల స్వామి మాట్లాడుతూ జిల్లా కమిటీ ఏకగ్రీవం చేసేందుకు అందులో భాగస్వా ములైన అందరికి ధన్యవాదాలు తెలిపారు. ఇండ్లు రాని జర్నలిస్టులు పక్షాన పోరాడాలని కోరారు. ప్రశాంత్ మాట్లాడుతూ గత తొమ్మిది రోజులుగా ఉమ్మడి జిల్లాలో కమిటీలు, మహాసభలు నిర్వహించినట్లు తెలిపారు. సమి ష్టిగా ఏకగ్రీవం చేసినందుకు సంతోషంగా ఉందని యూనియన్ జిల్లా మాజీ అధ్యక్షుడు దత్తు మాట్లాడారు. మహాసభ కన్వీనర్ కేపీ విజయరాజు మాట్లా డుతూ ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసేందుకు సహకరిం చిన ప్రతి ఒక్కరికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నూతన కార్యవర్గం ఏక గ్రీవం టియూడబ్ల్యూజే (ఐజేయు) మహబూబ్‌నగర్ జిల్లా నూతన కార్యవ ర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడిగా నాగ రాజు గౌడ్, జిల్లా కార్యదర్శిగా ఎన్.సతీష్ కుమార్‌రెడ్డి, కోశాధికారిగా జిల్లెల రఘు, ఉపాధ్యక్షులుగా పవన్‌కుమార్‌రెడ్డి, కరణం భాస్కర్ రావు, ఐలమోని శేఖర్, మోహరాజ్, సంయుక్త కార్యదర్శులుగా ఎం.రవీందర్ గౌడ్, ఎండి జాఫర్, ప్రభాకర్, గోకులం వెంకటేశ్, కార్యవర్గ సభ్యులుగా నెంబర్లతో కూడిన పూర్తి కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్న లిస్టులు, యూనియన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## క్రీడలు వ్యక్తిత్వాన్ని మెరుగుపరుస్తాయి

### ఎస్పీ డాక్టర్ వినీత్

**ప్రజాపక్షం/మక్తల్ :** నారాయణపేట జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రెండ్లీ మెగా క్రికెట్ టోర్నమెంట్ ఉత్సాహభరితంగా ముగి సింది. ఫైనల్ మ్యాచ్ అనంతరం విజేత మక్తల్ జట్టుకు, రన్నర్ టీమ్ మరి కల్ జట్టుకు క్యాష్ ప్రైజ్ తో పాటు కప్‌లను జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ అంద జేశారు. ఈ టోర్నమెంట్లో మొత్తం జిల్లా పరిధిలోని 12 పోలీస్ స్టేషన్లో పరి ధిలోని 24 యువకుల టీం , రెవెన్యూ, మీడియా, డాక్టర్స్, పోలీస్ టీమ్స్ పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ. క్రీడలు మని షిలో క్రమశిక్షణ, ఓర్పు, సహనం, నాయకత్వ లక్షణాలు పెంపొందిస్తా యని తెలిపారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, ముఖ్యంగా ఫలి తాన్ని ఎలా స్వీకరిస్తామన్నదే ముఖ్యమని చెప్పారు. భవిష్యత్తులో ప్రతి సంవత్సరం నవంబర్ నెలలో ఈ క్రికెట్ టోర్నమెంట్ తప్పకుండా నిర్వ హించాలని పోలీసు అధికారులకు ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. విజేత లకు ప్రథమ బహుమతి రూ.10,000/ సునందా హాస్పిటల్స్ డాక్టర్ ప్రసాద్ శెట్టి స్పాన్సర్ చేశారు. టోర్నీ మొత్తంలో ప్రతి రోజు క్రీడాకారులకు భోజనం అందించిన లయన్స్ క్లబ్ టీమ్ మెంబర్స్కు స్పాన్సర్స్ చేసిన డాక్టర్స్ నీ ఎస్పీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

**మ్యాచ్ వివరాలు**

మొదట బ్యాటింగ్ చేసిన మరికల్ టీమ్ 10 ఓవర్లలో 84/7 చేశారు. మక్తల్ టీమ్ 8.2 ఓవర్లలో 85 రన్స్ చేసి విజయం సాధించారు. బెస్ట్ బ్యాట్స్‌మన్ : హనుమంతు కృష్ణ మండలం. బెస్ట్ బౌలర్: సురేష్(మరికల్) మాన్ ఆఫ్ ది సిరీస్: విజయవంతంగా నిర్వహించిన ఆర్గనైజింగ్ టీమ్ ను అభినందించారు. మొత్తం 24 టీమ్స్ మీడియా, రెవెన్యూ, పోలీసు, డాక్టర్స్ సహా పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హుల్ హక్, డీఎస్పీ లు నల్లపు లింగయ్య, మహేష్, డాక్టర్స్ ప్రసాద్ శెట్టి, మధుసూదన్ రెడ్డి, సిఐ లు శివశంకర్, రామ్ లాల్, రాజేం దర్ రెడ్డి, సైదులు, ఎస్సైలు, పిఈటి రమణ, వివిధ మండలంలోని క్రీడా కారులు పాల్గొన్నారు.

## హోంగార్డుల సంక్షేమానికి కృషి



ప్రజాపక్షం/సూర్యాపేట : హోంగార్డుల సంక్షేమానికి కృషి చేస్తామని జిల్లా ఎస్‌పి కె నరసింహ తెలిపారు. డిసెంబర్ 6వ తేదీ హోంగార్డుల 63వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిభిరం, హోంగార్డుల క్రీడాపోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. హోంగార్డులు పోలీస్ సిబ్బందితో సమానంగా శాంతిభద్రతల పరిరక్షణలో పనిచేస్తున్నారని అభినందించారు. రక్తదాన శిభిరం అనంతరం కబడ్డీ, వాలీబాల్, చెస్, క్యారమ్స్ క్రీడలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్‌పిలు రవీందర్ రెడ్డి, జనార్ధన్ రెడ్డి, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ రామారావు ఉన్నారు.

## సిపిఐ సర్పంచ్ అభ్యర్థులుగా నామినేషన్ దాఖలు

ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : మండలంలోని స్థానిక గ్రామపంచాయతీ సర్పంచ్ సీపీఐ అభ్యర్థులు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. చిల్లాపురం సర్పంచ్ అభ్యర్థిగా దుబ్బాక భాస్కర్, జనగాం సర్పంచ్ అభ్యర్థిగా మామిండ్ల గోపాల్ రెడ్డి, కోతులాపురం సర్పంచ్ అభ్యర్థిగా కురుమిద్దె వినోద శ్రీనివాస్, లింగంవారి గూడెం సర్పంచ్ అభ్యర్థిగా పల్లె సరళ శేఖర్ రెడ్డిలు నామినేషన్ వేశారు. 20వ వార్డ్ మెంబర్లుగా నామినేషన్ చివరి రోజు కాబట్టి పెద్ద ఎత్తున పార్టీ నాయకులతో కలిసి జనగాం గ్రామంలో ర్యాలీ నిర్వహించి నామినేషన్‌కు ర్యాలీగా వెళ్లారు. ఈ కార్యక్రమంలోసీపీఐ పార్టీ నాయకులు పాల్గొన్నారు.





## సంస్కృతి, సంప్రదాయాలకు పెద్దపీట

### రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : సంస్కృతి సంప్రదాయాలకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని శబరినగర్‌లోని అయ్యప్ప స్వామి దేవాలయంలో యువజన కాంగ్రెస్ నాయకులు షేక్ ఫరూక్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కుల మతాలకు అతీతంగా యువజన కాంగ్రెస్ నాయకులు ఫరూక్ మాలధార స్వాములకు గత కొన్ని సంవత్సరాలుగా అన్నదాన కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దేవాలయాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తూ పూర్వవైభవం తీసుకొస్తుందన్నారు. 41 రోజుల పాటు దీక్ష చేపట్టి భగవంతుని పూజిస్తూ కఠోరమైన నియమ నిబంధనలను పాటించడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వెలుగు వెంకన్న, వల్దాస్ దేవేందర్, పిల్లల రమేష్ నాయుడు, గొట్టిముక్కల శ్రీనివాస్‌రెడ్డి, జటంగి రవి, గోపారపు రాజు, గుండ వెంకన్న, వివిధ మాలాధార స్వాములు పాల్గొన్నారు.

## నేడు సిఎం రేవంత్‌రెడ్డి రాక...

### ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్‌పి



ప్రజాపక్షం/దేవరకొండ: దేవరకొండలో ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి దేవరకొండ మునిసిపాలిటిలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అనంతరం శేరిపల్లి రహదారిలో నిర్వహించే బహిరంగ సభలో సిఎం పాల్గొననున్నారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా శుక్రవారం జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఏర్పాట్లు పరిశీలించారు. ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మునిసిపాలిటిలో వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్‌తో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. దేవరకొండ మునిసిపల్ పరిధిలో వివిధ వార్డులలో సిసి రోడ్లు, సిసి డ్రైన్లు, పార్కు, జూనియర్ కళాశాల గ్రౌండ్ అభివృద్ధి వంటి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, ఆర్డీవో రమణారెడ్డి, జిల్లా అధికారులు ఉన్నారు.

## ధాన్యం అక్రమ తరలింపునకు చెక్

ప్రజాపక్షం/కోదాడ: కోదాడ డివిజన్ ప్రాంత తెలంగాణ రాష్ట్ర సరిహద్దు ప్రాంత్రం కావడంతో ఇతర రాష్ట్రలకు చెందిన ధాన్యం ఏలాంటి అనుమతులు లేకుండా రాష్ట్రంలోకి రాకుండా డివిజన్ పరిధిలోని ఆరు చెక్‌పోస్టుల ఏర్పాటు చేసి, 24 సిబ్బంది నిఘ ఏర్పాటు చేసిన్నట్లు కోదాడ డిఎస్‌పి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం పోలీసు డివిజన్ కార్యలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అనుమతులు లేకండా దాన్యం తరిలించితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇప్పటి వరకు ఏడు లారీలు, ఒక ట్రాక్టర్‌ను సీజ్ చేసిన్నట్లు తెలిపారు. కోదాడ, హుజూర్‌నగర్ నియోవజర్గ ల పరిధిలో నిర్వహిస్తున్న పంచాయితీ ఎన్నికలలో ఓటర్లు తమ ఓటుహక్కును స్వేచ్చగా వినియోగించుకునేల చర్యలు తీసుకుంటున్నామని, వారికి అవగాహన కలిగించేందుకు ప్రత్యేక కార్యక్రమాలను చేపడతామన్నారు. కోదాడ నియోజవర్గ పరిధిలో 120 గ్రామాలకు 77 సమస్యత్మక గ్రామాలను గుర్తించామని, ఏలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా అదనపు బలగాల మోహరింపుతామన్నారు. ఎన్నికలలో శాంతియుత పరిరక్షణకు ప్రజలు పోలీసులకు తమ వంతు సహాయ, సహకారాలు అందించాలని కోరారు. ప్రతి ఒక్కరు చట్టానికి లోబడి నడుచుకోవాలని సూచించారు.

## 73 మంది బైండోవర్



ప్రజాపక్షం/మునగాల: పోలీస్ స్టేషన్ పరిధిలోని నారాయణగూడెం, బరాఖత్‌గూడెం, తిమ్మారెడ్డి గూడెం, కొక్కిరేణి గ్రామాలకు చెందిన బిఆర్‌ఎస్, కాంగ్రెస్, సిపిఐ(ఎం) పార్టీలకు చెందిన సర్పంచులకు, వార్డు మెంబర్లకు నామినేషన్ దాఖలు చేసిన వ్యక్తులు, అన్ని పార్టీల ముఖ్యమైన నాయకులు, కార్యకర్తలను 73 మందిని మునగాల తహసిల్దార్ ముందు ఒక్కొక్కరికి ఐదు లక్షల రూపాయల సొంతపూచికత్తుగా తీసుకుని బైండోవర్ చేసినట్లు మునగాల ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ప్రజలు రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ఎలాంటి గొడవలు, అల్లర్లు సృష్టించకుండా ఎన్నికలు శాంతియుతంగా జరిగే విధంగా సహకరించాలని కోరారు. బైండోవర్ అయిన తర్వాత ఎవరైనా ఎలాంటి క్రిమినల్ కేసులలో తలదూర్చితే వాళ్లు ఐదు లక్షల రూపాయలు ప్రభుత్వానికి కట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రామారావు, పోలీసులు, సిబ్బంది ఉన్నారు.

## బాలల పరిరక్షణ కమిటీ ఏర్పాటు

ప్రజాపక్షం/నందికొండ: స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం లో మున్సిపల్ కమిషనర్ చింతా వేణు ఆధ్వర్యంలో బాలల పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ నందికొండ మున్సిపాలిటీ పరిధిలో ప్రతి నెల మొదటి శుక్రవారం కమిటీ సమావేశాలు నిర్వహించడం జరుగుతుందని ఈ కమిటీ యొక్క ముఖ్య ఉద్దేశం ప్రధానంగా శిశు విక్రయాలు. బాల్యవివాహాలు అక్రమ దత్తత.బాలల పై లైంగిక వేధింపులు అరికట్టి ఆ సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. బాలల పై లైంగిక వేధింపులు హక్కుల ఉల్లంఘనలు జరిగిన వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098,పోలీస్ 100 ,కు ఫోన్ చేసి సమాచారం అందించాలని అన్నారు. సంతానం లేని దంపతులు ఐసిడిఎస్ కార్యాలయం ద్వారా అప్లికేషన్ పెట్టుకొని పిల్లలను దత్తత తీసుకోవచ్చని తెలిపారు. ఐసిడిఎస్ సిడిపిఓ శాంతి, ఎసిడిపిఓ సువర్ణ ,సూపర్వైజర్ రమాదేవి, డిసిపిఓ గణేష్ ఎల్ సి పి ఓ వెంకన్న , డి సి పి యు మహేష్, రమణి, టిఎంటి పద్మ, వార్డు ఆఫీసర్స్,ఆర్ పి లు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌తోనే పేదలకు సంక్షేమ పథకాలు

### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి



ప్రజాపక్షం/నల్లగొండ (తిప్పర్తి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తూ అభివృద్దే ధ్యేయంగా ముందుకు పోతుందని రాష్ట్ర రోడ్లు,భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మంత్రి తిప్పర్తి మండల కేంద్రంతో పాటు జొన్నలగడ్డ గూడెం గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ తిప్పర్తి కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థి బద్దం రజిత సుధీర్, జొన్నలగడ్డ గూడెం సర్పంచ్ అభ్యర్థి నామిరెడ్డి అనురాధ వెంకట్రాంరెడ్డిలతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ సర్పంచ్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. గ్రామాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిస్తేనే అభివృద్ధి జరుగుతుందని తెలిపారు.ఇతర పార్టీ అభ్యర్థులు గెలిస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకురి రమేష్,డిసిసిబి డైరెక్టర్ పాశం సంపత్ రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు చింతకుంట్ల రవీందర్ రెడ్డి, తిప్పర్తి మాజీ సర్పంచ్ లు మోష, రొట్టెల రమేష్, మాజీ ఎంపీటీసీలు కిన్నెర అంజి, ఎల్లయ్య, ఇండ్లూరు సర్పంచ్ అభ్యర్థి పాప కంటి సైదులు, సర్వారం సర్పంచ్ అభ్యర్థి మర్రి నరసయ్య, శిలార్మియా గూడెం సర్పంచ్ అభ్యర్థి కొత్తపల్లి శ్రీనివాస్, జంగిరెడ్డిగూడెం సర్పంచ్ అభ్యర్థి దాసరి జానయ్య, తాందార్ పల్లి సర్పంచ్ అభ్యర్థి కారే శ్రీరాములు పాల్గొన్నారు.

## అధికారులు పారదర్శకంగా, బాధ్యతగా విధులు

### జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు రవి నాయక్



ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ : అధికారులు గ్రామ పంచాయితీ ఎన్నికలను పారదర్శకంగా, బాధ్యతగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకులు రవి నాయక్ సూచించారు. గ్రామ పంచాయితీ ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా పోలింగ్ సిబ్బందికి ర్యాండమైజేషన్ ప్రక్రియను శుక్రవారం కలెక్టరేట్‌లోని విసి హాల్‌లో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి సాధారణ పరిశీలకులు రవి నాయక్ నిర్వహించారు. మొదటి విడత ఎన్నికలు జరిగే ఆత్మకూర్(ఎస్), సూర్యాపేట, జాజిరెడ్డిగూడెం, నాగారం, నూతనకల్, మద్దిరాల, తిరుమలగిరి, తుంగతుర్తి మండలాల్లోని ఆయా గ్రామ పంచాయితీల సర్పంచ్, వార్డు స్థానాలకు ఎన్నికల పోలింగ్ విధులు నిర్వర్తించే ప్రిసైడింగ్ అధికారులు, ఓపిఓలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. స్థానికత, విధులు నిర్వర్తిస్తున్న మండలం తదితర అంశాలను పరిగణలోనికి తీసుకుని, సిబ్బందికి పోలింగ్ విధులను కేటాయించారు. జిల్లాలో మొదటి విడతలో 159 గ్రామ పంచాయితీల సర్పంచ్, 1442 వార్డు స్థానాలకు ఎన్నికల నిర్వహణ కోసం 20 శాతం రిజర్వ్ సిబ్బంది కలుపుకుని ప్రిసైడింగ్ అధికారులు 1683, ఓపిఓలు 2260 పోలింగ్ కోసం ర్యాండమైజేషన్ జరిపారు. ఈ ర్యాండమైజేషన్ ప్రక్రియలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, జడ్‌పి సిఈఓ వివి అప్పారావు, డిపిఓ యాదగిరి, డిఎల్‌పిఓ నారాయణరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

## దామర నర్సింహ ఆశయ సాధనకు కృషి చేద్దాం

### సిపిఐ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి దామోదర్ రెడ్డి



ప్రజాపక్షం/మోటకొండూరు : ప్రజానాట్యమండలి జిల్లా కౌన్సిల్ సభ్యులు సిపిఐ మోటకొండూరు మండల కౌన్సిల్ సభ్యులు దామర నర్సింహా అలియాస్ గద్దర్ నర్సింహా ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని యాదాద్రి భువనగిరి జిల్లా సిపిఐ కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి అన్నారు. ఆయన శుక్రవారం మోటకొండూరు మండల కేంద్రంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బోలగాని సత్యనారాయణ, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కుసుమని హరిచంద్ర, చెక్కా వెంకటేశ్ జిల్లా ప్రజానాట్యమండలి అధ్యక్షులు సిపిఐ మండల కార్యదర్శి గాదగాని మాణిక్యంలతో కలిసి దామర నరసింహా మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బొలగాని సత్యనారాయణలు మాట్లాడుతూ దామర నరసింహ చిన్ననాటి నుంచి పార్టీ అభిమానులుగా ఉంటూ ప్రజానాట్యమండలి ప్రజా సంఘాల్లో పని చేస్తూ సిపిఐ మండల కౌన్సిల్, ప్రజానాట్యమండలి జిల్లా సభ్యులుగా ఎదిగిన నాయకుడని, ప్రజలకు ఎలాంటి సమస్యలను పాటల రచనలతో పాడి ప్రజల గుండెలలో నిలిచిన గాయకుడని అన్నారు. గత ఆరు నెలల నుండి నరసింహ బ్రెయిన్ సర్జరీ అయినట్లు అనారోగ్యంతో బాధపడుతూ గురువారం తుది శ్వాస విడిచాడని, అతని మరణం సిపిఐ పార్టీకి తీరని లోటని పేర్కొంటూ సిపిఐ మండల సమితి అతని కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవికలపల్లి పాండు, గణేష్, ఎండి గంశీ, గట్టికొప్పల శ్రీధర్, యాదగిరి, బొట్ల యాదయ్య, బీరకాయల మధు, పరుశురాములు, ఈశ్వర్, బోగారం పాండు పాల్గొన్నారు.

## టోకెన్లు జారీ చేసిన ప్రతి ఒక్కరి నామినేషన్ పత్రాలు స్వీకరిస్తారు

### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్

ప్రజాపక్షం/హుజూర్‌నగర్(మఠంపల్లి): టోకెన్స్ జారీ చేసిన ప్రతి ఒక్కరికి నామినేషన్ పత్రాలు స్వీకరిస్తారని, అభ్యర్థులు ఆందోళన పడకుండా ఎన్నికల సిబ్బందికి సహకరించాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ కోరారు. శుక్రవారం మఠంపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ స్వీకరణ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. మఠంపల్లి క్లస్టర్‌లో మఠంపల్లి, గుండ్లపల్లి, రఘునాథపాలెం, చౌటపల్లి, బక్కమంతులగూడెం గ్రామాలకు చెందిన సర్పంచ్, వార్డు సభ్యులు నామినేషన్ స్వీకరించడం జరుగుతుందని అన్నారు. నామినేషన్ పత్రాలు సమర్పించేందుకు సాయంత్రం ఐదు గంటల దాటిన తర్వాత నామినేషన్ కేంద్రం ఆవరణలో ఉన్న ప్రతి ఒక్కరికి టోకెన్స్ జారీ చేయడం జరుగుతుందని, అభ్యర్థులు సిబ్బందికి సహకరిస్తే మరో కౌంటర్ ఏర్పాటు చేసి వేగవంతంగా వరుస క్రమంలో నామినేషన్ పత్రాలు తీసుకుంటామని తెలిపారు. అప్పటి వరకు అభ్యర్థులకు ఇబ్బంది కలగకుండా కూర్చునేందుకు కూర్చిలు, తాగునీరు లాంటి మౌళిక వసతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్డీవో శ్రీనివాసులు, తహసిల్దార్ మంగ, ఎంపిడివో జగదీష్, అధికారులు పాల్గొన్నారు.

## రాజీ అయ్యే కేసుల పరిష్కారానికి కృషి

### జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి వి.మాధవిలత



ప్రజాపక్షం/యాదాద్రి : జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ యాదాద్రి భువనగిరి అధ్యక్షులు , జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు వారి సూచనల మేరకు సంస్థ కార్యదర్శి వి.మాధవిలత శుక్రవారం పారాలీగల్ వాలంటీర్లకు వారు నిర్వర్తించే సేవలపై సమీక్షించి తగు సూచనలు చేసారు. పారా లీగల్ వాలంటీర్లు సమాజానికి, న్యాయ సేవా సంస్థకు వారధులని సమాజంలో అర్హులైన వారికి న్యాయ సేవ సంస్థల ద్వార సేవలు అందేలా చూడాలని కోరారు. డిసెంబర్ 21వ తేదీన నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో న్యాయవాదులు సహకరించి రాజీ పడదగు కేసుల అధిక పరిష్కారానికి కృషి చేయాలని తద్వారా జిల్లాలోని చిన్న తగాదాల కేసుల పెండింగ్ తగ్గి తీవ్ర నేరాల కేసులపై దృష్టి పెట్టే అవకాశం ఉంటుందని, సంఘంలో శాంతి, స్నేహం వృద్ధి జరిగేలా చూడొచ్చని తెలిపారు. కక్షిదారులు రాజీ పరిష్కారంతో తమ సమయాన్ని, డబ్బును ఆదా చేసుకోవచ్చని, లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పని తెలిపారు. ఈ కార్యక్రమంలో భువనగిరి న్యాయవాదుల సంఘం అధ్యక్షులు వివి గౌడ్, ఉపాధ్యాక్షులు రేణుక, కార్యదర్శి బొల్లేపల్లి కుమార్, సభ్యులు చంద్రశేఖర్ రెడ్డి, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు. ఆ తదుపరి భువనగిరిలోని సబ్ జైలును సందర్శించి, అర్హులైన కక్షిదారులకు న్యాయ సహాయం అందుతుంది, లేనిది సమీక్షించి, న్యాయ సహాయానికి తగు చర్యలు తీసుకోవటానికి న్యాయ సహాయ న్యాయవాదులకు సూచనలు చేశారు.

## వాహనాల తనిఖీ

ప్రజాపక్షం/చింతలపాలెం : స్థానిక ఎన్నికల నేపథ్యంలో ఎఫ్‌ఎస్‌టి ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మండలంలోని బస్టాండ్ సెంటర్‌నందు రహదారిపై వెళ్లే వాహనాలను ఆపి తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఎస్‌టీంకు సంబంధించి సీనియర్ అసిస్టెంట్ రంగారావు మాట్లాడుతూ మద్యం, డబ్బు, వివిధ రకాల వస్తువులను పంపిణీ చేయకుండా అడ్డుకునేందుకు ఎన్నికల అధికారులు ఎప్‌ఎస్‌టి (ఫ్లయింగ్ స్కాట్ టీం)ను నియమించినట్లు తెలిపారు. ఈ టీంలో రహదారుల వెంట డబ్బులు, మద్యం ఏమైనా విలువైన వస్తువులను పంపిణీ చేసినందుకు తీసుకువెళ్తారో అటువంటి వాహనాలను గుర్తించి వాటిని సీజ్ చేస్తామని తెలిపారు. హెడ్ కానిస్టేబుల్ లోలియాసింగ్, ఫోటోగ్రాఫర్ పాల్గొన్నారు.

# ప్రతీ పేద విద్యార్థికీ ఉపకార వేతనం

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: ప్రతి పేద విద్యార్థి ఉపకార వేతనం పొందేలా అధికారులు మానవతా దృక్పథంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఆమె మండల విద్యాశాఖ అధికారులు, సంక్షేమ శాఖల అధికారులతో పాఠశాల విద్యార్థుల స్కాలర్షిప్‌ల మంజూరు పై సమీక్ష నిర్వహించారు.వచ్చే శుక్రవారం నాటికి జిల్లాలో స్కాలర్షిప్ ల దరఖాస్తులు 30 శాతం దాటాలని ఆమె లక్ష్యాన్ని విధించారు. ఇందుకు ఎంఈఓలు అంకితభావంతో పనిచేయాల్సిందిగా కోరారు. ఏమైనా సమస్యలు ఉంటే తక్షణమే తమ దృష్టికి తీసుకువస్తే సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. కులం ధ్రువపత్రం విషయంలో తహసీల్దార్లు జాప్యం లేకుండా సర్టిఫికెట్లు జారీ చేయాలని ఆదేశించారు. బ్యాంక్ అధికారులు బ్యాంక్ అకౌంట్ ప్రారంభించే విషయంలో పూర్తి సహకారం అందించాలని, విద్యార్థులకు ఇచ్చే స్కాలర్షిప్ లను గ్రీన్ ఛానల్ ద్వారా జారీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఎల్ డి ఎం శ్రామిక్ ను ఆదేశించారు.రెవిన్యూ ఆదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి చత్రు నాయక్, సాంఘిక సంక్షేమ శాఖ డిడి శశికళ, ఎల్డీఎం శ్రామిక్, మండల విద్యాశాఖ అధికారులు ,సంక్షేమ శాఖల అధికారులు హాజరయ్యారు.

**సాయుధ దళాల పతాక దినోత్సవం :** దేశ రక్షణకు ప్రాణాలను ఫణంగా పెట్టి అహర్నిశలు కృషి చేస్తున్న త్రివిధ దళాలకు ప్రతి ఒక్కరు సహకరించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు.ఈనెల 7న నిర్వహించనున్న సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఆమె త్రివిధ దళాలకు బాసటగా డొనేషన్ అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ త్రివిధ దళాలు ఎల్లా వేళలా దేశాన్ని సంరక్షిస్తున్నందునే అందరూ ప్రశాంతంగా బ్రతుకగలుగుతున్నామని,అలాంటి సైనికలకు సహకారం అందిండంలో ప్రతి ఒక్కరు బాసటగా నిలవాల్సిన అవసరం ఉందని అన్నారు. త్రివిధ దళాల సైనికులకు బాసటగా నిలిచేందుకు ప్రతి సంవత్సరం డిసెంబర్ 7న సాయుధ దళాల పతాక దినోత్సవం గా నిర్వహించడం జరుగుతున్నదని తెలిపారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి టి .వనజ, ఆర్డిఓ వై. అశోక్ రెడ్డి, మాజీ సైనికుల సంక్షేమ అసోసియేషన్ అధ్యక్షులు కే. భాస్కర్ రెడ్డి, జనరల్ సెక్రెటరీ సత్యనారాయణ రాజు, సభ్యులు శ్రీనయ్య ,రాములు తదితరులు ఉన్నారు.

## నమ్మకానికి, విశ్వాసానికి మారుపేరు పోతు భాస్కర్

### ఎఐసిసి సభ్యుడు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి

ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ : నమ్మకానికి, విశ్వాసానికి మారుపేరు కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్ అని ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి అన్నారు. శుక్రవారం మాజీ మున్సిపల్ కౌన్సిలర్ బైరు శైలేందర్ ఆధ్వర్యంలో ఆయన జన్మదిన వేడుకల్లో వారు ముఖ్య అతిథిగా హాజరై కేక్‌ను కట్ చేసి మాట్లాడారు. గత 40 సంవత్సరాలుగా తన తండ్రి మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అనుచరుడిగా కొనసాగారన్నారు. ఏనాడు ఏ పదవిని ఆశించకుండా కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేశారన్నారు. రానున్న జిల్లా పరిషత్ ఎన్నికల్లో పోతు భాస్కర్‌ను చైర్మన్‌గా నియామకం అయ్యేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మనుషులు వేరైనా తనది వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, పోతు భాస్కర్‌ది ఆత్మ ఒక్కటేనని చెప్పారు. సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి మాట్లాడుతూ పోతు భాస్కర్‌కు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా ప్రభుత్వం నియామకం చేస్తూ జాబితాను వ్యవసాయ శాఖ మార్కెటింగ్ అధికారులకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు పంపినా తనకు పదవి వద్దని తిరస్కరిస్తూ తన పేరును ప్రతిపాదించిన త్యాగశీలి అని కొనియాడారు. అతని త్యాగ ఫలితమే తాను ఈ రోజు వ్యవసాయమ మార్కెట్ చైర్మన్‌గా పదవి వరించిందని చెప్పారు. 40 సంవత్సరాలుగా తాము కలిసికట్టుగా ఉండి పార్టీ కోసం పనిచేయడం జరిగిందన్నారు. మాజీ మంత్రి దామోదర్ రెడ్డి భౌతికంగా లేకున్నా ఆయన ఆశయ సాధన కోసం ముందుకు సాగుతామన్నారు. అనంతరం అభిమానులు పోతు భాస్కర్ తోపాటు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, కొప్పుల వేణారెడ్డిలను గజమాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్దుల్ రహీం, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షులు అంజద్‌అలీ, నాయకులు వేణుగోపాల్, నాగుల వాసు, సాయినేత పాల్గొన్నారు.

**వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ మాద్దుల నవీన్ ఆధ్వర్యంలో...**

సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ డైరెక్టర్ మాద్దుల నవీన్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్ జన్మదిన వేడుకలను శుక్రవారం మార్కెట్ కార్యాలయ ఆవరణలో ఘనంగా నిర్వహించారు. కేక్‌ను కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. అనంతరం ఆయనను శాలువాలతో సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## కృత్రిమ మేధస్సుతో అనేక విప్లవాలు



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ : కృత్రిమ మేధస్సుతో రానున్న రోజుల్లో అనేక విప్లవాలు సృష్టించవచ్చని చెన్నై, ఇన్స్టిట్యూట్ ఆఫ్ మాథమేటికల్ సైన్సెస్ అసిస్టెంట్ ప్రొఫసర్ ప్రకాష్ సాయి వాసన్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాలలో భౌతిక శాస్త్రం, కంప్యూటర్ సైన్స్ విభాగాల ఆధ్వర్యంలో కృత్రిమ మేధస్సు ఏ వన్,మెషిన్ లెర్నింగ్ యొక్క శక్తి ఆవిష్కరణ భవిష్యత్ తరాల విప్లవాలు అనే అంశం పైన జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా సాయి ప్రకాష్ వాసన్ పాల్గొని మాట్లాడుతూ నేటి వేగవంతమైన ప్రపంచంలో, కృత్రిమ మేధస్సు, మెషిన్ లెర్నింగ్ సాంకేతికతలు కేవలం పరిశోధనాంశాలుగా మాత్రమే కాకుండా, భవిష్యత్ తరాలకు కొత్త అవకాశాల తలుపులు తెరుస్తున్న విప్లవాలుగా మారుతున్నాయని అన్నారు.ఈ అత్యాధునిక సాంకేతికతల పూర్తి సామర్థ్యాన్ని వెలికితీయడం ద్వారా, మనం విద్య, వైద్యం, పరిశ్రమలు, పర్యావరణ పరిరక్షణ వంటి రంగాలలో అపూర్వమైన, సుస్థిరమైన పురోగతిని సాధించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో మహాత్మా గాంధీ విశ్వ విద్యాలయం కంప్యూటర్ ప్రొఫసర్లు రెడమళ్ళ రేఖ, డాక్టర్ సుధారాణి,డాక్టర్ ఎం. జయంతి,డాక్టర్ డి. సంధ్యారాణి, డాక్టర్ కె. హరీష్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సముద్రాల ఉపేందర్, సదస్సు కన్వీనర్ డాక్టర్ ఎం. శ్రీనివాస్ రెడ్డి, కో కన్వీనర్ ఎస్‌పి వెంకట రమణ పాల్గొన్నారు.

# క్రీడ

ప్రతిష్ఠాత్మక యాషెస్ సిరీస్‌లో భాగంగా ఇంగ్లాండ్‌తో జరుగుతున్న రెండో టెస్ట్‌లో ఆస్ట్రేలియా భారీ ఆధిక్యం దిశగా సాగుతోంది. బ్రిస్బేన్ వేదికగా జరుగుతున్న ఈ మ్యాచ్‌లో ఆసీస్ బ్యాటర్లు అద్భుత ప్రదర్శన కనబర్చారు.



## ఆసిస్‌కు ఆధిక్యం

దాంతో రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్ 73 ఓవర్లలో 6 వికెట్లకు 378 పరుగులు చేసింది. జేక్ వెదరాల్డ్78 బంతుల్లో 12 ఫోర్లు, సిక్స్‌తో 72), మార్నస్ లబుషేన్(78 బంతుల్లో 9 ఫోర్లు, సిక్స్‌తో 65), స్టీవ్ స్మిత్(85 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్స్‌లతో 61) హాఫ్ సెంచరీలతో రాణించాడు. ట్రావిస్ హెడ్ (43 బంతుల్లో 3 ఫోర్లు, సిక్స్‌తో 33), కామెరూన్ గ్రీన్ (57 బంతుల్లో 7 ఫోర్లతో 45) మరోసారి దూకుడుగా ఆడాడు. అలెక్స్ క్యారీ (45 బంతుల్లో 5 ఫోర్లతో 46 బ్యాటింగ్)తో పాటు మైఖేల్ నేజర్(15 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఇంగ్లాండ్ బౌలర్లలో బ్రైడన్ కార్స్(3/113) మూడు వికెట్లు తీయగా.. బెన్ స్టోక్స్(2/93) రెండు వికెట్లు పడగొట్టాడు. జోఫ్రా ఆర్చర్ ఒక వికెట్ తీసాడు. ప్రస్తుతం ఆసీస్ 44 పరుగుల ఆధిక్యంలో ఉంది. వన్డే తరహా బ్యాటింగ్‌తో ఆసీస్ దూకుడుగా ఆడింది. 5.17 రన్‌రేట్‌తో వేగంగా పరుగులు రాబట్టింది. మూడో రోజు ఆటలో తొలి సెషన్ మొత్తం ఆడినా ఆసీస్ ఆధిక్యం 150 పరుగులకు చేరుతుంది. అప్పుడు మ్యాచ్‌పై పట్టు చిక్కుతుంది. తొలి టెస్ట్‌లో ఆసీస్ విజయం సాధించిన సంగతి తెలిసిందే. అంతకుముందు 325/9 ఓవర్‌నైట్ స్కోర్‌తో రెండో రోజు ఆటను కొనసాగించిన ఇంగ్లాండ్ తొలి ఇన్నింగ్స్‌లో 334 పరుగులు చేసింది. ఓవర్‌నైట్ స్కోర్‌కు 9 పరుగులు మాత్రమే జోడించింది. జోఫ్రా ఆర్చర్‌ను బ్రెండన్ డగ్గెట్ ఔట్ చేయడంతో ఇంగ్లాండ్ ఇన్నింగ్స్ ముగిసింది. జోరూట్(206 బంతుల్లో 15 ఫోర్లు, సిక్స్‌తో 138 నాటౌట్) అజేయ శతకంతో రాణించగా.. జాక్ క్రాలీ(76) హాఫ్ సెంచరీతో సత్తా చాటాడు. ఆసీస్ బౌలర్లలో మిచెల్ స్టార్క్(6/75) ఆరు వికెట్లు తీయగా.. మైఖేల్ నేజర్, స్కాట్ బోలాండ్ బ్రెండన్ డగ్గెట్ తలో వికెట్ తీసారు.

## కెఎల్ రాహుల్‌కు ఎలా ఆడాలో తెలుసు


**టాప్ ఆర్డర్‌లో ఆడితే మరిన్ని సెంచరీలు చేస్తాడు : డేల్ స్టెయిన్**



ప్రస్తుతం టీమ్‌ఇండియా, దక్షిణాఫ్రికా మధ్య మూడు వన్డేల సిరీస్ జరుగుతోంది. ఇందులోభాగంగా ఇప్పటికే రాంచీ, రాయ్‌పూర్ వేదికగా రెండు వన్డేలు ముగిశాయి. తొలి వన్డేలో టీమ్‌ఇండియా 17 పరుగులతో విజయం సాధిస్తే, రెండో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 6 వికెట్ల తేడాతో గెలిచింది. ఈ రెండు మ్యాచుల్లోనూ కేఎల్ రాహుల్ అర్ధసెంచరీలతో రాణించాడు. మొదటి వన్డేలో 60 (56 బంతుల్లో), రెండో మ్యాచ్‌లో 66* (43 బంతుల్లో) పరుగులు చేశాడు. బ్యాటింగ్‌లో నిలకడ ప్రదర్శిస్తున్న అతన్ని దక్షిణాఫ్రికా మాజీ ఫాస్ట్ బౌలర్ డేల్ స్టెయిన్ ప్రశంసించాడు. 'కేఎల్ రాహుల్‌కు ఎలా ఆడాలో తెలుసు. ఒకవేళ అతడు మూడో స్థానంలో బ్యాటింగ్‌కు దిగితే.. కచ్చితంగా సెంచరీలు సాధించగలడు. కానీ ప్రస్తుతం అతడు ఆడుతున్న స్థానాల్లో... జట్టు కోసం తాను ఎలాంటి పాత్ర పోషించాలో తెలుసు. మొదటివన్డేతో పాటు, రెండో మ్యాచ్‌లోనూ అతడు హాఫ్ సెంచరీలు చేశాడు. ఎప్పుడు తగ్గాలో.. ఎప్పుడు వేగంగా ఆడాలనే విషయంపై అతడికి అవగాహన ఉంది' అని డేల్ స్టెయిన్ కొనియాడాడు. కేఎల్ రాహుల్ ఇప్పటివరకు వన్డేల్లో 83 ఇన్నింగ్స్‌ల్లో 49.50 యావరేజ్‌తో 3,218 పరుగులు చేశాడు. ఇందులో మూడు సెంచరీలు, 20 హాఫ్ సెంచరీలున్నాయి. అతడు చివరిసారిగా వన్డే వరల్డ్‌ప్ 2023లో నెదర్లాండ్స్ మీద సెంచరీ చేశాడు. ఆ మ్యాచ్‌లో అతడు కేవలం 64 బంతుల్లోనే 102 పరుగులు సాధించాడు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ గాయాల కారణంగా వన్డే జట్టుకు దూరమయ్యారు. ఈ నేపథ్యంలో కేఎల్ రాహుల్ దక్షిణాఫ్రికాతో జరుగుతున్న వన్డే సిరీస్‌కు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్నాడు. రాంచీ వేదికగా జరిగిన మొదటి వన్డేలో టీమ్‌ఇండియా 17 పరుగులతో విజయం సాధించింది. రాయ్‌పూర్ వన్డేలో సఫారీల జట్టు 4 వికెట్ల తేడాతో గెలిచింది. సిరీస్ విజేతను నిర్ణయించే కీలకమైన మూడో వన్డే విశాఖపట్నం వేదికగా నేడు (శనివారం) జరగనుంది. దీంతో అభిమానుల్లో ఈ మ్యాచ్‌పై ఆసక్తి నెలకొంది.

# ఫోకస్ సైన్స్


## కమ్యూనికేషన్స్‌లో చైనా విప్లవం



సమాచారాన్ని ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి పంపాలంటే ఒకప్పుడు మనుషులే నడుచుకుంటూ వెళ్లేవారు. దూర ప్రాంతాలకు వెళ్లాలంటే గుర్రాలు లేదా ఎడ్లబండ్లను వాడేవారని తెలుసు. తర్వాతి కాలంలో తంతి–తపాలా వ్యవస్థ అభివృద్ధి చెందింది. ఉత్తరాల ద్వారా సమాచారం అందించేవారు. మోర్స్‌కోడ్ అంబాటులోకి రావడంతో, టెలిగ్రాఫ్ వ్యవస్థ సేవలు ఆరంభమయ్యాయి. టెలిఫోన్, మొబైల్ ఫోన్లతో టెలికమ్యూనికేషన్స్ వ్యవస్థ సమాచార రంగంలో పెను మార్పులు తెచ్చింది. ఇప్పుడు క్వాంటం యుగం నడుస్తున్నది. 20వ శతాబ్దంలో ఐన్‌స్టీన్, హెయిజన్బర్గ్, స్రోడింగర్ వంటి మహానుభావులు క్వాంటం భౌతిక శాస్త్రపు వింతలను మొదట ప్రపంచానికి చెప్పినప్పుడు, నేటి పరిణామాలను వారు కూడా ఊహించక పోయి ఉండవచ్చు. వారి సిద్ధాంతాలే ఇప్పుడు మన రోజువారీ కమ్యూనికేషన్ వ్యవస్థలకు పునాదులగా మారాయి. వేల మైళ్ల దూరానికి సమాచారాన్ని చైనా సెకన్ల వ్యవధిలోనే 'టెలిపోర్ట్' చేసిందనే వార్త ఇప్పుడు యావత్ ప్రపంచాన్ని సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తుతోంది. క్వాంటం ఎంటాంగ్‌మెంట్ ద్వారా ఇది సాధ్యమైంది. చైనా సమాచార విప్లవానికి తెరతీయడంతో, భవిష్యత్తు మరింత ఆసక్తికరంగానూ, మరింత ప్రభావమంతంగానూ మారనుంది. ఈ దిశలో చైనా పరిశోధన ఎందుకు ఇంత ప్రాధాన్యతను సంతరించుకుంది? అనే ప్రశ్న తలెత్తుతుంది. సమాధానం తెలియాలంటే, క్వాంటం ఎంటాంగ్‌మెంట్‌ను అర్థం చేసుకోవాలి. 'రెండు పార్టికల్స్ ఒకసారి ఎంటాంగిల్ అయినా, అవి ఎంత దూరం ఉన్నా ఒకదానికి ఏం చేస్తే మరొకటి వెంటనే స్పందిస్తుంది' అనేది క్వాంటం ఎంటాంగ్‌మెంట్ సిద్ధాంత సూత్రం. ఐన్‌స్టీన్ దీనిని 'సుదూరంలో జరిగే వింత'గా అభివర్ణించాడు. అయితే, క్వాంటం ఎంటాంగ్‌మెంట్ చిన్న దూరాల్లో చేయడం మాత్రమే కొంతమేరకు శాస్త్రవేత్తలకు సాధారణమైంది. కానీ దీన్ని భారీ దూరాల్లో చేయడం దాదాపు అసాధ్యం. ఎందుకంటే పార్టికల్‌లు మధ్యలో ప్రయాణిస్తూ చిన్న చిన్న అంతరాయం వచ్చినా, ఉష్ణం ఎక్కువైనా, ఎక్కడైనా ఏ చిన్న అవాంతరం ఏర్పడినా, అవి ఎంటాంగ్‌మెంట్ కోల్పోతాయి. కానీ, చైనా శాస్త్రవేత్తలు వేల మైళ్ల దూరానికి క్షణాల్లో సమాచారాన్ని పంపడానికి క్వాంటం ఎంటాంగ్‌మెంట్ విధానాన్ని ఉపయోగించడం ఎవరూ ఊహించని ఓ అద్భుతం. ప్రభుత్వ రహస్యాలు, బ్యాంకింగ్ వ్యవస్థలు, ఆరోగ్య సమాచార వనరులు, రక్షణ వ్యవస్థలు, అంతరిక్ష ప్రయోగాలు, గ్లోబల్ రీసెర్చ్ నెట్‌వర్క్‌లు వంటి రంగాల్లో చైనా ప్రయోగం ఎంతగానో ఉపయోగపడుతుంది. దీనివల్ల సమీప భవిష్యత్తులో కొత్త మోడల్ ఫోటాన్ జనరేటర్లు, అధునాతన ఆప్టికల్ ఫైబర్ లైన్లు, తక్కువ క్వాంటం నాయిస్ వాతావరణం, గగనతలం ద్వారా ఎంటాంగ్ల్డ్ ఫోటాన్ పంపే ఉపగ్రహ వ్యవస్థలు (మిస్యూస్ ఉపగ్రహం) వంటివి సాధ్యమవుతాయి. అంతేకాదు, డేటా దొంతనం అనే సమస్య నుంచి ప్రభుత్వాలకు విముక్తి లభిస్తుంది. ప్రపంచ బ్యాంకింగ్ ఖాతాలు పూర్తిగా సురక్షితమవుతాయి. వ్యక్తిగత గోప్యతకు మరింత భద్రత ఏర్పడుతుంది. అంతరిక్ష స్థావరాలు భూమితో నేరుగా క్వాంటం కనెక్షన్‌లో ఉంటాయి. అంతరిక్షం కూడా డాక్యుమెంట్లు పంపడానికి గంటల తరబడి నిరీక్షించాల్సిన అవసరం ఉండదు. హెల్త్ డేటా హ్యాక్ అయ్యి ప్రైవసీ తారుమారయ్యే భయం లేదు. తక్షణ, సురక్షిత డేటా ట్రాన్స్‌ఫర్ అందుబాటులో ఉంటుంది కాబట్టి సైన్స్ పరిశోధనలు ప్రపంచవ్యాప్తంగా వేగంగా జరగతాయి. ఒక్క మాటలో చెప్పాలంటే, క్వాంటం కమ్యూనికేషన్ అడుగులు ఇలాగే ముందుకు పోతే, ఈ గ్రహం కమ్యూనికేషన్ భద్రత విషయంలో కొత్త యుగాన్ని చూసే రోజు దూరంగా లేదు. ఇక్కడి నుంచి భవిష్యత్తు మొదలవుతోంది.

## కొత్త గెలాక్సీ గుర్తింపు

ప్రపంచ ఆరంభ దశలోనే ఏర్పడినట్టు భావిస్తున్న ఒక భారీ స్పైరల్ గెలాక్సీని పుణే పరిశోధకులు ఇటీవల కనుగొన్నారు. దీనికి 'అలక్‌నంద' అనే పేరు ఖాయం చేశారు. విశ్వం కేవలం 1.5 బిలియన్ సంవత్సరాల వయస్సులోనే ఈ గెలాక్సీ పూర్తిగా రూపుదిద్దుకున్నట్టు పరిశోధకులు అంచనా వేస్తున్నారు. ఇప్పటి వరకూ విశ్వం ప్రారంభంలో వేగంగా అభివృద్ధి చెందలేదన్న అభిప్రాయాన్ని ఈ కొత్త ఆవిష్కరణ సవాలు చేస్తున్నది. ప్రారంభ విశ్వం ఊహించినదానికంటే మరింత అభివృద్ధి చెందినదని సూచిస్తోంది. నాసా జేమ్స్‌వెబ్ టెలిస్కోప్ ద్వారా ఎన్‌సిఆర్ఎ–టిఐఎఫ్‌ఆర్‌కు చెందిన రాషి జైన్, యోగేశ్ వాడదేకర్ ఈ గెలాక్సీని గుర్తించారు. ఇది రెడ్‌షిఫ్ట్ 4 వద్ద ఉంది. దాని నుంచి వెలుతురు భూమికి చేరడానికి 12 బిలియన్ సంవత్సరాలకు పైగా పట్టింది. 'అలక్‌నంద' గెలాక్సీలో సూర్యుని భారం కంటే 10 బిలియన్ రెట్లు అధిక భారం ఉన్న నక్షత్రాలు ఉన్నాయి. ఇది ప్రతి సంవత్సరం 63 కొత్త నక్షత్రాలను రూపొందిస్తోంది. అంటే, ఆకాశగంగ రేటు కంటే 20 నుంచి 30 రెట్లు ఎక్కువ. జేమ్స్‌వెబ్ టెలిస్కోప్ ద్వారా విశ్వాన్ని అధ్యయనం చేయకముందు, గెలాక్సీలు అస్తవ్యస్తంగా ఉంటాయని, స్పైరల్ నిర్మాణాలు చాలా ఆలస్యంగా మాత్రమే ఏర్పడతాయని భావించేవారు. కానీ 'అలక్‌నంద' ఈ సిద్ధాంతాలకు విరుద్ధంగా, విశ్వ ఆవిర్భావం మొదటి కొన్ని వందల మిలియన్ సంవత్సరాల్లోనే భారీ డిస్క్, స్పైరల్ భుజాల ఏర్పాటు పూర్తయిన విషయాన్ని స్పష్టం చేస్తున్నది. ఇలాంటి అత్యంత దూరంలో స్పష్టంగా కనబడే స్పైరల్ భుజాలతో ఉన్న గెలాక్సీల్లో 'అలక్‌నంద' ఒక ముఖ్యమైన ఉదాహరణ. గెలాక్సీకి 'అలక్‌నంద' అనే పేరు ఆకాశగంగకు ప్రతీకాత్మక సంబంధం కారణంగా పెట్టారు. ఈ గెలాక్సీ డిస్క్ 'చల్లగా' క్రమబద్ధంగా ఉందా, లేక 'వేడిగా' అల్లకల్లోలంగా ఉందా తెలుసుకోవడానికి మరిన్ని పరిశీలనలు అవసరం.



## రాఘవాపురం ఉపసర్పంచ్‌గా సిపిఐ అభ్యర్థి అబ్బూరి ఏకగ్రీవం





**ప్రజాపక్షం/చింతకాని :** ఖమ్మం జిల్లా చింతకాని మండలం రాఘవాపురం ఉపసర్పంచ్‌గా అబ్బూరి ఉమామహేశ్వరరావు(మహేష్)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాఘవాపురం పంచాయతీ పాలక వర్గం ఏకగ్రీవం కావడంతో శుక్రవారం నూతన పాలకమండలి సమావేశం ఏర్పాటుచేసి ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహించారు. మహేష్‌ను వార్డు సభ్యులంతా ఉపసర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన పాలక మండలిని సిపిఐ ఖమ్మం జిల్లా సహాయకార్యదర్శి జమ్ముల జితేందర్‌రెడ్డి, జిల్లాకార్యవర్గ సభ్యులు కొండపర్తి గోవిందరావు అభినందించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాఘవాపురం సిపిఐ కంచుకోట అని, నూతన పాలకమండలి గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సురేష్, సర్పంచ్ కాంపల్లి కోటమ్మ, ఉపసర్పంచ్ మహేష్, నూతన వార్డు సభ్యులు, సిపిఐ నాయకులు దొబ్బల వెంగళరావు, సింగారపు సత్యనారాయణ, కొల్లి రవికుమార్, కొండపర్తి బాలాజీ, దొబ్బల జగదీష్, తాళ్లూరి నరసయ్య, కొల్లి బాబు, అబ్బూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్టు కార్మికుల కనీస వేతనం

**ఏరియా ఆసుపత్రి ఎదుట ఎఐటియుసి ధర్నా**



**ప్రజాపక్షం/మిర్యాలగూడ :** కార్మికుల సమస్యలపై ప్రభుత్వం దృష్టి సారించకపోవడం దురదృష్టకరమని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి యూనియన్ గౌరవఅధ్యక్షుడు, ఎఐటియుసి నల్లగొండ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి.సయాద్ అన్నారు. ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ కార్మికుల దీర్ఘకాలిక సమస్యలపై రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం ఆసుపత్రి ఎదుట కార్మికలతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల టెండర్ కాలపరిమితి ముగిసి రెండు నెలలు గడుస్తున్నా నేటికి టెండర్ పిలవకపోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. ప్రభుత్వం నెలల తరబడి కాలయాపన చేస్తూ సమస్యను జఠిలం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా నాలుగు పండుగలు, నాలుగు ఆర్జిత, 20రోజులకు ఒకరోజు వేతనంతో కూడిన ఆర్జిత సెలవును లేబర్ చట్టం ప్రకారం ఇవ్వాలన్నారు. ప్రతినెలా వేతనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మిక చట్టాలను పాటించాలని గుత్తేదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఉట్కూరి శ్రీను, కార్మికులు జానకిరాములు, శాంతమ్మ, పర్వీన్, మంగమ్మ, ఝాన్సీ, ఏడుకొండలు, శ్రవణ్, జాని తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్ధే సిపిఐ లక్ష్యం

**బాగం హేమంతరావు**



**ప్రజాపక్షం/మధిర :** గ్రామాల అభివృద్ధే కమ్యూనిస్టుల ఏకైక లక్ష్యమని, మల్లారం గ్రామాభివృద్ధే సిపిఐ లక్ష్యమని, ప్రజలు ఇచ్చే విశ్వాసం, మద్దతుతో గ్రామ సమస్యల పరిష్కారానికి మందడపు రాణి కృషి చేస్తుందని సిపిఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు అన్నారు. కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సిపిఐ సర్పంచ్ అభ్యర్థి మందడపు రాణి విజయాన్ని కాంక్షిస్తూ శుక్రవారం సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండు సురేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు బెజవాడ రవిబాబుతో కలిసి హేమంతరావు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం మందడపు రాణికి ఒక్క అవకాశం గ్రామ ప్రజలు ఇవ్వాలని కోరారు. ఇక్కడ సిపిఐ గెలిస్తేనే కాంగ్రెస్ భాగస్వామ్యంతో గ్రామాభివృద్ధికి బాటలు పడతాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కరివేద రాంబాబు, మహిళా కాంగ్రెస్ మధిర మండల అధ్యక్షురాలు దుర్గభవాని, కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షులు కొంగర వెంకటేశ్వరరావు, సిపిఐ గ్రామశాఖ కార్యదర్శి పరుచూరి రాము, మచ్చ వెంకటేశ్వరరావు, నలమల శేఖర్, కొంగర రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**యాదగిరిగుట్ట :** గ్రామ సర్పంచ్ ఎన్నికలలో భాగంగా శుక్రవారం యాదాద్రి జిల్లా యాదగిరిగుట్ట మండలం మర్రిగూడెం గ్రామంలో ఎన్నికల ప్రచార కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు. మర్రిగూడ అభివృద్ధి కొరకు ప్రజా సంక్షేమం కొరకు సిపిఐ అభ్యర్థి స్వప్న జగన్‌ను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్, హరిచంద్ర, పెరబోయిన మహేందర్, యాదగిరిగుట్ట మున్సిపల్ కార్యదర్శి బబ్బూరి శ్రీధర్, శాఖ కార్యదర్శి స్వామి, లక్ష్మి, కిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

**చెన్నారావుపేట :** సిపిఐ అభ్యర్థిని గెలిపించాలని సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా అన్నారు. శుక్రవారం వరంగల్ జిల్లా చెన్నారావుపేట మేజర్ గ్రామ పంచాయతీకి సిపిఐ బలపరిచిన సర్పంచ్ అభ్యర్థిగా పత్తి భానుశ్రీ, ఐదవ వార్డు మెంబర్‌గా పత్తి అనంతరెడ్డి నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డబ్బు, మద్యం పంపిణీ చేసి ఎన్నికలలో గెలవాలనుకునే వారిని ప్రజలు తిరస్కరించి, నిజాయితీ పరులకు పట్టం కట్టాలని కోరారు. ప్రజాసమస్యలపై పోరాడుతూ ప్రజల గొంతుకగా నిలిచిన సిపిఐ అభ్యర్థులను పంచాయతీ ఎన్నికలలో ఎన్నుకోవాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు పంజాల రమేష్, వరంగల్ జిల్లా సమితి సభ్యులు పార్థసారథి, నాయకులు అల్ప సత్తయ్య, మండల నర్సయ్య, జక్కుల కృష్ణయ్య, చందు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



**భారీ ర్యాలీతో సిపిఐ అభ్యర్థి రంగారెడ్డి నామినేషన్**

**దేవరకొండ :** నల్లగొండ జిల్లా దేవరకొండ మండలం పడమటిపల్లి గ్రామంలో కాంగ్రెస్‌పార్టీ బలపరిచిన సిపిఐ సర్పంచ్ అభ్యర్థిగా పల్లా రంగారెడ్డి శుక్రవారం నామినేషన్ వేశారు. ఆయనతో పాటు వార్డుసభ్యుల విజయాన్ని కాంక్షిస్తూ తరలివచ్చిన సిపిఐ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలో అమర వీరుల స్థూపానికి నివాళులర్పించి భారీర్యాలీతో వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహా, ఎఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షులు వలమల్ల ఆంజనేయులు, కిన్నెర యాదయ్య, గోవర్ధన్, కాంగ్రెస్ నాయకులు రవీందర్‌రెడ్డి, భూపతి రెడ్డి, వెంకటయ్య, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.





## పొన్నం శ్రీకాంత్, సురేందర్‌రెడ్డికి నివాళి






**కుటుంబసభ్యులకు చాడ పరామర్శ**

**ప్రజాపక్షం/కరీంనగర్ :** పొన్నం శ్రీకాంత్, బండ సురేందర్‌రెడ్డిల మృతి బాధాకరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కరీంనగర్ నగరంలోని రేకుర్తి, హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న శ్రీకాంత్, సురేందర్‌రెడ్డిల నివాసాలకు వెళ్లి కుటుంబసభ్యులను పరామర్శించారు. శ్రీకాంత్, సురేందర్ రెడ్డిల చిత్రపటాలకు నివాళులర్పించి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. గ్రంథాలయ మాజీ చైర్మన్ పొన్నం అనిల్ సోదరుడు శ్రీకాంత్ చిన్నవయసులోనే ప్రమాదంలో మరణించడం దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండ సురేందర్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందడం వామపక్ష ఉద్యమానికి తీరని లోటన్నారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శిగా ఉన్నప్పుడు ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన అనేక పోరాటాల్లో సురేందర్‌రెడ్డి తనతో కలిసి పనిచేశారని గుర్తుచేసుకున్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యులు పైడిపల్లి రాజు, బూడిద సదాశివ, మాజీసర్పంచ్ జెవి రమణారెడ్డి పాల్గొన్నారు.

## సిఆర్ ఫౌండేషన్‌లో వైద్యశిబిరం

**ప్రారంభించిన సంస్థ చైర్మన్ నారాయణ**

**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** సిఆర్ హోమ్ ఫర్ ది ఏజ్డ్ (వృద్ధాశ్రమం)లో సీనియర్ సిటిజన్ల కోసం ఆర్థోపెడిక్ వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఆర్ ఫౌండేషన్ గౌరవ చైర్మన్ డాక్టర్ కె.నారాయణ, కోశాధికారి, హోమ్ డైరెక్టర్ వి.చెన్నకేశవరావు, హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రజనీ, కిమ్స్ హాస్పిటల్స్ ఆర్థో విభాగాధిపతి డాక్టర్ అన్నే సాయిలక్ష్మణ్, రోబోటిక్ సర్జన్ డాక్టర్ టి.మోహిత్, ఎంఎస్ (ఆర్థో) డాక్టర్ అనూష వైద్య శిబిరంలో పాల్గొన్నారు. వైద్య శిబిరాన్ని సిఆర్ పాలీ క్లినిక్ డైరెక్టర్ డాక్టర్ రజనీ ప్రారంబించగా, సిఒఒ కె.విజయ పర్యవేక్షణలో సిఆర్ ఫౌండేషన్ ఆశ్రమవాసులకు, సిబ్బందికి వైద్యసేవలు అందించారు. అనంతరం సిఆర్ ఫౌండేషన్ గౌరవ చైర్మన్ నారాయణ మాట్లాడుతూ సిఆర్ ఫౌండేషన్‌లో ఉన్న దాదాపు 72 మందికి ఎముక సాంద్రత పరీక్షలు, వైద్య సేవలు, డాక్టర్ సంప్రదింపులు నిర్వహించారని, ఆశ్రమవాసులకు సేవలందించినందుకు డాక్టర్ల బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. హెల్త్ డైరెక్టర్ డాక్టర్ రజనీ మాట్లాడుతూ హెల్త్ శిబిరం విజయవంతం కావడానికి సహాయం చేసిన సిబ్బందికి, వాలంటీర్లకు ధన్యవాదాలు తెలిపారు.





# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## నిర్ణీత సమయానికి సిసి రోడ్డు పనులు పూర్తి



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ఎలాంటి జాప్యం లేకుండా సిసి రోడ్డు పనులు నిర్ణీత సమయానికి పూర్తి చేయాలని మౌలాలి కార్పొరేటర్ సునీత శేఖర్ యాదవ్ సూచించారు. డివిజన్‌లోని దీన దయాళ్ నగర్ ప్రాంతంలో శుక్రవారం రూ. 98 లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు పనులను ప్రారంభించారు. పనులు జాప్యం అయితే ఈ ప్రాంతంలో సంచరించే ప్రయాణీకులు, వాహనదారులు ఇబ్బందులకు గురవుతుంటారని, అదే విధంగా నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నేతలు వాసుదేవరావు, గున్నాల చంద్రశేఖర్ యాదవ్, రాజమౌళి, రుషి మాధవ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



## అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు కృషి

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి :** ప్రజా అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నామని టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ అన్నారు. శుక్రవారం కెపిహెచ్‌బి 114 డివిజన్ పరిధిలోని గోపాల్ నగర్‌లో రూ.80లక్షలతో నూతనంగా నిర్మించనున్న బిటి రోడ్డు పనులకు బండి రమేష్ ముఖ్య అతిథిగా హాజరై స్థానిక నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు పనులలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ, త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌కు సూచించారు. రోడ్డు వెడల్పుతో పాటు ఇరువైపులా ఫుట్‌పాత్ నిర్మాణం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం ఇస్తున్న నిధులను దుర్వినియోగం చేయకుండా సద్వినియోగం చేయాలని, అవినీతికి పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గోపాల్ నగర్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని, మరెన్నో నిధులు తీసుకొచ్చి మరింత అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులు దీర్ఘకాలం మన్నికతో ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ ప్రవీణ్, యువ నాయకులు శివ చౌదరి, మాజీ ఎఎంసి చైర్మన్ రామకృష్ణ, బి బ్లాక్ మహిళా ప్రెసిడెంట్ సంధ్య, సీనియర్ నాయకులు కొప్పిశెట్టి దినేష్, గంధం రాజు, ఫణీంద్ర, తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి పనులలో ముందడుగు

### ఎమ్మెల్యే కెపి వివేకానంద

**ప్రజాపక్షం/నిజాంపేట్ :** ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి పనులను ముందుకు తీసుకువెళ్లాలని బిఆర్ఎస్ ఎల్పీ విప్, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కెపి వివేకానంద అన్నారు. కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిల్ మున్సిపల్ కార్యాలయంలో అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే వివేక్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివేక్ మాట్లాడుతూ గాజులరామారం సర్కిల్ పరిధిలోని వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం పది కోట్ల రూపాయలు మంజూరు కాగా కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని పలు కాలనీలలో మూడున్నర కోట్ల రూపాయలు మంజూరయ్యాయని తెలిపారు. జంట మున్సిపల్ సర్కిళ్ల పరిధిలోని పలు కాలనీలలో చేపట్టే రోడ్లు, స్మశాన వాటికల అభివృద్ధి పనులు, పార్కుల అభివృద్ధి తదితర పనులకుగాను ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు. మంజూరైన నిధులతో నూతనంగా చేపట్టనున్న అభివృద్ధి పనుల్లో ప్రజలను భాగస్వామ్యం చేయాలని అధికారులకు సూచించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అన్నారు. సమావేశంలో గాజులరామారం సర్కిల్ ఉపకమిషనర్ మల్లారెడ్డి, కార్పొరేటర్‌లు జగన్, సత్యనారాయణ, మాజీ కార్పొరేటర్ సురేశ్ రెడ్డి, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



## దుర్గమ్మను దర్శించుకున్న భారతి నాయక్

**ప్రజాపక్షం/పాపన్నపేట :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన ఏడుపాయల దుర్గా భవాని అమ్మవారి సాధారణ పరిశీలకులు భారతి లక్పతి నాయక్ దర్శించుకున్నారు. శుక్రవారం ఏడుపాయల క్షేత్రానికి చేరుకోగానే వేద పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. ఏడుపాయల గర్భ గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం పండితులు ఆలయ మర్యాదలు చేసి, తీర్థ ప్రసాదాలు అందించారు.ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్‌డిఒ రమాదేవి, ఆలయ కార్య నిర్వాహకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## ప్రయాణికుల సౌకర్యార్థం బస్ షెల్టర్లు

**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** ప్రయాణీకుల సౌకర్యార్థం అవసరమైన ప్రాంతాల్లో బస్ షెల్టర్లు ఏర్పాటు చేస్తున్నామని హకీంపేట ఆర్టీసీ మేనేజర్ భవభూతి తెలిపారు. ఆల్వాల్ డివిజన్ రాజీవ్ ప్రధాన రహదారిలోని సత్యం పెట్రోల్ పంపు పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన బస్ షెల్టర్‌ను ట్రాఫిక్ విభాగ ఎసిపి శంకర్‌రాజు, లాల్‌బజార్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సర్దార్ నాయక్‌లతో కల్సి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి రోజు రాజీవ్ రహదారి మీదుగా కరీంనగర్, సిద్ధిపేట, ఆసిఫాబాద్ తదితర జిల్లాలతో పాటు నగర శివార్లు, నగరంలోని వివిధ ప్రాంత రాకపోకలకు గాను ఆర్‌టిసి బస్సులతో పాటు పలు వాహనాలు తిరుగుతుంటాయని, ప్రయాణీకుల, ఆర్‌టిసి బస్సు ప్రయాణీకుల అవసరాల మేరకు బస్ షెల్టర్‌లు ఏర్పాటయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో జిహెచ్‌ఎంసి అధికారులు పాల్గొన్నారు.

# రూ.3,862.8 కోట్ల ఆదాయం

### ముగిసిన హెచ్‌ఎండిఎ భూ వేలం



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ(హెచ్‌ఎండిఎ) తాజాగా భూ వేలం పాటలను విజయవంతంగా ముగించింది. భూముల మానిటైజేషన్ కార్యక్రమంలో ముఖ్యమైన మైలు రాయిగా నిలిచింది. 1.98 ఎకరాల గోల్డెన్ మైల్ భూమిని కోయస్ ఎడ్యుకేషన్ మేనేజ్‌మెంట్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఎకరాకు రూ. 77.75కోట్లు చొప్పున సొంతం చేసుకుంది. ప్రత్యేక ఆకారంలో ఉన్న ఈ స్థలం కోసం వచ్చిన స్పందన మరింత ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఈ ఫలితంతో హెచ్‌ఎండిఎ ఇప్పటివరకు నిర్వహించిన మొత్తం వేలంపాటల ద్వారా వచ్చిన ఆదాయం రూ.3,862.8 కోట్లకు చేరింది.

మెట్రోపాలిటన్ ప్రాంతంలో అభివృద్ధి అవకాశాలున్న ప్రీమియం లొకేషన్‌లకు మార్కెట్‌లో ఉన్న భారీ డిమాండ్‌ను ఈ వేలంపాటలు మళ్లీ నిరూపించాయి. వేలంపాటల నిర్వహణలో ట్రాన్సాక్షన్ అడ్వైజర్‌గా కుష్మన్, వేక్‌ఫీల్డ్ అలాగే ఎంఎస్‌టిసి ఈ– వేలంపాట ప్లాట్‌ఫారం కీలకపాత్ర పోషించాయి. వీరి సహకారంతో మొత్తం వేలంపాట ప్రక్రియ పారదర్శకంగా, పోటీతో, సమర్థవంతంగా సాగిందని అధికారులు వెల్లడించారు.

ఈ విజయాలు హైదరాబాద్‌ను దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన రియల్ ఎస్టేట్ పెట్టుబడి గమ్యస్థానంగా మరింత బలోపేతం చేశాయని తెలిపారు.

## నగరం నడిబొడ్డున గంజాయి పెంపకం

### ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడి : ఇద్దరి అరెస్ట్



**ప్రజాపక్షం/హైదరాబాద్:**హైదరాబాద్ నగరం నడిబొడ్డులో గంజాయి మొక్కలను పెంచుతున్న ఉదంతం కలకలం రేపింది. మలక్‌పేట పోలీసు స్టేషన్ పరిధిలోని ఒక భవనం టెర్రస్‌పై బీహార్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు గంజాయి మొక్కలను పెంచుతున్నారు. ఈ మేరకు సమాచారం అందుకున్న హైదరాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది శుక్రవారం దాడి చేయడంతో ఈ వ్యవహారం వెలుగు చూసింది. మలక్‌పేట్‌లోని మహబూబ్ మెన్షన్ మార్కెట్ సమీపంలో టెర్రస్ లో బీహార్ కు చెందినటువంటి లవకుశ, బీమ్లేష్ అనే ఇద్దరు అద్దెకు ఉంటున్నారు. టెర్రస్‌పై గత ఆరు నెలలుగా గంజాయి మొక్కలను పెంచుతూ వాటిని ఏపుగా పెరిగిన అనంతరం గంజాయిగా మార్చి అమ్మకాలు జరుపుతూ సొమ్ము చేసుకుంటున్నారు. టెర్రస్ పై గంజాయి మొక్కలు పెంచుతున్నారనే సమాచారం అందుకున్నటువంటి హైదరాబాద్ ఎన్ఫోర్స్మెంట్ సిఐ చంద్రశేఖర్ గౌడ్ ఎస్ఐ శ్రీనివాస్ సిబ్బంది కలిసి టెర్రస్‌పై దాడి నిర్వహించారు.ఈ దాడిలో మూడు నుంచి 6మీటర్ల ఎత్తులో పెరిగినటువంటి ఐదు గంజాయి మొక్కలను స్వాధీ నం చేసుకున్నారు. మూడు నుంచి 6 మీటర్ల ఎత్తులో పెరిగినటువంటి ఐదు గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకున్నారు. గంజాయి మొక్కలతో పాటు 55 గ్రాముల ఎండు గంజాయి, రెండు సెల్‌ఫోన్‌ల తో పాటు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ గంజాయి చెట్ల నుంచి సుమారు 10 కిలోల గంజాయి దిగుబడిగా వచ్చే అవకాశా లు ఉన్నాయని ఎన్‌ఫోర్స్‌మెంట్ టీం అంచనాలు వేశారు. నిందితులను గంజాయి మొక్కలను కాచిగూడ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు సిఐ చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు.

## సికింద్రాబాద్ – సిద్దిపేట సెక్షన్ తనిఖీ చేసిన సంజయ్ కుమార్ శ్రీవాస్తవ



**ప్రజాపక్షం/హైదరాబాద్:**సికింద్రాబాద్ నుంచి సిద్దిపేట సెక్షన్ వరకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ శుక్రవారం తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీలో ఆయనతో పాటు జోన్, డివిజన్‌కు చెందిన సీనియర్ రైల్వే అధికారులు కూడా ఉన్నారు. సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సికింద్రాబాద్ సిద్దిపేట సెక్షన్‌లో రియర్ విండో తనిఖీ సందర్భంగా ట్రాక్‌లు, వంతెన లు, సిగ్నలింగ్ వ్యవస్థల భద్రతా అంశాలను సమీక్షించారు. ఈ విభాగంలోని కొన్ని ముఖ్యమైన రైల్వే స్టేషన్‌లను పరిశీలించారు. కొమురవెల్లి మల్లన్న స్వామి భక్తులకు రైలు అనుసంధానాన్ని సులభతరం చేయడానికి మనోహరాబాద్ కొత్తపల్లి నూతన బ్రాడ్ గేజ్ లైన్‌లోని రాబోయే హాల్ట్ స్టేషన్ అయిన కొమురవెల్లి రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పనులను జనరల్ మేనేజర్ పరిశీలించారు. జనరల్ మేనేజర్ కొత్త స్టేషన్ భవనం పనులను సమీక్షించి, ప్రాజెక్టును నిర్ణీత లక్ష్యంలోగా పూర్తి చేయడానికి పనులను మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. తరువాత జనరల్ మేనేజర్ సిద్దిపేట రైల్వే స్టేషన్‌ను క్షుణ్ణంగా చేసిన తనిఖీలో, ప్రయాణీకుల సౌకర్యాలను సమీక్షించారు మరియు స్టేషన్ మాస్టర్ కార్యాలయం, సర్క్యులేటింగ్ ప్రాంతం మరియు రిలే గదిని పరిశీలించారు. సంజయ్ కుమార్ శ్రీవాస్తవ సిద్దిపేట సిరిసిల్ల మధ్య జరుగుతున్న కొత్త రైల్వే లైన్ పనుల పరిశీలనలో, ట్రాక్‌లు, వంతెనలు, సిగ్నలింగ్ వ్యవస్థల భద్రతా అంశాలను సమీక్షించారు.

## కారులో రూ.4కోట్ల హవాలా మనీ..

**ప్రజాపక్షం/హైదరాబాద్:** పుష్ప సినిమా స్టైల్లో హవాలా డబ్బు రవాణా చేస్తున్న ముఠాను హైదరాబాద్ బోయినన్‌పల్లి పోలీసులు పట్టుకున్నారు. కారులో భారీగా నగదు తరలిస్తున్నారని తెలుసుకొని బోయిన్ పల్లి నుంచి శామీర్పేట్ వరకు పోలీసులు కారులో ఛేజ్ చేశారు. కారు తెరిచి చూడగా డిక్కీ, టైర్లు, బానెట్, సీట్లలో దాచిన రూ.4 కోట్లు కనిపించాయి. గతేడాది హవాలా డబ్బుతో పరారైన వ్యక్తి శుక్రవారం నిజామాబాద్ నుంచి హైదరాబాద్ వస్తున్న ట్లు తెలియడంతో పోలీసులు నిఘా పెట్టి పట్టుకున్నారు.



## ఘంటసాల స్వరం... దేవుడిచ్చిన వరం

### పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ



**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** ఘంటసాల స్వరం దేవుడిచ్చిన వరం అని పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. శుక్రవారం సీనియర్ పాత్రికేయులు బి.వెంకటేశ్వర్లు తల్లి బి.కృష్ణమ్మ స్మృత్యర్థం, ఘంటసాల వెంకటేశ్వరరావు 103వ జయంతి వేడుకలు కూకట్‌పల్లి ప్రెకాస స్టూడియోలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పిఎసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ విచ్చేసి ఘంటసాల చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం కళ పత్రిక ప్రత్యేక సంచికను గాంధీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగునేల ఉన్నంత కాలం ప్రతి ఇంట, ప్రతి వేదిక, ప్రతి గుడిలో ఘంటసాల పాటలు మారుమ్రోగుతూనే ఉంటాయన్నారు. నిజాయితీ నిబద్ధత కలిగిన పాత్రికేయ శిరోమణి వెంకటేశ్వర్లు అని, ఆయన గాయకుడిగా కూడా గుర్తింపు పొందడం అభినందనీయమని అన్నారు. సినీ నేపథ్య గాయకు డు, సినీ మ్యూజిషియన్స్ అసో సియేషన్ ప్రధాన కార్యదర్శి రవివర్మ మాట్లాడుతూ ఘంటసాల పాటలు ఎన్నిసార్లు విన్నా తనివితీరదని, ఘంటసాల పాడిన పాటలు పాడుతూ ఎందరో గాయకులు ఉపాధి పొందుతున్నారని గుర్తు చేశారు. కళ ప్రతిక సంపాదకులు డాక్టర్ మహ్మద్ రఫీ మాట్లాడుతూ ఘంటసాల అమర గాయకుడని, ఇన్నేళ్లు అయిన ఘంటసాల స్వరాన్ని మించిన స్వరం మరొకటి రాలేదన్నారు. తెలంగాణలో మూడు దశాబ్దాల పాత్రికేయుడిగా తనదైన గుర్తింపు పొంది మంచికి మారుపేరుగా నిలిచిన జర్నలిస్ట్ వెంకటేశ్వర్లు సేవలను గుర్తించి కళ పత్రిక ప్రత్యేక సంచిక విడుదల చేసినట్లు తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సమితి మీడి యా సెల్ రాష్ట్ర అధ్యక్షులు బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తనకు జర్నలిజం, గానం రెండు ప్రాణమని అన్నారు. ఘంటసాల, బాలు పాటలు ఇష్టమని, అందుకే ప్రత్యేక సమయం కేటాయించి సంగీత విభావరి నిర్వహించనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎసిపి కడారు వెంకటరెడ్డి, ఎసిపి వేముల భాస్కర్, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆస్కారి మారుతి సాగర్, సాంఘీక సంక్షేమ శాఖ స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఉప్పు సత్యనారాయణ, బిసి సంక్షేమ శాఖ సంఘం నేత తేళ్ల హరికృష్ణ తదితరులు పాల్గొని ఘంటసాలకు, బి.కృష్ణమ్మకు నివాళులు అర్పించారు.

అనంతరం ప్రెకాస నిర్వాహకులు సబిత మట్ల, ప్రేమ్ కుమార్ ఆధ్వర్యంలో గాయకులు రవి వర్మ, బి.వెంటకేశ్వర్లు, లాలయ్య, పి.శ్రీనివాస రావు, రాధికాశర్మ తదితర 20మంది గాయకులతో ఎనిమిది గంటల పాటు జరిగిన ఘంటసాల పాటల విభావరి అలరించింది.

## గ్రామాల ప్రగతికి కృషి చేయండి

### ఏకగ్రీవ సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లకు శుభాకాంక్షలు తెలిపిన ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/తాండూరు:**గ్రామాల ప్రగతికి బాధ్యతగా కృషి చేయాలని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. తాండూరు నియోజకవర్గంలో 25 గ్రామ పంచాయతీలలో సర్పంచ్‌లతో పాటు ఉపసర్పంచ్‌లు ఏకగ్రీవమైన సంగతి తెలసిందే. ఈ సందర్భంగా ఏకగ్రీవమైన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డికి మర్యాద పూర్వకం గా కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్పంచ్‌లు ఎన్నికైన అభ్యర్థులు గ్రామాల అభివృద్ధికి తోడ్పడాలని అన్నారు. గత రెండు సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసిన ప్రజలు కాంగ్రెస్ వైపు మొగ్గుచూపుతున్నారని అన్నా రు. నేడు తాండూరు నియోజకవర్గంలో 25గ్రామ పంచాయతీ లు ఏకగ్రీవం అయ్యాయంటే ప్రభుత్వం చేపట్టిన సక్షేమ కార్యక్రమాలే నిదర్శనమన్నారు. ఈనెల 11న జరిగే పంచాయతీ ఎన్నికల్లో అత్యాధిక స్థానాలను కాంగ్రెస్ బలపర్చి న అభ్యర్థులే గెలుపొందడం ఖాయమన్నారు. గ్రామాలను ప్రగతి పథంలో నడిపించేందుకు కృషి చేయాలని అన్నారు. అభివృద్ధి సంక్షేమంలో తమ వంతు సహకారం అందజేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి చైర్మన్ పట్లోళ బాల్‌రెడ్డి, డిసిసి అధ్యక్షులు ధారాసింగ్ నాయక్, నాయకులు , ఏకగ్రీవమైన సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు నేతలు పాల్గొన్నారు.



## ప్రజా పోరాటాలు చేసే పార్టీ కేవలం సిపిఐ మాత్రమే : ఉమా మహేష్

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** అధికారంకోసం పాకులాడకుండా ప్రజల సంక్షేమం, హక్కుల కోసం పోరాటం చేసే పార్టీ కేవలం సిపిఐ మాత్రమే అని పార్టీ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ తెలిపారు. శుక్రవారం యాప్రాల్‌లోని సిపిఐ కార్యాలయం ఎఆర్ దేవరాజ్ భవనం మొదటి అంతస్తు నిర్మాణ పనులను ఆయన పూజలుచేసి ప్రారంభించారు. వందేళ్ల చరిత్ర కలిగిన పార్టీ అనేక ప్రాంతాల్లో పోరాటం ద్వారా ఇళ్లు లేని పేద కుటుంబీకులకు ఇళ్ల స్థలాలను ఇప్పించిన ఘనత ఉందన్నారు. ఇదే తరహా పోరాటంతో భరత్‌నగర్ ప్రాంత వాసులకు సైతం ఇళ్ల స్థలాలను సిపిఐ ఇప్పించిందన్న విషయాన్ని ఆయన గుర్తు చేసారు. ప్రజల సమస్యల కోసం పార్టీ కార్యకర్తలు కమ్యూనిస్టు సిద్ధాంతాలకు అనుగుణంగా కృషి చేయటం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఆల్వాల్ మండల కార్యదర్శి అమరావతి బాబు, సహాయ కార్యదర్శి వెంకటేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు డి.జంగయ్య, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు సల్మాన్‌బేగ్, తోటపల్లి శంకర్, నక్క వెంకటేష్, పద్మ, తదితరులు పాల్గొన్నారు.



## జోయాలుక్కాస్‌లో బ్రిల్లియన్స్ డైమండ్ జ్యూవెలరీ షో

**ప్రజాపక్షం/చర్లపల్లి:** వజ్రాల అభరణాల శాశ్వత ఆకర్షణకు, డిజైన్‌లో పరిపూర్ణత పట్ల మనకున్న మక్కువకు చిహ్నమని జోయాలుక్కాస్ గ్రూప్ చైర్మన్ డాక్టర్ జోయాలుక్కాస్ అన్నారు. శుక్రవారం ఏఎస్ రావు నగర్ డివిజన్ పరిధిలోని జోయాలుకాస్ షోరూమ్‌లో బ్రిల్లియన్స్ డైమండ్ జ్యూవెలరీని ప్రారంభించారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మా ప్రయాణంలో ఏఎస్ రావు నగర్ షోరూమ్‌కు ప్రత్యేక స్థానం ఉందని, ప్రదర్శన కాలంలో రూ 1 లక్ష అంతకంటే ఎక్కువ విలువైన వజ్రాభణాలు ప్రతి కొనుగోలుతో ఉచిత బంగారు నాణెం అందిస్తామని తెలిపారు. బ్రిల్లియన్స్ డైమండ్ జ్యూవెలరీ షో డిసెంబర్ 21 వరకు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గ్లోబల్ ఐ హాస్పిటల్ వారి సౌజన్యంతో రేపు ఉచిత కంటి వైద్య శిబిరం

**ప్రజాపక్షం/కూకట్‌పల్లి:** మైత్రి కన్‌స్ట్రక్షన్స్ ఎండి, సీనియర్ జర్నలిస్ట్ దాసరి రాహుల్ ప్రదీప్ ఆధ్వర్యంలో దాసరి శ్రీనివాస్ రావు మైనేని ప్రసన్న జ్ఞాపకార్థం అమ్మ నాన్నలకు ప్రేమతో 25వ శనివారం ప్రత్యేక సేవా కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రతీ శనివారం ప్రేమతో, సేవాభావంతో కొనసాగుతున్న అన్న సమారాధన కార్యక్రమంలో భాగంగా ఈ 25వ శనివారం కార్యక్రమాన్ని నేడు ప్రజల కంటి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని గ్లోబల్ ఐ హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నారు. ఈ శిబిరంలో సమగ్ర కంటి పరీక్షలు, గ్లాకోమా, కంటి చూపు తగ్గుదల వంటి సమస్యలు, వివిధ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రాహుల్ ప్రదీన్ దాసరి ఓ ప్రకటనలో తెలిపారు.



## ఉద్యాన, పట్టు పరిశ్రమ పంటల పరిశీలన

**ప్రజాపక్షం/వికారాబాద్:**ఉద్యాన, పుట్ట పరిశ్రమలను పరిశీలించిన, పట్టు పరిశ్రమలశాఖ సంచాలకులు యాస్మిన్ బాషా, వికారాబాద్ జిల్లాలో క్షేత్రపర్యటన నిర్వహించారు. ఈ పర్యటనలో భాగంగా,వికారాబాద్ మండలంలోని ఆలంపల్లి, నారాయణపూర్, పులుమద్ది గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా అలంపల్లి గ్రామం 12.5ఎకరాలలో అయిల్ ఫామ్ పంట సాగిస్తున్న, రైతు మేకల చంద్ర శేఖర్‌రెడ్డి పంట పొలాన్ని సందర్శించారు. పంట సంరక్షణ,నిర్వహణపై రైతులకి సూచనలు, సలహాలు ఇచ్చారు. నారాయణపూర్ గ్రామంలోని ప్రైవేట్ కూరగాయ నర్సరీలను సందర్శించి, రైతులకు నాణ్యమైన కూరగాయ నారును సరఫరా చేయలని సూచించారు. పులమద్ది గ్రామం బంద్‌ఆలి సాగు చేస్తున్న బంతి పూలతోట, డ్రాగన్ ఫ్రూట్, చామగడ్డ పంటలు సాగిస్తున్న నరసింహారెడ్డి పంటపొలాలను పరిశీలించారు. పంట రక్షణపై రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమలశాఖ అధికారి సత్తార్, ఉద్యోగి యమున, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వామి పడిపూజలో మాజీ ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఆధ్వర్యాన గురువారం రాత్రి తన నివాసంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి పడి పూజ అంగరంగ వైభవంగా జరిగింది. అత్యంత శాస్త్రోక్తంగా నియమనిష్టలతో నిర్వహించిన అయ్యప్ప స్వామి పడిపూజకు వందలాదిగా అయ్యప్ప స్వామి భక్తులు తరలివచ్చారు. భజనలు, సంకీర్తనలతో అక్కడి వాతావరణ కన్నుల పండువగా మారింది. ఈ సందర్భంగా పైలెట్ రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ అయ్యప్ప స్వామి ఆశీస్సులతో తాండూరు ప్రజలు సుభిక్షంగా ఉండాలని, శాంతి సౌభాగ్యాలు వెల్లివిరియాలంటూ స్వామి వారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, పలు సంఘాల ప్రతినిధులు, వివిధ గ్రామాల ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ఆదర్శ గ్రామంగా అభివృద్ధి చేస్తా..



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** ఆదర్శగ్రామంగా అభివృద్ధి చేస్తా.. అశీర్వదించాలని సర్పంచ్ అభ్యర్థి విఠ్యాల మంజుల నరసింహా ప్రచారం చేశారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కిషన్‌నగర్ గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి విఠ్యాల మంజుల నరసింహా గ్రామస్తులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. తనకు అవకాశం ఇస్తే పంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. విద్యాపరంగా చదువుకున్న వ్యక్తులకు రాజకీయాల్లో అవకాశం ఇస్తే పల్లె సీమలు అభివృద్ధి సాధించేందుకు అవకాశం ఉంటుందన్నారు. యువతను రాజకీయాల్లో రాణించేందుకు ఓటర్లు ప్రోత్సహించాలని ఓటర్లను అభ్యర్థించారు. హ్యాండ్ బ్యాగ్ గుర్తుకు వేసి గెలిపించాలని ఓటర్లును కోరారు.

## 7న ఇందిరాపార్కు వద్ద మహాధర్నా
### కార్పొరేటర్ లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** ఇందిరా పార్కు వద్ద బిజెపి ఆధ్వర్యంలో 7న నిర్వహించే మహాధర్నా విజయవంతం చేయాలని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం పార్టీ ముఖ్యనాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్ అధ్యక్షులు విష్ణువర్ధన్ రావు, రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షురాలు నందికొండ గీతారెడ్డి, నాయకులు రఘురాంనేత, శంకరయ్యగౌడ్, భూపాల్‌రెడ్డి, శ్రీధర్‌రావు, ప్రేమ్‌నాథ్, జైపాల్‌రెడ్డి, రవిశంకర్, మహేష్‌గౌడ్ పాల్గొన్నారు.

## వ్యవసాయ సదస్సులో శ్రీనివాస్‌రెడ్డి




**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్:** కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన వ్యవసాయ, రైతు సంక్షేమపై కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అధ్యక్షతన నిర్వహించిన రైతు సదస్సులో రంగారెడ్డి జిల్లా బిజెపి అర్బన్ అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఉసమావేశంలో రైతు అనుసరిస్తున్న వృత్తి పంటలపై అనేక సూచనలు చేపట్టారు. డ్రాగన్ ఫ్రూట్‌తో పాటు రైతులకు భూమి నేల అనుకూలత, నీట నిర్వహణ, వ్యాధినియంత్రణ, నాణ్యత పరిమాణాలు మెరుగుదల, మార్కెటింగ్ మొదలు సమస్యలపై చర్చలు జరిగాయని శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

## ఇన్‌ఫ్రాంట్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ



**ప్రజాపక్షం/శంషాబాద్:** హైదరాబాద్ ఎడ్యుకేషనల్ సొసైటీ (హేస్) నిర్వహించిన 14వ వార్షిక టాలెంట్ ఫెస్టివల్‌లో శంషాబాద్ ఇన్‌ఫ్రాంట్ ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు అద్భుత ప్రదర్శన కనబరిచారు. సాహిత్యం, సాంస్కృతికం, నృత్యం, చిత్రకళ, ఎలక్యూషన్, క్విజ్, స్పెల్ బి(తెలుగు,హిందీ,ఇంగ్లీష్) తదితర దాదాపు అన్ని విభాగాల్లో మొదటి, రెండో స్థానాలు సాధించారు. విద్యారుల నృత్యాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. ప్రత్యేక బహుమతులు సొంతం చేసుకున్నారు.ఆర్చ్‌బిషప్ డాక్టర్ పూల ఆంథోనీ, మోన్సినియర్ ఫాదర్ బాలశౌరి తదితర ప్రముఖులు విజేతలకు బహుమతులిచ్చి ప్రశంసించారు. ప్రిన్సిపాల్ ఫాదర్ ఏరువ అమల్ ఫ్రాన్సిస్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్ మాట్లాడుతూ క్రమశిక్షణ, ధైర్యం ఉంటే ఏ లక్ష్యమైనా సాధ్యమే అని విద్యార్థులను ఉద్బోధించారు

## ప్రాచీన వైద్య విధానాలకు ఆదరణ



**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** కొండాపూర్‌లోని రాజరాజేశ్వరి నగర్ కాలనీలో ఆయువభివృద్ధి వెల్‌నెస్ క్లినిక్ ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భారత ధర్మ జాగరణ సహ ప్రముఖ్ ఆలే శ్యామ్ కుమార్, డాక్టర్ సింధు భైరవి, ఫైనాన్స్ డైరెక్టర్ మనోహరి, మ్యూజిక్ థెరపిస్ట్ వశిష్ఠరామ్‌లు విచ్చేసి ఆయువభివృద్ధి వెల్‌నెస్ క్లినిక్‌ను ప్రారంభించారు. అనంతరం భారత ధర్మ జాగరణ సహ ప్రముఖ్ ఆలే శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ ప్రాచీన వైద్య విధానాలకు తిరిగి ఆదరణ లభిస్తుండటం శుభ సూచకమని తెలిపారు. అధునాతన హోమియోపతి సేవలతో పాటు న్యూట్రిషియనల్, యోగ, మ్యూజిక్ థెరపిలను అందుబాటులోకి తీసుకొచ్చారని, ప్రతిఒక్కరు ఆరోగ్యంగా ఉండడానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని, అనారోగ్యం బారిన పడినప్పుడు ప్రాథమిక దశలోనే ఆయుర్వేదం, హోమియోపతి లాంటి సాంప్రదాయ వైద్యాన్ని ఎంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ నందకుమార్ యాదవ్, ఎస్‌బిఐ రిటైర్డ్ ఎజిఎం బాల్ద ఆశోక్, చింత కింది గోవర్ధన్ గౌడ్, యోగాశిక్షకులు జర్నలిస్టు పుట్ట వినయ్ కుమార్ గౌడ్, వ్యాపారవేత్త రాఘవేంద్రరావు పాల్గొన్నారు.

## 7న ప్రపంచ మానవతావాది దీదీ కృష్ణకుమారి హైదరాబాద్ సందర్శన



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మానవతావాది, ఆధ్యాత్మిక నాయకురాలు, సాధు వాస్వానీ మిషన్ గ్లోబల్ హెడ్ దీదీ కృష్ణకుమారి ఈనెల 7న హైదరాబాద్‌లో పర్యటించనున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సాధు వాస్వానీ మిషన్, కొంపల్లి సాధు వాస్వానీ ఇంటర్నేషనల్ స్కూల్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం సికింద్రాబాద్ సిక్ విలేజ్‌లోని ఇంపీరియల్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 'డిజైన్ యువర్ డెస్టిని– హు షేప్స్ యువర్ పాథ్?' అనే అంశంపై దీదీ కృష్ణ కుమారి ప్రసంగిస్తారు. హైదరాబాద్‌లో శుక్రవారం జరిగిన మీడియా సమావేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సాధు వాస్వానీ మిషన్ ట్రస్టీలు డాక్టర్ హరీష్ మీర్ చందని, హీరా రూపానీ ఈ వివరాలను వెల్లడించారు. ప్రతి వ్యక్తి, నేపథ్యం, పరిస్థితితో సంబంధం లేకుండా, అంతర్గత అవగాహన, ఆత్మవిశ్వాసం, క్షమ, కరుణతో కూడిన జీవనం ద్వారా వారి విధిని ఎలా పునర్ రూపకల్పన చేసుకోవాలనే అంశాలపై దీదీ కృష్ణ తన ప్రసంగంలో తెలియజేస్తారని వారు వివరించారు. ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించే కార్యక్రమంలో సభికుల ఎంపికలు, ఆలోచనలు, అంతర్గత వైఖరులు వారి జీవిత గమనాన్ని ఎలా రూపొందిస్తాయో అన్వేషించడానికి పాల్గొనాలని వారు కోరారు.

# ఘనంగా సాయుధ దళాల పతాక దినోత్సవం

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** రాష్ట్రంలోని ప్రాంతీయ సైనిక్ సంక్షేమ కార్యాలయాలలో మాజీ సైనికులు, వారి కుటుంబాలు, ఎన్‌సిసి క్యాడెట్‌ల సహాయంతో సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. మాజీ సైనికులు, వారి కుటుంబాలకు పునరావాసం తోపాటు కొన్ని బెనిఫిట్స్ కల్పించేందుకు 1949 సంవత్సరంలో స్థాపించిన సాయుధ దళాల ఫ్లాగ్ డే ఫండ్ కార్యక్రమానికి తెలంగాణ గవర్నర్, సాయుధ దళాల ఫ్లాగ్ డే ఫండ్ చైర్మన్ జిష్ణు దేవ్ వర్మ సాయుధ దళాల పతాక దినోత్సవం స్టిక్కర్‌ను ఉంచడం ద్వారా సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి రాష్ట్రంలోనే అత్యధిక విరాళాలు సేకరించినందుకు రంగారెడ్డి జిల్లా ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి శ్రీనేష్ కుమార్ నోరికి రంగారెడ్డి జిల్లాకు కలనల్ రమేష్ కుమార్ సమక్షంలో ట్రోఫీని అందించారు. అందులో



భాగంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కల్నల్ రమేష్‌కుమార్, డైరెక్టర్ అండ్ శ్రీనేష్‌కుమార్ నోరి, ప్రాంతీయ సైనిక సంక్షేమ అధికారి రంగారెడ్డి జిల్లా తెలంగాణ సాయుధ దళాల పతాక దినోత్సవ స్టిక్కర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి రాష్ట్ర ముఖ్యమంత్రి రూ.1లక్ష విరాళం అందజేశారు. సాయుధ దళాల పతాక దినోత్సవ నిధికి ఉదారంగా, స్వచ్ఛందంగా విరాళాలు అందించిన గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగులు, క్లాస్ 4 ఉద్యోగులు, సెక్రటేరియట్ ఉద్యోగులు, డ్రైవర్లు, లెక్చరర్లు, ఉపాధ్యాయులు, తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులందరికీ సైనిక సంక్షేమ శాఖ కృతజ్ఞతలు తెలిపింది. ఎన్ సి సి క్యాడెట్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశరక్షణకు తమ జీవితాలను త్యాగం చేస్తూ దేశ రక్షణకు భారత ప్రజల సుఖశాంతులకు అనుక్షణం పనిచేస్తున్న భారత త్రివిద దళాల సేవలు మరవలేనివన్నారు. అందుకే వారి సంక్షేమానికి ప్రతి పౌరుడు తమవంతుగా చేయూతనిస్తూ వారికి సంఘీభావం తెలపాలన్నారు. సేకరించిన విరాళాలను ప్రాణ త్యాగం చేసిన కుటుంబాలకు అందచేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో నరోత్తమ్‌రెడ్డి, అస్లాం, సరస్వతి, అనురాధ, కిషన్ తదితరులు పాల్గొన్నారు.

# గాలి నాణ్యత మెరుగుకు సమాయత్తం

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం (ఎన్‌సిఎపి) కింద మహానగర పాలక సంస్థ(జిహెచ్‌ఎంసి) ప్రధాన కార్యాలయంలో సిటీ లెవల్ మానిటరింగ్ అండ్ ఇంప్లిమెంటేషన్ కమిటీ (సిఎల్ఎఐసి) సమావేశాన్ని నిర్వహించింది. హైదరాబాద్‌లోని కాలుష్య హాట్‌స్పాట్‌లను సమర్థవంతంగా నిర్వహించడానికి, మరింత పటిష్టమైన, డేటాఆధారిత కార్యాచరణ ప్రణాళికను రూపొందించడంపై ఈ సమావేశంలో దృష్టి సారించారు. జిహెచ్‌ఎంసి అదనపు కమిషనర్ సి.ఎన్.రఘు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాచకొండ, సైబరాబాద్, హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ కమిషనరేట్‌ల సీనియర్ అధికారులు, తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టిఎస్‌పిసిబి), టిజిఎస్‌ఆర్‌టిసి, హెచ్‌ఎంఆర్‌ఎల్, పౌర సరఫరాలు, రవాణాశాఖ, టిజిఐఐసి, ఈపిటిఆర్‌ఐ, సిపిసిబి(ఎన్‌సిఎపి) నుండి సాంకేతిక సలహాదారులు, జిహెచ్‌ఎంసి లైన్ విభాగాల అధికారులు పాల్గొన్నారు. గాలి నాణ్యతలో అర్థవంతమైన మెరుగుదలలు సాధించడా



నికిశాఖల మధ్య సమన్వయం, కఠినమైన చర్యలు అమలు చేయాల్సిన అవసరం ఉందని రఘు ప్రసాద్ అన్నారు. టిఎస్‌పిసిబి పర్యావరణ శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రసాద్‌దాసరి, ఎన్.జయశ్రీ కాలుష్య నియంత్రణ కార్యక్రమాలను బలోపేతం చేయడానికి వివరణాత్మక సిఫార్సులను సమర్పించారు. ఎన్‌సిఎపి కింద గాలి కాలుష్యాన్ని తగ్గించడానికి, గుర్తించబడిన హాట్‌స్పాట్‌లలో వ్యూహాలను మెరుగుపరచడానికి కమిటీ సభ్యుల నుండి ఆచరణాత్మక అంశాలను సేకరించాలని నిర్ణయించారు. సిటీ యాక్షన్ ప్లాన్ పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని నిర్ణయించారు. ప్రజా, నివాస ప్రాంతాలలో ప్లాస్టిక్, ఇతర మున్సిపల్ ఘన వ్యర్థాలను బహిరంగంగా కాల్చడంపై కఠినమైన అమలు చర్యలు. సమష్టిగా సమన్వయాన్ని బలోపేతం చేసుకోవడానికి, వినూత్న స్వచ్ఛమైన గాలి సాంకేతికతలను అవలంబించడానికి, ఆరోగ్యకరమైన, కాలుష్య రహిత హైదరాబాద్ కోసం ఎన్‌సిఎపి కార్యకలాపాలను వేగవంతం చేయడానికి అన్ని విభాగాలు కృషి చేయాలని నిర్ణయించారు.

## రత్న ప్రభకు టున్ డాక్టర్ మహతిర్ గ్లోబల్ లీడర్‌షిప్ అవార్డు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కర్ణాటక మాజీ ప్రధాన కార్యదర్శి, ఉబుంటు కన్సార్టియం వ్యవస్థాపక అధ్యక్షురాలు, రిటైర్డ్ ఐఎఎస్ కె.రత్న ప్రభ మలేషియాలోని బ్రిక్స్‌ఆసియాన్ చాంబర్ ఆఫ్ కామర్స్ (బిఎసిసి) ద్వారా ప్రతిష్టాత్మకమైన తున్ డాక్టర్ మహతిర్ మొహమ్మద్ గుడ్ గ్లోబల్ ఎగ్జాంప్లరీ లీడర్‌షిప్ అవార్డును అందుకున్నారు. బ్రిక్స్‌ఆసియాన్ కౌన్సిల్ అధ్యక్షుడు, నైజీరియా రాయబారి థాయలన్ నాథన్ ప్రదానం చేసిన ఈ అవార్డు, పాలన, సంస్థాగత బలోపేతంతో పాటు సమాజకేంద్రీకృత అభివృద్ధికి ఆమె చేసిన అసాధారణ కృషిని గుర్తింపుగా అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ సందర్భంగా రత్న ప్రభ మాట్లాడుతూ అవార్డు ద్వారా లభించిన ఈ గుర్తింపు శుభారంభమన్నారు. అవార్డు తమ లక్ష్యాన్ని మరింత పటిష్టపరుస్తుందన్నారు.



## 15న రౌండ్‌టేబుల్ సమావేశం



**ప్రజాపక్షం /ఖైరతాబాద్ :** స్థానిక సంస్థల రిజర్వేషన్లలో బిసిలకు జరిగిన నమ్మకద్రోహం, అన్యాయంపై ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఈనెల 15న హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు అఖిల భారత యాదవ మహాసభ అధ్యక్షులు, హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గడ్డం శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బిఆర్‌ఎస్ సీనియర్ నేతలు శ్రీనివాస్ యాదవ్; మహేశ్‌లతో కలిసి ఆయన మాట్లాడారు. స్థానికంలో 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం బిసిలను నట్టేట ముంచిందన్నారు.

# ఎన్నికల విధులకు గైర్హాజరైతే కఠిన చర్యలు
### కలెక్టర్ నారాయణరెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ఎన్నికల విధులకు గైర్హాజరు అయినట్లయితే నిబంధనలను అనుసరించి కఠిన చర్యలు తప్పవని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా శుక్రవారం పోలింగ్ సిబ్బంది రెండవ విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను జనరల్ అబ్జర్వర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ సి.నారాయణ రెడ్డి సమక్షంలో పూర్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లాలో నిర్వహించే గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి మండలాల వారీగా ఎన్నికల విధులు నిర్వర్తించే 4458 ప్రిసైడింగ్, అధికారులను, ఇతర అధికారులతో కూడిన బృందాలను ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించారు. వీరికి ఇప్పటికే మొదటి విడత శిక్షణను ఎంపిక చేసిన వివిధ కేంద్రాలలో మాస్టర్ ట్రైనర్స్ చే పోలింగ్ నిర్వహణపై శిక్షణ తరగతులు నిర్వహించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. రెండవ విడత మండలాలలో పోలింగ్ సిబ్బందికి ఈ నెల 9న వారికి కేటా



యించిన మండల కేంద్రాలలో రెండవ శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని,ఎవరైనా ఎన్నికల విధులకు గైర్హాజరు అయినట్లయితే ఎన్నికల నిబంధనలను అనుసరించి చర్యలు తీసుకోబడుతాయని కలెక్టర్ నారాయణ రెడ్డి హెచ్చరించారు. ర్యాండమైజేషన్ ప్రక్రియలో జిల్లా అదనపు కలెక్టర్ కె.శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి వి.సురేష్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# అవకాశాలు కల్పించడం నిజమైన మద్దతు
### జెడ్‌పి సిఇఒ సిహెచ్.కృష్ణారెడ్డి, దివ్యాంగుల సంక్షేమ అధికారి శ్రీలత

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** దివ్యాంగులపై దయ చూపడం కాదు, వారి సామర్థ్యాలను గుర్తించి, అవకాశాలను కల్పించడంనే నిజమైన మద్దతు అని రంగారెడ్డి జిల్లా పరిషత్ సిఇఒ సిహెచ్.కృష్ణారెడ్డి, గ్రామీణభివృద్ధి అధికారి, ఇంచార్జ్ మహిళా, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ అధికారి ఎల్.శ్రీలత అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవాన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కలెక్టరెట్ కార్యలయంలో ఘనంగా నిర్వహించారు.డిఆర్‌డిఒ అండ్‌డి డబ్ల్యూఒ శాఖల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎస్‌సి కార్పొరేషన్ ఇడి జె.పద్మావతి, మెప్మా పిడి జి.వెంకటనారాయణ, హౌసింగ్ పిడి డి.సి.నాయక్, అడిషనల్ డిఆర్‌డి ఓ జోజప్పలు పాల్గొనగా, అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దివ్యాంగుల హక్కులు సమాజ బాధ్యత అన్నారు. దివ్యాంగులు అనగానే సానుభూతి కంటే సమాన అవకాశాలు ఇవ్వాలన్నారు.



సమాజం, కుటుంబం, ప్రభుత్వ బాధ్యత, ప్రతిభ, నైపుణ్యం, ధైర్యం, ఇవి శారీరక సామర్థ్యాల మీద ఆధారపడవు అని చెప్పారు. సమాజ నిర్మాణంలో దివ్యాంగులు కూడా సమ భాగస్వాములే అని, విద్య, ఉపాధి, స్వయం ఉపాధి, సామాజిక సురక్ష ఏ రంగంలోనూ వెనకబాటుగా ఉండకూడదన్నారు. దివ్యాంగులపై దయ చూపడం కాదు, వారి సామర్థ్యాలను గుర్తించి అవకాశాలను కల్పించడంనే నిజమైన మద్దతు అని స్పష్టం చేశారు. సమాజంలో దివ్యాంగులు తమ ప్రతిభను వెలుగులోకి తీసుకురావడంలో ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. అధికారులు, రంగారెడ్డి జిల్లా దివ్యాంగులకు సానుకూల మద్దతుతో, సామాజిక పురోగతిని లక్ష్యంగా పెట్టుకొని ముందుకు సాగుతోందన్నారు. ఐసిడిఎస్ ప్రాజెక్టులకు చెందిన సూపర్వైజర్లు, అంగన్వాడీ సిబ్బంది, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి 400కి పైగా దివ్యాంగులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. అనంతరం ప్రతిభ కనబరచిన దివ్యాంగులకు సర్టిఫికెట్లు, శాలువాలు అందజేశారు. కార్యక్రమంలో హాజరై అధికారులు దివ్యాంగులకు అందుబాటులో ఉన్న ప్రభుత్వ సంక్షేమ పథకాలపై విలువైన సూచనలు అందించారు.

## హిల్ట్‌కు వ్యతిరేకంగా పోరాడుతాం
### విద్యార్థి సంఘాల నిర్ణయం

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ (హిల్ట్ ) పాలసీకి వ్యతిరేకంగా ఉద్యమిస్తామని పలు విద్యార్థి సంఘాల నేతలు నిర్ణయించారు. శుక్రవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బిఆర్‌ఎస్‌వి అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ అధ్యక్షతన పలు విద్యార్థి సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. సమావేశానికి బిఆర్‌ఎస్‌వి, ఎస్‌ఎఫ్‌ఐ, పిడిఎస్‌యు, ఎంఎస్‌ఎఫ్, టిజిఎస్ శక్తి, ఆదివాసి విద్యార్థి సంఘం, బిసి విద్యార్థి జెఎసి , డిబిఎస్‌ఎ, ఎఎంఎస్‌ఎ, టివిఎస్, ఆర్‌ఎస్‌ఎ, టిఎస్‌యు, ఎస్ఎస్‌ఎఫ్ తదితర విద్యార్థి సంఘాల నేతలు, ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గెల్లు శ్రీనివాస్ మాట్లాడుతూ హిల్ట్ పాలసీకి వ్యతిరేకంగా టిజిఐఎస్‌సి కార్యాలయాన్ని ముట్టడిస్తామని, కలెక్టరేట్‌లకు వెళ్లి వినతిపత్రాలు అందజేస్తామని, అన్ని విద్యార్థి సంఘాల నేతలతో కలిసి చైతన్యసదస్సును ఏర్పాటు చేస్తామని గెల్లు శ్రీనివాస్ తెలిపారు. సమావేశంలో విద్యార్థి సంఘాల నేతలు వెంకట్ బంజారా, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.




## ఆరు గ్యారంటీ పథకాలు అమలు చేస్తున్న ప్రభుత్వం : ప్రతాప్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఫరూఖ్‌నగర్:** ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తున్న ఏకైన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో కాంగ్రెస్ సర్పంచ్ అభ్యర్థి అంబటి రాజుకు మద్దతుగా ప్రచారం చేశారు. ముస్లిం మైనార్టీల ప్రార్థన మందిరాల వద్దకు వెళ్ళి కలుసుకొని కాంగ్రెస్ అభ్యర్థి అంబటి రాజుకు ఉంగరం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటి వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, మైనార్టీ నేతలు మహ్మద్ ఇబ్రహీం, సయ్యద్ ఖదీర్, ఇసాక్‌లు ఉన్నారు.

# కళాశాల నిర్మాణానికి రూ.50లక్షల విరాళం
### నాట్కో కంపెనీ ఔదార్యం..అభినందించిన ఎమ్మెల్యే వీర్లపల్లి

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** గ్రామీణ ప్రాంత విద్యార్థుల అభ్యున్నతికి నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి నాట్కో కంపెనీ యాజమాన్యం భారీవిరాళం అందజేయడం అభినంధనీయమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం షాద్‌నగర్‌లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దాతల సహకారంతో నిర్మిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి రూ.50లక్షల విరాళం నాట్కో కంపెనీ మేనేజర్ సత్యనారాయణ, ప్రతినిధులు లక్ష్మీ నారాయణలు చెక్కును ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు అందజేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని నాట్కో పరిశ్రమ యాజమాన్యం పరిశీలించారు. షాద్‌నగర్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణం చేపట్టడం ఎంతో అభినందనీయమని నాట్కో ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ గ్రామీణ పేద విద్యార్థుల కోసం నూతనంగా నిర్మిస్తున్న కళాశాల భవన నిర్మాణానికి నాట్కో పరిశ్రమ యాజమాన్యం ముందుకు వచ్చి పెద్ద ఎత్తున రూ.50లక్షల ఆర్థిక విరాళం అందజేయడం అభినందనీయమన్నారు. దాతలు సహకారంతో కళాశాల



భవన నిర్మాణానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. గ్రామీణ పేద విద్యార్థులకు కార్పోరేట్ స్థాయిలో విద్యను అంధించాలన్నదే లక్ష్యంగా తాను పని చేస్తున్నానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ బాబర్‌ఖాన్, కాంగ్రెస్ నేతలు బస్వం, చెంది తిరుపతిరెడ్డి, సాయికృష్ణ, మహ్మద్ ఇబ్రహీం, శ్రీనివాస్ యాదవ్, రాజేందర్‌రెడ్డి, సీతారాములు, లింగారెడ్డిగూడ అశోక్, ముబారక్ అలీఖాన్, అర్జున్ లక్ష్మణ్, మాణిక్యం, సోలీపూర్ అనిల్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# రీల్

## 'ఈషా' భయపెడుతోంది

### దర్శకుడు శ్రీనివాస్ మన్నె



ప్రముఖ కథానాయిక జెనీలియా ప్రధాన పాత్రలో రూపొందిన 'కథ' చిత్రంతో విమర్శకుల ప్రశంసలు అందుకున్న దర్శకుడు శ్రీనివాస్ మన్నె, తాజాగ ఆయన దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'ఈషా'. డిసెంబరు 12న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు శ్రీనివాస్ మన్నె శుక్రవారం పాత్రికేయులతో ముచ్చటించారు. కథ చిత్రానికి నాకు మంచి ప్రశంసలు లభించాయి. ఆ చిత్రానికి ఉత్తమనటనకు జెనీలియాకు నంది అవార్డు కూడా వచ్చింది. కథ సినిమాకు మంచి అప్లాజ్వచ్చింది. కమర్షియల్‌గా పెద్దగా ఆడకపోయినా మంచి ప్రశంసలు వచ్చాయి. అనుకోకుండా నా వ్యక్తిగత కారణాల వల్ల దర్శకత్వానికి గ్యాప్ వచ్చింది. దామోదర్ ప్రసాద్ తో నాకు మంచి అనుబంధం ఉంది. ఆయన ఇచ్చిన సపోర్ట్తో ఈ సినిమా చేశాను. ఈ గ్యాప్లో కథలు సిద్ధం చేసుకున్నాను. నేను కొరియన్, హాలీవుడ్ సినిమాలు చూస్తుండేవాడిని. ఇప్పుడు సినిమా టెక్నికల్ గాకూడా చాలా మార్పులొచ్చాయి. లైటింగ్, సౌండ్ అన్నింట్లో అప్డేట్ అయ్యాయి. స్టోరీ స్ట్రాంగ్‌గా ఉంటే టెక్నికల్‌గా అటు ఇటు ఉన్న సినిమా సక్సెస్ అవుతుంది. హారర్‌తో పాటు మన జీవితాల్లో ఉన్న చావులు పుట్టుకలు, అండర్ కరెంట్లో దైవత్వం, సృష్టి చేసే పనులు ఇలా అన్ని అంశాలు ఉంటాయి. సృష్టి అన్నింటిని బ్యాలెన్స్ చేస్తుంది. ఈ చిత్రంలో స్ట్రాంగ్‌గా కంటెంట్గా ఉంటుంది. ఈ సినిమాలో అన్ని అంశాలను టచ్చేశాం. టెక్నికల్‌గా చాలా స్ట్రాంగ్‌గా ఉండే సినిమా ఇది. మేకప్, కాస్ట్యూమ్, లైటింగ్, సౌండ్ డిజైనింగ్ అన్నింట్లో కేర్తీసుకున్నాం. సినిమాలో చాలా షాకింగ్ ఎలిమెంట్స్ ఉంటాయి. వాంటెడ్‌గా ఉండదు సినిమాచూసి భయపడతారు అంతే. హార్ట్ వీక్‌గా ఉన్న వాళ్లు కూడా ఈ సినిమా చూడకూడదు. సెన్సార్ వాళ్లుచూసి సినిమా చాలా భయంకరంగాఉంది. గుడ్ కంటెంట్ అన్నారు. కానీ ఈ కథను ఆ పాయింట్‌ను అలాగే డీల్‌చేయాలి. ఫ్రెండ్‌షిప్, హ్యూమన్ ఎమోషన్స్, ఫిలాసఫీకల్‌గా ఉంటుంది. మూఢ నమ్మకాలు, ఆత్మలు అన్ని ఈ సినిమాలో చర్చిస్తున్నాం. మనకు జరగనంత వరకు ఏదైనా మూఢ నమ్మకమే. మనకుజరిగితే అది నమ్మకంగా మారుతుంది. అనే విషయం కూడా ఈసినిమాలో చూపిస్తున్నాం. రియల్‌గా ఎక్స్‌పీరియన్స్ చేసిన వాళ్లకు నమ్మకం. మనకు జరగలేదు కాబట్టి మూఢ నమ్మకం. సృష్టిలో అన్ని ఉంటాయి. ఆత్మ అనేది లేకపోతే ఆ పదమే పుట్టదు కదా, మంచిచెడు ఉన్నట్లేఅది కూడా ఉంటుంది. నాకు అన్ని తరహా చిత్రాలు చేయాలని ఉంది. కథలు కూడా సిద్ధంగా ఉన్నాయి.



## ధుమ్ ధకుమ్ సాంగ్ లాంచ్

ఈ చిత్రానికి వరుణ్ రెడ్డి దర్శకత్వం వహించారు. స్పిరిట్ మీడియా, నందునెస్ కీప్ రోలింగ్ పిక్చర్స్ బ్యానర్లపై శ్రీ నందు, శ్యామ్ సుందర్ రెడ్డి తుడి సంయుక్తంగా నిర్మించారు. మ్యాడ్ మాక్స్ స్టైల్ మ్యాడ్‌నెస్‌తో యూత్‌ఫుల్ ఎంటర్టైనర్‌గా రూపొందిన సైక్ సిద్ధార్థలో హై ఎనర్జీ ఎంటర్టైన్‌మెంట్ వుండబోతుంది. ఈ చిత్రంలో యామిని భాస్కర్ కథానాయికగా నటించగా, ప్రియాంక రెబెకా శ్రీనివాస్, సాక్షి అత్రీ, మౌనిక కీలక పాత్రలు పోషించారు. 12న సైక్ సిద్ధార్థ గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ సందర్భంగా సినిమా నుంచి ధుమ్ ధకుమ్ సాంగ్ లాంచ్ చేశారు. ఈ ఈవెంట్‌లో నిర్మాత సురేష్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మాత సురేశ్ బాబు మాట్లాడుతూ. స్పిరిట్ మీడియాలో తేజ అనే ఆయన మాతో కలిసి వర్క్ చేస్తుంటారు. ఒక సినిమా ఉంది.. మీరు చూస్తే బావుంటుంది' అని కోరారు. రాఘవేంద్రరావుతో పాటు చాలా మందికి ఈ సినిమా చూపించాము. అందరు కూడా చాలా అప్రిషియేట్ చేశారు. పెళ్లి చూపులు, కేరాఫ్ కంచరపాలెం తర్వాత అంత స్పెషల్‌గా ఈ సినిమా అనిపించింది అన్నారు. హీరో శ్రీనందు, హీరోయిన్ యామిని భాస్కర్, మ్యూజిక్ డైరెక్టర్ స్మరణ్ సాయి తదితరులు పాల్గొన్నారు.

## లండన్‌లో షారూఖ్ ఖాన్, కాజోల్ విగ్రహావిష్కరణ




బాలీవుడ్ స్టార్ షారూఖ్ ఖాన్, కాజోల్ ఇద్దరు కలిసి నటించిన సినిమా దిల్ వాలే దుల్హనియా లేజాయేంగే. ఈ సినిమాకు సంబంధిచిన ఒక యూనివర్సల్ స్టిల్‌ను లండన్‌లోని లీసెస్టర్ స్క్వేర్‌లో కొత్త కంచు విగ్రహాన్ని ఆవిష్కరించారు. ప్రముఖ దర్శకుడు ఆదిత్య చోప్ర తెరకెక్కించి 'దిల్వాలే దుల్హనియా లేజాయెంగే' సినిమా భారతీయ సినిమాల్లోనే అత్యంత ఆదరణ పొందిన సినిమాగా నిలిచింది. ఈ సినిమాలో రాజ్, సిమ్రాన్ పాత్రలను పోషించినందుకు వారి పాత్రలకు ఈ గౌరవం దక్కింది. యష్ రాజ్ ఫిలింస్‌లో 30 సంత్సరాలను పూర్తి చేసుకున్న ఈ బ్లాక్ బస్టర్ మూవీలోని రాజ్, సిమ్రాన్ పాత్రలకు సంబంధించిన ఐకానిక్ స్టిల్ను కాంస్య విగ్రహంగా రూపొందించారు. లండన్ లీసెస్టర్‌లో విగ్రహ రూపంలో ఆవిష్కరింపబడ్డ తొలి ఇండియన్ సినిమా ఇదే.




## 'వెంకటలచ్చిమి' పోస్టర్ రిలీజ్

'ఆర్ఎక్స్ 100' 'మంగళవారం' వంటి సినిమాలతో యూత్ ఆడియన్స్క హాట్ ఫేవరేట్ హీరోయిన్‌గా మారిన పాయల్ రాజ్‌పుత్ ఈ సారి 'వెంకటలచ్చిమి' గెటప్‌లో ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. పాయల్ రాజ్‌పుత్ జన్మదినం సందర్భంగా డైరెక్టర్ ముని తెరకెక్కిస్తున్న ఆమె అప్ కమింగ్ మూవీ 'వెంకటలచ్చిమి' బర్త్ డే పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్ చూస్తేనే సినిమా ఎంత ఇంటెన్స్‌గా, ఎంత థ్రిల్లింగ్‌గా ఉండబోతోందో అర్థమవుతోంది. రాజా, పవన్ బంద్రేడ్డి నిర్మిస్తున్న 'వెంకటలచ్చిమి' మూవీ బర్త్ డే పోస్టర్‌లో హీరోయిన్‌ను ఒక జైలు గదిలో పైకప్పుకు తలక్రిందులుగా వ్రేలాడితీసి చేతికి సంకెళ్లు, మెడలో మంగళసూత్రం ఉంచినట్టు కనిపిస్తుంది. రక్తపు మరకలు, మధ్యన భయానక వాతావరణం.. అన్ని కలిసి పోస్టర్‌కి పవర్‌ఫుల్ టచ్‌ను ఇస్తున్నాయి. ఆమె చేతులుకి సంకెళ్లు ఉండటం, రక్తంతో కూడిన మంగళసూత్రం, చుట్టూ నిశ్శబ్ద భయానికి సూచనగా ఉన్న నేపథ్యం సినిమాపై ఉత్కంఠను పెంచుతూ, సినిమాపై భారీ అంచనాలు పెంచుతున్నాయి. బర్త్ డే పోస్టర్ విడుదల సందర్భంగా చిత్ర యూనిట్ పాయల్ రాజ్‌పుత్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసింది.

## అక్కడే కనెక్ట్ అవుతాం..

### యామిని భాస్కర్

హీరో శ్రీ నందు తాజా చిత్రం 'సైక్ సిద్ధార్థ'. ఈ సినిమా 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా హీరోయిన్ యామిని భాస్కర్ మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. నర్తనశాల తర్వాత రెండేళ్లు గ్యాప్ వచ్చింది. కోవిడ్ తర్వాత ఏం సినిమా, క్యారెక్టర్ చేయాలని ఆలోచిస్తున్నపుడు, డైరెక్టర్ వరుణ్ ఫ్రెండ్ మా కమ్యూనిటీలోనే ఉంటాడు. మేము కలిసి వాకింగ్ చేస్తుంటాము. అప్పుడు ఈ కథ చెప్పాడు. డైవర్స్ తీసుకున్న అమ్మాయి, తనకు ఒక పిల్లాడు కూడా వుంటాడు. ఈ క్యారెక్టర్ చేస్తావా అని అడిగారు. కొత్తగా అనిపించింది. ఇలాంటి క్యారెక్టర్ ఇప్పటివరకు నేను చేయలేదు. తర్వాత డైరెక్టర్ వరుణ్ ని కలిశాను. ఆయన కథ చెప్పిన విధానం నాకు చాలా నచ్చింది. వెరీ స్ట్రాంగ్ ఇండిపెండెంట్ విమెన్ క్యారెక్టర్ చేశాను. పర్ఫార్మెన్స్‌కి చాలా స్కోప్ ఉంది. కచ్చితంగా ఈ సినిమా తర్వాత నాకు మరిన్ని అవకాశాలు వస్తాయనే నమ్మకం ఉంది. ఇందులో నా క్యారెక్టర్ పేరు శ్రావ్య. ఒక హానికరమైన రిలేషన్ నుంచి బయటకు వచ్చి స్వతహాగా బ్రతకాలనుకుంటుంది. ఇదే సమయంలో సిద్ధార్థకి బ్రేక్ అప్ అయి ఉంటుంది. తను అన్ని వదిలేసి ఒక బస్తీలో ఉండడానికి వస్తాడు. అక్కడ మేము కనెక్ట్ అవుతాము. అప్పుడు ఒక ప్రేమ కథ మొదలవుతుంది. అక్కడి నుంచి చాలా బ్యూటిఫుల్ జర్నీ ఉంటుంది. ఇది ఒక సహజమైన ప్రేమ కథ. అందరూ రిలేట్ అయ్యేలా ఉంటుంది. నందు మహిళల పట్ల చాలా గౌరవంగా ఉంటాడు. చాలా జెన్యూన్ పర్సన్. చాలా మంచి మనిషి. నందుతో వర్క్ చేయడం చాలా ఆనందంగా అనిపించింది. డైరెక్టర్ సాయి రాజేష్ ఈ సినిమా చూసి నా క్యారెక్టర్ గురించి చాలా ప్రత్యేకంగా ప్రశంసలు అందించారు. పర్ఫార్మెన్స్‌కి చాలా స్కోప్ ఉన్న క్యారెక్టర్ చేశానని చెప్పారు. ఇప్పటినుంచి సినిమాలు మీద ప్రత్యేకంగా ఫోకస్ చేయమని చెప్పారు.ట్రైలర్ చూసిన చాలా మంది ఫ్రెండ్స్ మెసేజ్ లు పెట్టారు. మళ్ళీ స్క్రీన్ మీద చూడడం చాలా ఆనందంగా ఉందని చెప్పారు. సినిమాల్లో కంటిన్యూ చేయమని కోరారు. ఈ సినిమా టీజర్ చూసిన రోజే సినిమాల్ని కంటిన్యూ చేయాలని ఫిక్స్ అయ్యాను. మంచి క్యారెక్టర్ వస్తే ఓటీటీ ప్రాజెక్ట్స్ కూడా చేస్తాను. కాటమరాయుడు సినిమా చేశాను. పవన్ కళ్యాణ్ తో వర్క్ చేయడం ఎలా అంటే ఫస్ట్ డే నాకు పవన్ కళ్యాణ్‌కి ఒక సీన్ ఉండింది. నేను క్లాసికల్ డాన్స్ చేసేదాన్ని. ఆయన ఆ రోజు దాదాపు 15 నిమిషాలు నాతో మాట్లాడారు. నా జర్నీ గురించి అడిగారు. ఆ తర్వాత నేను అజ్ఞాతవాసి సినిమాలో కూడా చేశాను. కానీ అది కట్ అయింది. ఒక స్టార్‌గా గొప్ప మనిషిగా ఆయన అంటే నాకు ఎంతో గౌరవం అన్నారు.




## 'డ్రైవ్' టీజర్ రిలీజ్



ఆది పినిశెట్టి హీరోగా నటిస్తున్న థ్రిల్లర్ మూవీ 'డ్రైవ్'. ఈ చిత్రంలో మడోన్నా సెబాస్టియన్ హీరోయిన్‌గా కనిపించనుంది. 'డ్రైవ్' సినిమాను భవ్య క్రియేషన్స్ బ్యానర్‌పై ప్రొడ్యూసర్ వి.ఆనంద్ ప్రసాద్ నిర్మించారు. జెనూస్ మొహమద్ దర్శకత్వం వహించారు. 12న 'డ్రైవ్' సినిమా థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతోంది.ఈ సందర్భంగా సినిమా టీజర్ ను రిలీజ్ చేశారు.'డ్రైవ్' సినిమా టీజర్ ఎలా ఉందో చూస్తే తన తండ్రి స్థాపించిన ప్రజా మీడియా కార్పొరేషన్ వారసుడిగా సంస్థను విజయవంతంగా నిర్వహిస్తుంటాడు హీరో ఆది పినిశెట్టి. సౌత్ ఇండియాలో పేరున్న ఈ సంస్థ అకౌంట్స్‌ను ఒక హ్యాకర్ హ్యాక్ చేస్తాడు. ఈ హ్యాక్‌తో ప్రజా మీడియా కార్పొరేషన్ గౌరవం, క్రెడిబిలిటీ ప్రశ్నార్థకంలో పడతాయి. ఈ హ్యాకర్ ఎవరు?, ప్రజా మీడియా కార్పొరేషన్ తో పాటు హీరో పర్సనల్ లైఫ్‌ను ఎందుకు టార్గెట్ చేశాడు?. ఆ హ్యాకర్ ను హీరో పట్టుకోగలిగాడా? లేదా? అనేది టీజర్‌లో ఆసక్తి కలిగిస్తోంది.

## ఫైనాన్షియల్ సమస్యలు మామూలే

### సురేష్ బాబు



ప్రతి సినిమాకు ఆర్థిక సమస్యలు మామూలేనని ప్రముఖ నిర్మాత దగ్గుబాటి సురేష్ బాబు అన్నారు. అఖండ–2 సినిమాకు వచ్చిన ఆర్థిక సమస్యపై ఆయన రామానాయుడు స్టూడియోలో స్పందించారు. సైక్ సిద్ధార్థ సినిమా ప్రెస్‌మీట్‌లో పాల్గొన్న సురేష్ బాబు అఖండ–2కు వచ్చిన ఆర్థిక సమస్యలపై విలేకరులు ప్రశ్నించగా సురేష్ బాబు స్పందించారు. అఖండ–2 సినిమా పెనాన్షియల్ ఇష్యూ సాల్వ్ అవుతుంది.గతంలోనూ లాస్ట్ మినిట్ లో ఇలాంటి సందర్భాలు కొన్ని సినిమాలకు వచ్చాయి. సమస్య పరిష్కరించాం. ఇప్పుడు ఒక్కొక్కరు ఒక్కో ఎమౌంట్‌లను ప్రచారాలు చేస్తున్నారు. ఏరోస్‌తో మాకు ఎలాంటి డీలింగ్స్‌ను ఉన్నాయనేది పక్కనపెడితే.. అఖండ–2 ఇష్యూ సాల్వ్ అవుతుంది. అది త్వరలోనే అవుతుందని ఆశాభావంతో ఉన్నాము అని సురేష్ బాబు చెప్పారు.



## వర్సిటీ విద్యార్థులు

(మొదటి పేజీ తరువాయి)

రవిచందర్, క్రాంతికిరణ్, సాయుధ, రాకేష్, రాజశేఖర్ అనే విద్యార్థులు హైదరాబాద్ నుంచి మారేడుమిల్లికి బయలుదేరారు. వారి రాకను గమనించి వాహనాలను అడ్డుకున్న గ్రామస్తులు మావోయిస్టులు మాకు వద్దు అంటూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. అదే నడిరోడ్డుపై మావోయిస్టుల దిష్టిబొమ్మలను దహనం చేశారు. దీంతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఒకానొక దశలో పరిస్థితి అదుపు దాటుతున్నట్లు గ్రహించిన పోలీసులు రంగ ప్రవేశం చేసి విద్యార్థుల బృందాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. దీనిపై పోలీసులు స్పందిస్తూ విద్యార్థులపై గ్రామస్తులు విరుచుకు పడే ప్రమాదం ఉందని గ్రహించి వారిని స్టేషన్‌కు తరలించినట్లు వెల్లడించారు. ఇదిలా ఉండగా విద్యార్థులు మాట్లాడుతూ.. అడ్డుకున్న గ్రామస్తులతో ఇబ్బందులు ఎదురవుతాయని గ్రహించిన పోలీసులు తమను సురక్షిత ప్రాంతానికి తరలించారని, ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశానికి వెళ్లి అధ్యయనం, నిజ నిర్ధారణ చేసి అసలు విషయాలను బాహ్య ప్రపంచానికి బహిర్గతం చేసేందుకు తమ బృందం వెళుతుందని తమను అడ్డుకోవడం సరికాదని తాము అక్కడికి వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. తమ పర్యటన విషయాన్ని ముందుగానే వెల్లడించామని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తమకు సహక రించకుంటే హైదరాబాద్‌లో ఉన్న వారి పార్టీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతామని, తెలంగాణ మలిదశ ఉద్యమం ఏ విధంగా ముందుకు సాగిందో దీనిని కూడా అదే రీతిలో ముందుకు తీసుకెళ్తామని ఆ విద్యార్థులు చెప్పారు.

## వడ్డీ రేట్లలో కోత

(మొదటి పేజీ తరువాయి)

సడలించడం, ఆర్థిక రంగ నిబంధనలను సడలించడం ద్వారా ఆర్థిక వ్యవస్థకు మద్దతు ఇవ్వడంలో ప్రభుత్వ ప్రయత్నాలకు ఆర్‌బిఐ చర్య తోడ్పడుతుంది. రెపో రేటులో తగ్గింపు వ్యక్తులకు, కార్పొరేట్‌లకు రుణ ఖర్చులను తగ్గిస్తుంది. డిసెంబర్ 11–18 తేదీలలో రూ.50,000 కోట్ల చొప్పున రెండు విడతలుగా రూ.1 లక్ష కోట్ల వరకు ప్రభుత్వ బాండ్ల బహిరంగ మార్కెట్ కొనుగోళ్లను నిర్వహించాలని, డిసెంబర్ 16న డిఎస్‌డి 5 బిలియన్ల కొనుగోలు–అమ్మకపు స్వాప్‌ను నిర్వహించాలని ప్రకటించినందున, బ్యాంకింగ్ వ్యవస్థకు తగినంత ద్రవ్యతను అందించడానికి ఆర్‌బిఐ తన నిబద్ధతను పునరుద్ఘాటించింది. ఫిబ్రవరి 2025 నుండి సెంట్రల్ బ్యాంక్ చేసిన నాల్గవ రేటు తగ్గింపు ఇది. మొత్తం 125 బేసిస్ పాయింట్లకు చేరుకుంది. ఇది ఆగస్టు, అక్టోబర్ ద్వైమాసిక ద్రవ్య విధాన సమావేశాలలో రేట్లను నిలుపుకుంది. '2025–26 మొదటి అర్ధభాగంలో (2025–26 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–సెప్టెంబర్) ద్రవ్యోల్బణం 2.2 శాతంగా, వృద్ధి 8.0శాతంగా ఉండటం అరుదైన గోల్డిలాక్స్ కాలాన్ని సూచిస్తోంది' అని మల్హోత్రా ద్రవ్య విధాన నిర్ణయాలను ప్రకటిస్తూ అన్నారు. మార్చి వరకు ఆర్థిక సంవత్సరానికి ద్రవ్యోల్బణ అంచనాను ఆర్‌బిఐ 2.6 శాతం నుండి 2 శాతానికి తగ్గించింది. అదే సమయంలో జిడిపి వృద్ధి అంచనాను మునుపటి అంచనా 6.8 శాతం నుండి 7.3 శాతానికి పెంచింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దేశం నుండి వస్తువులపై 50 శాతం సుంకాన్ని విధించిన తర్వాత భారత ఎగుమతులు పడిపోయాయి.

## భవిష్యత్ విజన్ ప్రతిబింబించేలా 'ఏవి'

### వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచన



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర వ్యవసాయరంగ అభివృద్ధి, సామర్థ్యాలు, విదేశీ పెట్టుబడి అవకాశాలు, భవిష్యత్ విజన్‌ను స్పష్టంగా ప్రతిబింబించే విధంగా 'ఆడియో, విడియో విజువల్స్'(ఎవి)లను రూపొందించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, హ్యాండ్లూమ్స్, టెక్స్‌టైల్స్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ప్రస్తుతం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ సుమారు 200 బిలియన్ డాలర్ల వద్ద ఉందని, వచ్చే రెండు దశాబ్దాల్లో తెలంగాణను 15 రెట్లు పెద్ద ఆర్థిక వ్యవస్థగా మార్చే మహాదృక్పథానికి గ్లోబల్ సమ్మిట్ ప్రధాన వేదికగా నిలుస్తుందన్నారు. 'గ్లోబల్ సమ్మిట్ ' ఏర్పాట్లపైన హైదరాబాద్‌లని సచివాలయంలో మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సమీక్షించారు. సమ్మిట్‌లో ప్రదర్శించాల్సిన 'ఎవి' కంటెంట్‌పైన అధికారులకు దిశానిర్దేశం చేశారు. వ్యవసాయ రంగమే రాష్ట్ర ఆర్థిక లక్ష్య సాధనలో అత్యంత కీలక పాత్ర పోషించబోతోందని, గ్రామీణ జనాభాలో 66 శాతం మందికి ఉపాధి అందించే వ్యవసాయం రాష్ట్రం జిఎస్‌విఎలో 17 శాతం వరకు వాటా కలిగి ఉందని, అందుకే తెలంగాణ ఆర్థిక వృద్ధిలో వ్యవసాయ అభివృద్ధి కేంద్రబిందువుగా ఉంటుందన్నారు. రైతు ఆదాయం పెరగడం, ఉత్పాదకత పెరుగుదల, విలువ ఆధారిత వ్యవసాయం విస్తరణ, ఎగుమతుల పెంపు ఇవన్నీ 3 ట్రిలియన్ ఆర్థిక లక్ష్యాన్ని సాధించేందుకు అత్యంత కీలక అంశాలన్నారు. ఐఒటి ఆధారిత సూక్ష్మ నీటిపారుదల, నేల ఆరోగ్య నిర్వహణ, అగ్రిటెక్ పరిశోధన, టిఎఆర్‌సిసి, గ్లోబల్ సీడ్ లీడర్‌షిప్, హార్టికల్చర్ మెగా క్లస్టర్లు, ఆయిల్ పామ్ విస్తరణ, ఫామ్ టూరిజం, ఎఫ్‌పిఒలను ఫుడ్ డెలివరీ కంపెనీలతో అనుసంధానం చేయడం, పాల, మాంసం, మత్స్య రంగాల పెంపు, అధునాతన అగ్రి లాజిస్టిక్స్ వంటి కార్యక్రమాలు తెలంగాణ వ్యవసాయాన్ని గ్లోబల్ ప్రమాణాలకు తీసుకెళ్తాయని ఆయన తెలిపారు. రైతుల ఆదాయాలను గణనీయంగా పెంచడంతో పాటు వేల కోట్ల రూపాయల విలువైన అగ్రి ఎగుమతులకు మార్గం సుగమం చేయనుందన్నారు. విజన్ 2047 డాక్యుమెంట్ తెలంగాణ వ్యవసాయ రంగానికి ఒక దిశ నిర్దేశిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు.

రైతు సంక్షేమం ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని, రైతు భరోసా, రుణమాఫీ, పంట నష్టపరిహారం,రైతు బీమా వంటి పథకాలతో రాష్ట్ర ప్రభుత్వం రైతుల జీవనోపాధిని మెరుగుపరచడంతో పాటు భవిష్యత్తు వృద్ధికి బలమైన పునాది వేసిందన్నారు. ఇకపై సాంకేతికత, డేటా, మార్కెట్ ఆధారిత వ్యవసాయ మోడల్ ద్వారా రైతులను మరింత సాధికారులను చేయడం ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. వ్యవసాయ రంగం బలపడితేనే తెలంగాణ ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. రైతు శ్రమే రాష్ట్ర అభివృద్ధికి మూలం అని అన్నారు. గ్లోబల్ సమిట్ ద్వారా తెలంగాణ, వ్యవసాయం సాంకేతికత పెట్టుబడుల నూతన అధ్యాయాన్ని ప్రారంభించబోతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్, డైరెక్టర్ గోపి, అగ్రికల్చర్ యూనివర్సిటీ విసి జానయ్య, హార్టికల్చర్ యూనివర్సిటీ విసి రాజిరెడ్డి, మార్క్ ఫెడ్ ఎండి శ్రీనివాస్ రెడ్డి, హాకా ఎండి చంద్రశేఖర్ రెడ్డి, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీ బాయి తదితరులు పాల్గొన్నారు.

## గందరగోళం

(మొదటి పేజీ తరువాయి)

విశ్రాంతి అవసరాలను 12 గంటల నుండి 48 గంటల వరకు పెంచడం, వారానికి రెండు రాత్రిపూటలు ల్యాండింగ్‌లను మాత్రమే అనుమతించడం వంటి కొత్త నిబంధనలతో ఇండిగోలో సంక్షోభం ఏర్పడింది. సామూహిక రద్దులకు 'తప్పుడు తీర్పు, ప్రణాళిక అంతరాలు' కారణమని ఇండిగో పేర్కొంది. శుక్రవారం నాటి ఇండిగో విమానాలన్నింటినీ దాదాపు 235 విమానాలను రద్దు చేసినట్లు ఢిల్లీ విమానాశ్రయం ప్రకటించింది. చెన్నై విమానాశ్రయం కూడా ప్రధాన మెట్రో గమ్యస్థానాలకు బయలుదేరే అన్ని విమానాలను సాయంత్రం 6 గంటల వరకు నిలిపివేసింది. ఇండిగో ముంబయిలో 104, బెంగళూరులో 102, హైదరాబాద్‌లో 92 విమానాలను రద్దు చేసిందని విమానాశ్రయ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ ఇండిగో వైఫల్యానికి బిజెపి నేతృత్వంలోని ప్రభుత్వ గుత్తాధిపత్యమే కారణమని ఆరోపించారు. ఈ అంశం పార్లమెంటులో కూడా చర్చకు వచ్చింది. విమానాశ్రయాలలో మూడు రోజులుగా గందరగోళం నెలకొన్న తర్వాత, పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు ఒక ప్రకటన చేస్తూ.. 'రాబోయే మూడు రోజుల్లో సేవల పూర్తి పునరుద్ధరణ జరుగుతుందని భావిస్తున్నాము. వివిధ కార్యాచరణ దశలను ప్రారంభించడంతో, విమాన షెడ్యూల్‌లు శనివారం నాటికి సాధారణ స్థితికి చేరుకుంటాయని భావిస్తున్నాము' అని అన్నారు. 'విధులకు సంబంధించి కొత్త విమాన నిబంధనలను నిలిపివేయడం, కార్యకలాపాలను సాధారణీకరించడానికి ఇతర కార్యాచరణ చర్యలు తీసుకోవడం, ఇండిగో విమాన అంతరాయాలకు కారణాలు. జవాబుదారీతనం నిర్ణయించడానికి ప్రభుత్వం ఉన్నత స్థాయి విచారణకు ఆదేశించింది' అని ఆయన అన్నారు. విమాన విధుల నిబంధనలను సడలిస్తూ, డిజిసిఎ వారపు విశ్రాంతి సమయంలో సెలవుల ప్రత్యామ్నాయాన్ని అనుమతించింది. విమాన సర్వీసుల్లో అంతరాయాలు షెడ్యూల్‌లపై ప్రభావం పడడంతో ఇండిగో ఆన్‌టైమ్ పనితీరు గురువారం 8.5 శాతానికి పడిపోయింది. సాధారణంగా రోజుకు 2,300 దేశీయ, అంతర్జాతీయ విమానాలను నడిపే దేశంలోని అతిపెద్ద విమానయాన సంస్థ, ప్రధానంగా సిబ్బంది సమస్యల వల్ల కలిగే అంతరాయాలను పరిష్కరించే ప్రయత్నాలలో భాగంగా ఇప్పుడు విమానాలను రద్దు చేస్తోంది.

### కీలక ప్రకటన చేసిన ఇండిగో

కొద్దిరోజులుగా తమ సర్వీసుల్లో తీవ్ర అంతరాయం ఏర్పడటంపై దేశీయ విమానయాన సంస్థ ఇండిగో బహిరంగంగా క్షమాపణలు తెలిపింది. ఈ మేరకు ట్విట్టర్ (ఎక్స్ ) వేదికగా బహిరంగ ప్రకటన విడుదల చేసింది. కొన్నిరోజులుగా పరిస్థితులు ఎంత కఠినంగా ఉన్నాయో మేం అర్థం చేసుకోగలమని ఇండిగో సంస్థ ఒక ప్రకటనలో పేర్కొంది. అనేక విమానాలు రద్దు కావడంతో ప్రయాణికులు ఎయిర్‌పోర్టుల్లో గంటల తరబడి వేచి చూడాల్సి వచ్చిందని, ఇందుకు సంస్థ హృదయపూర్వక క్షమాపణలు కోరింది. ప్రయాణికులకు సహకరించేందుక, కార్యకలాపాలను సాధారణ స్థితికి తీసుకొచ్చిందేకు కృషి చేస్తున్నామని తెలిపింది. శనివారం నుంచి ఆపరేషన్లు క్రమంగా మెరుగుపడతాయని తెలిపింది. రద్దయిన ఫ్లైట్లకు సంబంధించి రీఫండ్ ఆటోమెటిగ్గా ఇచ్చేస్తామని ఇండిగో సంస్థ తెలిపింది. డిసెంబర్ 5వ తేదీ నుంచి 15వ తేదీ మధ్య టికెట్లు బుక్ చేసుకుని.. ఈ అంతరాయాల కారణంగా వాటిని రద్దు లేదీ రీషెడ్యూలింగ్ చేసుకుంటే పూర్తి రీఫండ్ ఇస్తామని ప్రకటించింది. కస్టమర్ల సౌకర్యం కోసం దేశవ్యాప్తంగా వేలాది హోటల్ గదులు, రవాణా సదుపాయాలను ఏర్పాటు చేశామని తెలిపింది. ఎయిర్‌పోర్టులో నిరీక్షిస్తున్న కస్టమర్ల కోసం భోజనం, స్నాక్స్ అందిస్తున్నామని పేర్కొంది. వృద్ధులకు లాంజ్ యాక్సెస్ అందించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపింది. సర్వీసుల్లో అంతరాయం నేపథ్యంలో కస్టమర్లకు ఇండిగో సంస్థ పలు సూచనలు చేసింది. మీ ఫ్లైట్ రద్దయితే ఎయిర్‌పోర్టుకు రావద్దని కస్టమర్లకు సూచించింది. వెబ్‌సైట్, నోటిఫికేషన్ల ద్వారా ఫ్లైట్ స్టేటస్‌ను చెక్ చేసుకోవాలని తెలిపింది. కస్టమర్ కాంటాక్ట్ సెంటర్‌కు రద్దీ కారణంగా వెయిట్ టైమ్ పెరిగినందుకు క్షమాపణలు చెబుతూ.. ఏఐ అసిస్టెంట్ 6ఇఎస్‌కెఎఐ ద్వారా ఫ్లైట్ స్టేటస్, రీఫండ్, రీబుకింగ్‌లు చెక్ చేసుకోవాలని కోరింది.

## ఇందిరమ్మ ఇండ్లు

(మొదటి పేజీ తరువాయి)

పాలసీ విడుదల కానుందన్నారు. మధ్య తరగతి ప్రజల కోసం లాభనష్టాలు లేకుండా అఫోర్డబుల్ హౌసింగ్ పాలసీకి రూపకల్పన జరుగుతోందని, దీని కోసం ఓఆర్ఆర్ చుట్టూ నాలుగు ప్రాంతాలు గుర్తించి, ఒక్కోచోట 8 నుంచి 10 వేల ఇండ్లు నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయని చెప్పారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంపై గ్లోబల్ సమ్మిట్‌లో చర్చించే యోచనలో ప్రభుత్వం ఉందని మంత్రి తెలిపారు.

**కూకట్‌పల్లిలో శిథిల భవనాల స్థానంలో హైరైజ్ అపార్ట్‌మెంట్‌లు..**

గతంలో కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు పరిధిలో శిథిలమవుతున్న ఇండ్లను తొలగించి హైరైజ్ అపార్ట్‌మెంట్‌ల నిర్మాణానికి అనుమతుల అంశం పరిశీలనలో ఉందని మంత్రి పొంగులేటి వెల్లడించారు. గతప్రభుత్వ కాలంలో అసంపూర్తిగా వదిలేసిన డబుల్‌బెడ్‌రూమ్ ఇండ్ల నిర్మాణాలను పూర్తిచేసి, రూ.200 కోట్లతో కాలనీలకు మౌలిక వసతులు కల్పించామన్నారు. హౌసింగ్ బోర్డు పరిధిలో లీజుకు ఇచ్చిన లేదా కబ్జా చేసిన భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటోందన్నారు. ఇప్పటికే వెయ్యి ఎకరాలకు ప్రహరీ గోడలు నిర్మించామన్నారు.

**సిబ్బందితో గృహనిర్మాణ శాఖను బలోపేతం చేశాం..**

గృహనిర్మాణ శాఖను పునరుద్ధరించి 394 మంది డిఈఈలను తిరిగి రప్పించామని, 800మంది ఏఈలను కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించామని, ఇతర శాఖల నుంచి 152 మంది, రెవెన్యూ శాఖ నుంచి 32 మందిని డిప్యూటేషన్‌పై తీసుకున్నామని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం అవినీతిరహితంగా కొనసాగేందుకు ఫిర్యాదులపై 24 గంటల్లో చర్యలు తీసుకుంటున్నామన్నారు. లంచం డిమాండ్ చేసిన 9 మంది పంచాయతీ కార్యదర్శులను సస్పెండ్ చేసి, ఇద్దరిని సర్వీసు నుంచి తొలగించినట్లు మంత్రి వివరించారు. గతంలో నిర్మాణం ప్రారంభించి, మధ్యలోనే వదిలిపోయిన 15 వేల మందికి కొత్త పథకం వర్తింపుపై క్యాబినెట్‌లో చర్చించనున్నామన్నారు. మూడో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో స్థలాలు లేని నిరుపేదలకు గృహాల నిర్మాణంపై కూడా సానుకూల నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. పేదలు నివసిస్తున్న ప్రాంతాల్లోనే జి ప్లస్ 3, 4 నమూనాలో ఇండ్ల నిర్మాణానికి సంబంధించి ఇందిరమ్మ అర్బన్ హౌసింగ్ పాలసీని త్వరలో ప్రకటించనున్నట్లు మంత్రి తెలిపారు.

**హిల్ట్ పాలసీపై కేటీఆర్ విమర్శలు నిరాధారాలు..**

హిల్ట్ పాలసీపై బిఆర్ఎస్ చేస్తున్న విమర్శలు పూర్తిగా అవాస్తవాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. హిల్ట్ పాలసీపై అడిగిన ప్రశ్నలకు ఆయన స్పందించారు. హిల్ట్ పాలసీలో ఉన్న రెండు కీలక అంశాలు బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలోనే ప్రవేశించాయని, ఆ ఫైళ్లపై అప్పటి మంత్రిగా కెటిఆర్ సంతకాలు చేసిన విషయాన్ని ఎలా మరిచిపోతారని ప్రశ్నించారు. కోకాపేట్, నియోపోలిస్ ప్లాట్ల వేలం, ఓఆర్ఆర్ నిర్వహణ హక్కుల వేలం, ఇవి అన్ని గత ప్రభుత్వంలోనే జరిగినప్పటికీ, ఇప్పుడు హిల్ట్ పాలసీని దోపిడీ పాలసీగా అభివర్ణించే నైతిక హక్కు కెటిఆర్‌కు లేదన్నారు. 'ముఖ్యమంత్రిగా అయ్య, పరిశ్రమల శాఖ మంత్రిగా కుమారుడు' కలిసి ముడుపులు తీసుకుని భూముల కన్వర్షన్‌లు జరిపారన్నారు. పరోక్షంగా, ప్రత్యక్షంగా వేల ఎకరాలను వేలం వేశారని విమర్శించారు.

**సిరీస్ ఫ్యాక్టరీ భూముల విషయంలో గత ప్రభుత్వానిదే బాధ్యత..**

ఎల్.బి. నగర్‌లోని సిరీస్ ఫ్యాక్టరీ భూముల విషయంలో బిఆర్ఎస్ ప్రభుత్వానిదే బాధ్యత అని మంత్రి పొంగులేటి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం పి.వి.రాజు ఫార్మా కంపెనీకి లీజుగా ఇచ్చిన 40 ఎకరాల స్థలాన్ని, భూగర్భ జలాలు కలుషితం చేస్తున్నారని ప్రజలు ఆందోళనలు చేసిన ప్రాంతాన్ని రెసిడెన్షియల్ జోన్‌గా మార్చింది బిఆర్ఎస్ ప్రభుత్వమేనన్నారు. ఆ ఫైళ్లపై కెసిఆర్, కెటిఆర్ సంతకాలు చేశారన్నారు. ఇదేవిధంగా ఐడిపిఎల్‌లో కూడా చేశారన్నారు. కెటిఆర్ వ్యాఖ్యలు కడుపుమంటతో కూడిన విషపూరిత ఆలోచనలని మంత్రి పొంగులేటి మండిపడ్డారు. హిల్ట్ పాలసీ విషయంలో బిజెపి, బిఆర్ఎస్ కలిసి చేస్తున్న డ్రామాకు ఒకే స్క్రిప్ట్ కనబడుతోందని, రాసేది ఒకరు, చదివేది మరొకరని విమర్శించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com